www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 242 | గురువారం 22-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ



లక్ష కోట్లు...

- దేశవ్యాప్తంగా 9339 మంది డిఫాల్టర్లు
- మూడేళ్లల్లో 340 శాతం పెరిగిన ఎగవేత
- 2015 నుంచి మొండిబకాయిలు మూడురెట్లు

విశాలాంధ్ర ప్రతినిధి - న్యూఢిల్లీ :
'విదేశాల్లో నల్లధనాన్ని రప్పిస్తాం. దేశ ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం'. ఇదీ గత ఎన్నికల్లో నరేంద్ర మోడీ గంభీర హామీ. కోల్‌స్కామ్... 2జీ స్కామ్‌లను పదే పదే ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీపై అవినీతి దుప్పటిని ప్రధాని కప్పుతుండగా... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లల్లో ...జాతీయ బ్యాంకుల్ని గుల్లగుల్ల చేసి కార్పొరేట్లు విదేశాలకు ఎగిరిపోతున్నారు. లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా రూ.9వేల కోట్లు ఎగనామం



పెడితే...తాజాగా నీరవ్ మోడీ ఏకంగా రూ.16వేల కోట్లకు పంగనామం పెట్టారు. విదేశాల నుంచి నల్లధనం రాక కోసం జనం ఎదురు చూస్తుంటే... దేశ ప్రజల కష్టార్జితాన్ని దోచుకుని తెల్లధనాన్ని విదేశాలకు తరలిస్తున్నారు. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో... దేశంలోని 9,339 మంది కేటుగాళ్లు ఏకంగా రూ.1,11,738 కోట్లు ఎగ్గొట్టారు. కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో బ్యాంకుల్లో ఉద్దేశపూర్వక ఎగనామం 340 శాతానికి పెరిగిందంటే... సర్కారు ఏ రీతిలో కార్పొరేటు కేటుగాళ్లకు సహకరిస్తోందో అర్థం కాగలదు. పది వేల రుణం కోసం రైతులను ఊపిరి తీసుకోనీయని బ్యాంకర్లు... అన్నదాత ఆత్మహత్యతో వచ్చిన ఇన్సూరెన్స్‌తో బకాయి పిండుకుంటూ... బడాబాబులకు వేల కోట్లు దోచిపెడుతున్నాయంటే కేవలం ఆరోపణ కాదు. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా సమాచారం మేరకు... 2017 సెప్టెంబరు నాటికి 7,564 మంది డిఫాల్టర్లు రూ.93,357 కోట్లు ఎగ్గొట్టారు. 2013లో బ్యాంకుల బకాయిల విలువ రూ.25,410 కోట్లు ఉండగా... గడచిన

- మిగతా 2 లో

ఇదే చైనాలో అయితే...

- వివరాలు 2 లో

మీలో ఒకడిని

మదురై సభలో ప్రజలతో కమల్

పార్టీ పేరు మక్కళ్ నీది మయ్యమ్

- లోకనాయకుడి రాజకీయ అరంగేట్రం
- ప్రజల నుంచి సలహాలు తీసుకుంటా..
- అవినీతి రహిత రాష్ట్రమే ధ్యేయం

மக்கள் நீதி மய்யம்



మదురై:
విలక్షణ నటుడు కమల్‌హాసన్ బుధవారం రాజకీయ అరంగేట్రం చేశారు. తన రాజకీయ పార్టీ పేరును ప్రకటించారు. 'మక్కళ్ నీది మయ్యమ్' (జస్టిస్ ఫర్ పీపుల్) పేరుతో ప్రారంభిస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. దీంతో తమిళనాడులో సరికొత్త రాజకీయ పార్టీ అవతరించింది. మదురైలోని ఒత్తకడై మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో

- మిగతా 11 లో

ఇక ఫోన్ నంబర్లలో

13 అంకెలు..!



టెలికాం శాఖ సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ:
వినియోగదారులకు మరింత భద్రత కల్పించే విధంగా టెలికాం శాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలోని మొత్తం సిమ్ ఆధారిత ఎం2ఎం (మెషీన్ టు మెషీన్) వినియోగదారులకు... 13 అంకెలతో కూడిన మొబైల్ నంబర్లను ఇవ్వాలని టెలికాం కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే 10 అంకెల ఫోన్ నంబర్ వాడుతున్న వినియోగదారులు ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి 13 అంకెల నంబరుకు పోర్టబుల్ చేసుకోవాలి. డిసెంబరు 31 నాటికల్లా పోర్టబులిటీ గడువు ముగుస్తుంది. జనవరి 8 నాటికే దీనిపై టెలికాం శాఖ నుంచి తమకు ఆదేశాలు అందాయనీ... దానిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైందని బీఎస్ఎన్ఎల్ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 13 అంకెల ఎం2ఎం నంబర్ విధానాన్ని అమలు చేయాలని టెలికాం శాఖ నిర్ణయించింది. ఆరోజు నుంచి కొత్తగా తీసుకునే అన్ని మొబైల్ ఫోన్ నంబర్లలో 13 అంకెలు ఉంటాయి. ఇప్పటికే 10 అంకెల నంబర్ వాడుతున్న వినియోగదారులు అక్టోబరు 1 నుంచి డిసెంబరు 31లోపు కొత్త నంబర్‌కు మారాల్సి ఉంటుందని వెల్లడించారు. మరోవైపు ఇదే విషయాన్ని టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ధ్రువీకరించింది. మెషీన్ టు మెషీన్ కమ్యూనికేషన్స్‌లో స్పెక్ట్రమ్, రోమింగ్, క్యూవోఎస్‌కు సంబంధించి టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్‌కు లిఖిత పూర్వకంగా స్పందన తెలిపింది. టెలికాం శాఖ సిమ్ ఆధారిత ఎం2ఎం డివైజ్‌ల కోసం 13 అంకెల నంబరింగ్ సిరీస్‌ను ఆమోదించిందనీ.. ఇప్పటికే చలామణీలో ఉన్న 10 అంకెల నంబర్‌తో పాటు పనిచేసే విధంగా కొత్త నంబరింగ్ విధానం ఉంటుందని వెల్లడించింది.

నవయుగకు రూ.1244 కోట్లు

- పోలవరం కాంక్రీట్ పనులకు పాలనాపరమైన అనుమతులు
- ఉద్యోగుల డిఏ పెంపు
- 3.86 లక్షల మందికి లబ్ధి
- 2017 జనవరి 1 నుంచి అమలు.
- ఏసీబీ లో నూతన నియామకాలు ..



విశాలాంధ్ర అమరావతి :
ఉగాదికి ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపి కబురు అందించింది. డీఏ 2.096 శాతం విడుదల చేసేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కాల్వ శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుందని చెప్పారు. 2015 వేతన సవరణ మేరకు 22.008 శాతం నుంచి 24.104 శాతం మేరకు డీఏ పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల 2.096 శాతం పెరుగుదల లభించింది. యూజీసీ స్కేల్ వర్తించే వారికి 132 నుంచి 136 శాతానికి డీఏ పెరగనుందన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులకు ఇస్తున్న మొత్తానికి అదనంగా నెలకు రూ.300 చొప్పున తాత్కాలిక పెంపు చేస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుందని తెలిపారు. పెంచిన కరవు భత్యం 2017 జనవరి 1నుంచి చెల్లిస్తారు. పెంచిన కరవు భత్యం నగదు రూపంలో ఈ ఏడాది ఏప్రిల్ 1న

- మిగతా 2 లో

బొగ్గుగనుల ప్రైవేటీకరణపై

సీపీఐ ఆగ్రహం

న్యూఢిల్లీ :
దేశంలోని బొగ్గుగనులను ప్రైవేటురంగంలో దేశ, విదేశీ కంపెనీలకు అప్పగించాలని కేంద్ర మంత్రివర్గ ఆర్థిక వ్యవహారాల శాఖ చేసిన నిర్ణయంపై సీపీఐ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పార్టీ కేంద్ర కార్యదర్శివర్గం బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. ఒకవైపు బ్యాంకింగ్ రంగంలో భారీ కుంభకోణాలను మోడీ ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంకును నీరవ్ మోడీ లూటీపై బాధ్యత తీసుకుని ప్రజా ధనాన్ని తిరిగి వసూలు చేయడానికి బదులుగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి కట్టబెడుతున్నారు. దేశం సంక్షోభంలో పడినప్పుడల్లా మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌సంస్థలకు, బడా వాణిజ్య సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నది. దేశంలో ఉత్పత్తిఅయ్యే విద్యుత్తులో 75శాతం బొగ్గురంగం నుంచే ఉత్పత్తి అవుతున్నది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం దేశ ఇంధన

- మిగతా 2 లో

బుందేల్ ఖండ్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ పార్క్

- యూపీ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో మోడీ
- మొదటి రోజు రూ.4.28లక్షల కోట్ల ఒప్పందాలు

9లో



ఏపీ టెట్ పరీక్షలకు

తొలిరోజే ఆటంకం..!

- మొరాయించిన సర్వర్లు
- 'అనంత'లో పేపర్-1కు అంతరాయం
- అయోమయంలో అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
ఏపీ టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజే పలు జిల్లాల్లో సర్వర్లు మొరాయించడంతో పరీక్షలకు అంతరాయం కలిగింది. ఆన్‌లైన్ సెంటర్లలో తగినన్ని కంప్యూటర్లు లేనందున అభ్యర్థులు అసౌకర్యానికి గురయ్యారు. టెట్ పరీక్షల కోసం ఆంధ్రప్రదేశ్‌తోపాటు హైదరాబాద్, చెన్నయ్, బెంగుళూరులో మొత్తంగా 190 ఆన్‌లైన్ కేంద్రాల ఏర్పాటు చేశారు. మార్చి 2వరకూ కొనసాగనున్న పరీక్షల కోసం 4,46,833 మంది అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేశారు.దాదాపు 98 శాతం మంది అభ్యర్థులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడింగ్ చేసుకున్నారు.ఈ నెల 21 నుంచి 24వరకూ టెట్ పేపర్-1(ఎస్జీటీ అభ్యర్థులకు), ఈ నెల 25 నుంచి 28 వరకూ టెట్ పేపర్-2(ఆల్ స్కూలు అసిస్టెంట్స్), మార్చి 1,2 తేదీల్లో టెట్ పేపర్-3(లాంగ్వేజీ పండిట్లు) పరీక్షలు కొనసాగుతాయి.తొలిరోజు టెట్ పేపర్-1 పరీక్షను మొదటి సెషన్‌లో
ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించారు.తొలిసారిగా పూర్తి ఆన్‌లైన్లో అభ్యర్థులు పరీక్షలను రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 13జిల్లాల డీఈవోలు పరీక్షలను

- మిగతా 2 లో

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా డేగా ప్రభాకర్



3లో

ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేల అరెస్టు

- హోంమంత్రిత్వశాఖకు లెఫ్టినెంట్ గవర్నర్ నివేదిక

11లో



బహిరంగ సభలో మాట్లాడుతున్న నారాయణ. వేదికపై చంద్రశేఖర్, హరినాథ్‌రెడ్డి తదితరులు

మోడీ పాలన కుంభకోణాలమయం

- మూడేళ్లలో 5లక్షల కోట్లు బ్యాంకుల ద్వారా దోపిడీ
- బీజేపీ, టీడీపీలపై సమిష్టి పోరాటం
- చిత్తూరు బహిరంగసభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

11లో

ఇదీ లోకం!



మరింత దూకుడు

- ఏసీబీలో కొత్తగా 350 పోస్టులు
- ఏటా రూ.24.41 కోట్ల అదనపు భారం
- ఆమోదముద్ర వేసిన మంత్రివర్గం

GOVERNMENT OF ANDHRA PRADESH ANTI-CORRUPTION BUREAU

విశాలాంధ్రబ్యూరో - అమరావతి
అవినీతిపరులు, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టే వారి విషయంలో అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) మరింత దూకుడుగా వ్యవహరించనుంది. అత్తెసరు సిబ్బందితోనే పెద్ద తిమింగాలలు, లంచవుతారుల పాలిట సింహస్వప్నంలా మారిన ఏసీబీ, ప్రభుత్వ ఊతంతో మరింత ఎక్కువగా దాడులకు పాల్పడేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది. గతంతో పోల్చితే ఏడాదిన్నరలోనే ఏసీబీ పనితీరు మెరుగ్గా ఉంది. దీంతో ప్రభుత్వం ఏసీబీ అధికారుల శ్రమను గుర్తించి, వారిపై అదనపు భారం లేకుండా చేయాలని నిర్ణయించింది. ఈ శాఖను మరింత పటిష్టపరిచేందుకు ప్రభుత్వం కొత్తగా 350 పోస్టుల భర్తీకి అనుమతినిచ్చింది. ఈ మేరకు వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఆమోద ముద్ర వేసింది. ఏసీబీలో సుమారు 411 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం వంద మందికి మించి సిబ్బంది లేరు. ఏసీబీ అధికారులు, సిబ్బందికి నైపుణ్య శిక్షణ, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.50 కోట్లను కేటాయించాలని ఇటీవల ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీనిపై 'విశాలాంధ్ర' దినపత్రికలో ప్రత్యేక కథనం మంగళవారం ప్రచురితమైంది. కొత్తగా జాయింట్ డైరెక్టర్ పోస్టు నుంచి కంప్యూటర్ ఆపరేటర్ వరకు 300 పోస్టులను భర్తీకి,ఇతర విభాగాలకు అవసరమైన మరో 50 మందిని అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నేరుగా నియమించుకునే

- మిగతా 2 లో

సిరియాలో కుర్దులపై టర్కీ దాడులు



డమాస్కస్ : సిరియాలో కుర్దు స్థావరాలపై టర్కీ దళాలు మంగళవారం దాడులు జరిపాయి. టర్కీ దాడులను తిప్పికొట్టేందుకు సిరియా ప్రభుత్వ దళాలు ప్రయత్నించాయి. సిరియా సైనిక దళాల అధీనంలోవున్న అఫ్రిన్ ప్రాంతంలో అనేక గ్రామాలు హర్బుల్ మెరియామిన్, ఇసా, తల్‌రిఫర్ట్, తార్నాథ్ పట్టణాలపైన టర్కీ దళాలు భారీ షెల్లింగుకు పాల్పడ్డాయి. టర్కీ దళాలు షెల్లింగు చేయడానికి ముందు కుర్దుల అధీనంలోవున్న అఫ్రిన్ ప్రాంతంలో సిరియా దళాలు దాడులు చేయనున్నట్టు సనా వార్తాసంస్థ అంతకుముందే వార్తను అందించింది. సిరియా దళాలు, ప్రభుత్వ అనుకూల మిలీషియాలు అలెప్పో ఉత్తరప్రాంతంలో తమ పట్టు సాధించుకునేందుకు ప్రయత్నించాయి. టర్కీ సైనిక దళాలను నిలువరించేందుకు సరిహద్దువెంట సిరియా ప్రభుత్వ దళాలను అనుమతిస్తామని కుర్దిష్ అధికార ప్రతినిధి బద్రస్‌జైకుర్దు రాయిటర్స్‌కు తెలిపారు. సరిహద్దుల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సిరియా, కుర్దు అధికార ప్రతినిధి ఒకరు తెలియజేశారు.

భారత్ సూచనకు మాల్దీవుల బేఖాతరు



మాలే : దేశంలో అత్యవసర పరిస్థితిని పొడిగించవద్దని భారత ప్రభుత్వం చేసిన సూచనను మాల్దీవుల ప్రభుత్వం పట్టించుకోలేదు. మొదట 15 రోజులు అత్యవసర పరిస్థితిని ప్రభుత్వం విధించింది. తాజాగా మంగళవారం నుంచి మరో 30 రోజులు అత్యవసర పరిస్థితిని పార్లమెంటరీ కమిటీ పొడిగించడం ద్వారా భారత సూచనను తిరస్కరించినట్లయింది. రాజ్యాంగ ఆంక్షలను సడలించడం ద్వారా అత్యవసర పరిస్థితిని పార్లమెంటరీ జాతీయ భద్రతా స్థాయీ సంఘం పొడిగించినట్టుగా అధ్యక్షుడు అబ్దుల్లా యమీన్ కార్యాలయం ఒక ప్రకటనను జారీ చేసింది. ఈనెల 1వ తేదీన ఏర్పడిన దేశభద్రతకు ముప్పు, రాజ్యాంగ సంక్షోభం కారణంగా అత్యవసర పరిస్థితిని విధించి తిరిగి పొడిగిస్తున్నట్టు ఆ ప్రకటన తెలిపింది. ఈ పరిణామానికి ముందు సుప్రీంకోర్టు ప్రవాసంలో వున్న మాజీ అధ్యక్షుడు మొహమ్మద్‌నషీద్ మరో 12 మంది నిషేధిత పార్లమెంటు సభ్యులపైన చర్యలను ఉపసంహరించుకొని జైలునుంచి విడుదల చేయవలసిందిగా సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఎమీన్ ప్రభుత్వం ఆ ఆదేశాలను తిరస్కరించి ఏకంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులనే అరెస్టు చేయించడంతో దేశంలో ఒక్కసారిగా కల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో యమీన్ అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ చర్య అక్రమమని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. తాజాగా అత్యవసర పరిస్థితిని పొడిగించడం చట్టవిరుద్ధమైనదని నషీద్ వ్యాఖ్యానించారు. అత్యవసర పరిస్థితి పొడిగించాలంటే కనీసం 43 మంది సభ్యులు పార్లమెంటులో ఉండాలని ప్రస్తుతం అంతమంది సభ్యులులేరని అందువల్ల ఇది చట్టవిరుద్ధమవుతుందని నషీద్ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి విధించడం, పొడిగించడం చట్టవిరుద్ధమేనని ఆయన అన్నారు. యమీన్ తుపాకీచూపి పరిపాలన చేస్తున్నాడని ఆయన విమర్శించారు. యమీన్ చేసే చర్యలలో ఒక్కటి కూడా న్యాయబద్ధమైనదికాదని అన్నారు. పొరుగునవున్న మాల్దీవులలో రాజకీయ, రాజ్యాంగ సంక్షోభం ఏర్పడిన నేపథ్యంలో భారతదేశం తన వ్యూహాన్ని ఇంతవరకు ప్రకటించలేదు. అయితే సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయవలసిందిగా మాల్దీవుల ప్రభుత్వాన్ని మంగళవారం ఢిల్లీ ప్రభుత్వం కోరింది. ఐక్యరాజ్యసమితి, అమెరికా, బ్రిటన్, ఈయూ, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలు చట్టబద్ధ పాలనకు చర్యలు తీసుకోవాలని యమీన్‌ను కోరాయి.

పోలెండుకు హంగరి తోడ్పాటు

బుడాపెస్ట్ : యూరోపియన్ కమిషన్‌తో పోలెండుకు ఏర్పడిన తగాదాను ప్రస్తావిస్తూ హంగరి పార్లమెంటు పోలెండుకు తమ తోడ్పాటును ప్రకటిస్తూ తీర్మానం చేసింది. హంగరి ప్రధానమంత్రి విక్టర్ ఓర్బన్ ఫిడెజ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా అనుకూలంగా 114 ఓట్లు, ప్రతికూలంగా 13 ఓట్లు లభించాయి. గత ఏడాది డిసెంబర్ 20న యూరోపియన్ కమిషన్ పోలెండులో చేపట్టిన న్యాయసంస్కరణపై నిషేధాన్ని విధిస్తూ అసాధారణమైన చర్య తీసుకున్నది. పోలెండులో చట్టాల ఉల్లంఘన తీవ్రంగా జరుగుతున్నదని యూరోపియన్ కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నది. ఈనేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌లోని 28 సభ్యదేశాలలో పోలెండుకు ఓటింగు హక్కు రద్దయ్యే అవకాశం ఉన్నది. యూరోపియన్ కమిషన్ పోలెండుల మధ్య జరుగుతున్న ఈ ఘర్షణలో పోలెండుకు హంగరి తన తోడ్పాటును ప్రకటించింది.

చైనాలో వసంతరుతువు వేడుకలు



బీజింగ్ : చైనాలో వసంతరుతువు వేడుకలు 5 రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. నూతన చాంద్రమాన సంవత్సరం సందర్భాన్ని పురస్కరించుకొని సంప్రదాయబద్ధమైన రీతిలో ప్రజలు ఆనందంగా పండుగ చేసుకుంటున్నారు. బాణసంచా పేల్చారు. విందు భోజనాలు ఆరగించారు. మంచి భవిష్యత్తు రావాలని ఆశిస్తూ ఇళ్లను శుభ్రం చేసుకున్నారు.పండుగ సందర్భంగా చేసే వంటకాలను ప్రత్యేకంగా చేసి ఆరగించారు. వసంతరుతువు సందర్భంగా మొదటిరోజు అన్నిరకాల వ్యాపారాలను నిర్వహిస్తారు. అయితే 5వ రోజు వాటన్నిటినీ నిలిపివేసి వేడుకలలో మునిగిపోయారు. అత్యంత ముఖ్యమైన సాంప్రదాయం ఇప్పటికీ ఒకటి కొనసాగుతున్నది. పేదరికం దేవతను సాగనంపి సంపద దేవతను ఆహ్వానించడం 5వ రోజు వేడుకలలో ముఖ్యమైన అంశం. చెత్తాచెదారంతో మంటలువేసి దుర దృష్టాన్ని, పేదరికాన్ని అందులోవేసి కాలుస్తున్నట్టుగా భావిస్తారు. సంపద దేవత ఇళ్లలో ప్రవేశించేందుకు తలుపులు, కిటికీలు తెరిచివుంచి విందు భోజనాలు ఆరగించారు. ప్రభుత్వం గత 5 సంవత్సరాలుగా సమాజంనుంచి పూర్తి పేదరికాన్ని తరిమికొట్టేందుకు కృషి చేస్తున్నది. ఫలితంగా 60 మిలియన్ల ప్రజలు పేదరికంనుంచి బయటపడి అభివృద్ధిచెందారు. పేదరికంస్థాయి 10.2 శాతం నుంచి 4 శాతానికి తగ్గింది. 2020 నాటికి గ్రామీణ ప్రాంతాలలో దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న వారందరినీ పేదరికంనుంచి బయటపడవేయాలని చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ జాతీయ మహాసభ ప్రతినపూనింది. ఒకమాదిరి అభివృద్ధి చెందిన సమాజంగా 2020 నాటికి తీర్చిదిద్దాలని కూడా మహాసభ తీర్మానించింది. నూతన సంవత్సరం వేడుకలు ప్రారంభం కావడానికి ముందు సిచువాన్ రాష్ట్రంలో దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ పర్యటించి అమాయకత్వం, వెనుకబాటుతనం, పేదరికం పూర్తిగా పరిష్కరిస్తామని వాగ్దానం చేశారు. కొండప్రాంతాలలో నివసిస్తున్నవారితో ఆయన మమేకమై పేదకుటుంబాల వద్దకు వెళ్లి వారి క్షేమసమాచారం తెలుసుకున్నారు. పేదరికం నిర్మూలనలో జరిగే పోరాటంలో తాము విజయం సాధిస్తామని ఆయన అన్నారు.

చైనాతో బంధంపై ఆందోళన వద్దు

భారత్‌కు బంగ్లాదేశ్ ప్రధాని హసీనా సూచన



ఢాకా : ఇరుగు పొరుగు దేశాలతో భారత దేశం మంచి సంబంధాలను కొనసాగించాలని, ఫలితంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, దీనిద్వారా తామంతా కలిసికట్టుగా పనిచేస్తున్నట్టు ప్రపంచానికి తెలియజేయవచ్చునని బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా సూచించారు. చైనాతో తమ సంబంధాల పెరుగుదలను చూసి భారతదేశం ఆందోళన చెందవలసి అవసరంలేదని ఆదేశంతో బంధం తమ అభివృద్ధికోసం మాత్రమేనని హసీనా అన్నారు. తాము అభివృద్ధి గురించి మాత్రమే ఆందోళన చెందుతున్నామని తమ దేశానికి సహాయం చేసే ఏ దేశంతోనైనా సంబంధాలను పెంపొందించుకుంటామని ఆమె చెప్పారు. ఎవరు సహకరిస్తామన్నా ఎవరు వచ్చి పెట్టుబడులు పెడతామన్నా తాము ఆహ్వానిస్తామని ఆమె చెప్పారు. భారతదేశంతో తమ స్నేహ సంబంధాలు బ్రహ్మాండంగావున్నాయని సముద్రయానం, సరిహద్దు వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా రెండు దేశాలు ఇతరులకు మార్గదర్శకంగా నిలిచాయని హసీనా అన్నారు. తమ మధ్య ఏ సమస్య వచ్చినా చర్చల ద్వారా పరిష్కరించుకుంటున్నామని గతంలో కూడా ఇలాగే చేశామని ఆమె చెప్పారు. ప్రశాంతమైన దక్షిణాసియాను నిర్మించాలన్నదే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. 1996-2001 మధ్యకాలంలో హసీనా ప్రధానమంత్రిగా చేసినప్పుడు గంగాజలాల పంపిణీ ఒప్పందంపైన రెండు దేశాలు సంతకాలు చేశాయి. ఇటీవలకాలంలో చైనా-బంగ్లాదేశ్‌లు సైనిక సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. బంగ్లా సైన్యానికి శిక్షణ ఇవ్వడానికి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు చైనా సహకరిస్తుంది. బంగ్లాదేశ్‌లో ఆరు రైల్వేప్రాజెక్టుల నిర్మాణానికి 9 బిలియన్ డాలర్ల రుణాన్ని తక్కువ వడ్డీకి ఇచ్చేందుకు చైనా అంగీకరించింది. ఈ ప్రాజెక్టులలో ఒకటి భారత్ సరిహద్దులలో నిర్మిస్తారు. మైన్మార్‌నుంచి తరలివచ్చిన 10 లక్షల మంది రొహింగ్యా ముస్లింల సమస్య పరిష్కారంలో భారతదేశ సహకారాన్ని కోరుతున్నామని హసీనా ప్రకటించారు.

పాలస్తీనా ఇజ్రాయిల్ ఏర్పాటే పరిష్కారం



ఐరాస : ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల ఏర్పాటే సరైన పరిష్కారమని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అంటోనియో గుటెర్రెన్ పునరుద్ఘాటిం చారు. రెండుదేశాల ఏర్పాటుకు తాము తోడ్పాటు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ దిశలో పరిష్కారానికి ప్రయత్నించే వారికి తమ పూర్తి సహకారాన్ని అందించేందుకు ఐరాస కట్టుబ డివుందని తాను వ్యక్తిగతంగా కూడా పూర్తిగా సహ కరిస్తామని ఆయన అన్నారు. రెండు ప్రజాస్వామ్య దేశాలు పక్కపక్కనే శాంతియుతంగా, భద్రంగా గుర్తింపుకలిగిన సరిహద్దులతో ఏర్పడగలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇందుకు మరో ప్రత్యామ్నాయంలేదని అన్నారు. రెండుదేశాల ఏర్పాటుకు ప్రపంచదేశాలన్నీ వ్యక్తం చేసిన ఏకాభిప్రాయం క్రమంగా తగ్గిపోతున్నదని ఆయన చెప్పారు. ఒకే దేశం ఏర్పాటుకు చేసే ప్రయత్నానికి వాస్తవంగా తీవ్రమైన ఆటంకాలు ఎదురౌతాయని, అది సాధించడం అసాధ్యమని న్యాయమైన, చారిత్రాత్మక ప్రజాస్వామ్య ఆకాంక్షలు నెరవేరేందుకు ఇజ్రాయిల్, పాలస్తీనా ఏర్పాటు సరేందని చెప్పారు. గాజా ప్రాంతంలో పాలస్తీనా ప్రజలు దశాబ్దికాలంగా హమాస్ నియంత్రణలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాలస్తీనా శరణార్థులకు ఐక్యరాజ్యసమితి అందించే సహాయనిధులు తక్కువగా ఉంటున్నాయని అంతర్జాతీయ సమాజం దీన్ని పట్టించుకోవాలని, ఉదారంగా మద్దతునివ్వాలని కోరారు.

అబార్షన్ హక్కుకు అర్జంటైనాలో ప్రదర్శన



అర్జంటైనా పార్లమెంటుముందు వేలాదిమంది మహిళలు ప్రదర్శన జరిపి అబార్షన్ హక్కును మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. ఆకుపచ్చని కర్చీఫ్‌లు చేతిలో ఉంచుకొని మహిళలు ప్రదర్శన జరిపారు. భద్రమైన, అబార్షన్ స్వేచ్ఛను అందించే చట్టబద్ధ హక్కును కల్పించాలని ఆన్‌లైన్ ద్వారా జాతీయస్థాయి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ అంశంపై ప్రజలలో చర్చ జరగవలసిన అవసరం ఉందని అనేకమంది ట్వీట్ చేశారు. ఎంపిక చేసుకునే హక్కు కార్యకర్తలు ప్రచారాన్ని చేపట్టారు. అబార్షన్ చట్టబద్ధం చేయాలని కోరుతున్న మహిళలు కొంతమంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. అర్జంటైనా చట్టప్రకారం అబార్షన్లు చట్టవిరుద్ధమవుతాయి. గర్భం దాల్చిన సమయంలో మహిళ ప్రాణానికి లేదా ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం ఏర్పడినప్పుడూ, అత్యాచారానికి గురై గర్భం దాల్చినప్పుడు చట్టంకింద అబార్షన్‌కి అనుమతిస్తారు. అయితే అబార్షన్‌ను చట్టబద్ధం చేయవలసిందిగా చాలాకాలంగా మహిళలు ఆందోళన చేస్తున్నారు.

లక్ష కోట్లు...

(మొదటిపేజీ తరువాయి)

మూడేళ్లల్లో ఈ సంఖ్య 340 శాతానికి పెరిగింది. ఐతే పన్నుఎగవేతదారులను బహిర్గతం చేయటంలో ఇప్పటికీ ఆర్బీఐ చొరవ చూపటం లేదు. 2017 సుప్రీం కోర్టు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ రూ.500 కోట్లకు పైగా ఎగనామం పెట్టిన డిఫాల్టర్ల వివరాలను బహిర్గత పరచలేమని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఏ లక్ష్యం కోసం రుణం తీసుకున్నారో... అందుకు నిధులను ఖర్చు చేయకుండా బ్యాంకులకు బకాయిలను చెల్లించని వ్యక్తులు, లేదా సంస్థలను డిఫాల్టర్లుగా ఆర్బీఐ నిర్వచించింది. రుణానికి జామీనుగా ఉంచిన స్థిర, చరాస్తులను విక్రయించిన రుణగ్రస్తులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా బ్యాంకులు పరిగణిస్తాయి. రూ.11,400 కోట్ల పీఎన్‌బీ కుంభకోణంలో నీరవ్ మోడీ ఎగనామం పెట్టగా 2017 డిసెంబర్ నాటికి ఇదే బ్యాంక్‌కు మరో 1,018 మంది డిఫాల్టర్లు రూ.12,574 కోట్లు ఎగ్గొట్టారు. పీఎన్‌బీ విడుదల చేసిన జాబితా ప్రకారం, విన్సమ్ డైమండ్స్ రూ.899 కోట్లు, నాఫెడ్ రూ.224 కోట్లు, యాపిల్ ఇండస్ట్రీస్ రూ.248 కోట్లకు ఎగనామం పెట్టిన ప్రధాన డిఫాల్టర్ సంస్థలు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 1,665 మంది రూ.27,716 కోట్లు పంగనామం పెట్టారు. వీరిలో ప్రధానంగా కింగ్‌ఫిషర్ ఎయిర్ లైన్స్ రూ.1,286 కోట్లు, కాలిక్స్ కెమికల్స్ రూ.327 కోట్లు, జేబీ డైమండ్స్ రూ.208 కోట్లు, స్పాంకో రూ.347 కోట్లు, జెనిత్ బిర్లా రూ.139 కోట్లు, శ్రీమ్ కార్ప్ రూ.283 కోట్లు, జూమ్ డెవలపర్స్ రూ.378 కోట్లు, ఫన్ లీజింగ్ రూ.403 కోట్లు, జీఈటీ ఇంజనీరింగ్స్ రూ.406 కోట్లు ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టాయి. ఐడీబీఐ బ్యాంకును 83 మంది గుల్ల చేశారు. దాదాపు రూ.3,659 కోట్లు చెల్లించలేదు. వీరిలో రీడ్ టయలర్స్ రూ.206 కోట్లు, ఎస్ కుమార్ నేషన్‌వైడ్ రూ.834 కోట్లు, డెక్కన్ క్రానికల్ రూ.269 కోట్లు చెల్లించలేదు. ఇక బ్యాంక్ ఇండియాలో 314 మంది రూ.6,104 కోట్లు రుణం పేరిట కొల్లగొట్టారు. వీరిలో రీడ్ టయలర్స్ రూ.236 కోట్లు, ఫరెవర్ ప్రెషియస్ డైమండ్స్ రూ.158 కోట్లు, మోహన్ జెమ్స్ రూ.158 కోట్లు ఎగనామం పెట్టగా, బ్యాంక్ ఆఫ్ బరోడాలో కింగ్ ఫిషర్ ఎయిర్‌లైన్స్ రూ.432 కోట్లు, ఏబీసీ కాటిన్స్పిన్ రూ.362 కోట్లు దోచాయి. ఐతే, మొండి బకాయిల విషయంలో బ్యాంకులు కోర్టు నోటీసులు జారీ చేసినప్పుడే డిఫాల్టర్ల సమాచారాన్ని బహిర్గతం చేయాలని సిబిల్‌కు ఆర్బీఐ అవకాశం ఇచ్చింది. 243 మంది బ్యాంక్ ఆఫ్ బరోడాకు రూ.5,342 కోట్లు చెల్లించాలి. 779 మంది యూనియన్ బ్యాంకుకు రూ.4,802 కోట్లు చెల్లించాలి. 666 మంది సెంట్రల్ బ్యాంకుకు రూ.4,492 కోట్లు ఎగ్గొట్టారు. ఓరియంటల్ బ్యాంకుకు 420 మంది రూ.4,244 కోట్లు, యూకో బ్యాంకుకు 338 మంది రూ.4,100 కోట్లు, ఆంధ్రా బ్యాంకుకు రూ.373 మంది రూ.3,927 కోట్లు, కెనరా బ్యాంకుకు 473 మంది రూ.3,691 కోట్లు, విజయబ్యాంకుకు కేవలం 12 మంది రూ.3,152 కోట్లు ఎగ్గొట్టారు.

శరవేగంగా నిరర్థక ఆస్తులు...!

మొండిబకాయిల విషయంలో ఇప్పటికి దేశవ్యాప్తంగా రూ.16,844 మంది రూ.2,59,991 కోట్లు ఎగనామం పెట్టినట్టు బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. 3,684 మంది ఎస్బీఐకి రూ.74,649 కోట్లు ఎగ్గొట్టారు. 9,507 మంది రూ.1,29,639 కోట్లు చెల్లించలేదని ఇతర జాతీయ బ్యాంకులు నోటీసులు జారీ చేశాయి. డిఫాల్టర్ల జాబితాను ప్రచురించటానికి చట్ట బద్ధంగా, ఒప్పందాలు, ఆర్థిక విశ్వసనీయత హక్కులపై ప్రభావం చూపుతాయని, ఈ హక్కులను ఆధారం చేసుకుని డిఫాల్టర్లు ఎదురు తిరిగే అవకాశం ఉందని సెంట్రల్ బ్యాంకు 2017లో సుప్రీంకోర్టుకు వివరించింది. దీంతో కొన్ని బ్యాంకులు, సంస్థలు డిఫాల్టర్ల పేర్లను ప్రకటించటానికి ఇష్టపడటం లేదని అధికారుల సమాచారం.

ఇదిలా ఉంటే... గడచిన పదేళ్లల్లో రూ.3,60,000 కోట్ల రుణాలను బ్యాంకులు రద్దు చేశాయి. గడచిన తొమ్మిదేళ్లలో అంటే 2007-08 నుంచి 2015-16 వరకూ రూ.2,228,253 కోట్లు రద్దు చేయగా కేవలం 2017-17, 2017-18 మొదటి ఆరునెలల్లో ...ఏడాదిన్నరలో బ్యాంకులు రూ.1,32,659 కోట్లు రద్దు చేశాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరం చివరికి బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ రూ.9.5 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉన్నట్టు ఆర్థిక నిపుణుల అంచనా. 2015 నుంచి బ్యాంకుల నిరర్థక ఆస్తుల విలువ రూ.3.20 లక్షల కోట్ల నుంచి శరవేగంగా మూడు రెట్లు పెరగటం గమనార్హం.

ఇదే చైనాలో అయితే...

బీజింగ్: బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించని వారిపైన, ఆదాయపు పన్ను కట్టనివారిపైన చైనా సుప్రీంకోర్టు పలుఆంక్షలు విధిస్తూ చరిత్రాత్మకమైన తీర్పును ఇచ్చింది. ఎగవేతదారులకు బుల్లెట్ ట్రైన్‌లలో, విమానాలలో ప్రయాణం నిషేధం. హోటల్ గదులను కేటాయించరు. రుణాలు, ఆదాయపుపన్ను చెల్లించని వారి సంఖ్య 70లక్షలు ఉన్నది. వీరికి శాశ్వత గుర్తింపు కార్డును కూడా నిలిపివేస్తారు. బ్యాంకుల వద్ద పెద్ద మొత్తాల్లో రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని వారిపై చైనాలో కఠినమైన ఆంక్షలు విధిస్తుండగా భారతదేశంలో మాత్రం ఎగవేత దారులను పాలనా వ్యవహారాలను చూసే కీలక బాధ్యులే దగ్గరుండి విమానాలు ఎక్కించి ఇతర దేశాలకు పంపుతున్న విచిత్ర పరిస్థితి.

నవయుగకు రూ.1244 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునే మార్చి నెల జీతం నుంచి అందిస్తారని తెలిపారు. పాత బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులకు మార్చి నెల వేతనం నుంచే డీఏ పెంపు వర్తిస్తుందని పేర్కొన్నారు. కరవు భత్యం పెంపు వల్ల ప్రతి నెలా రూ.69.91 కోట్లు, ఏడాదికి రూ.838.87 కోట్ల చొప్పున భారంపడనుంది. గ్రామ సహాయకులకు పెంచే రూ.300 వల్ల ఏడాదికి రూ.6.57 కోట్ల భారం పడనుందని చెప్పారు. ప్రభుత్వంపై మొత్తం రూ.845.44 కోట్ల భారం పడుతుందన్నారు. పోలవరం కాంక్రీట్ పనులు చేపట్టిన నవయుగ కంపెనీకి రూ. 1244 కోట్ల పనులకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డుకు స్వయం ప్రతిపత్తి కల్పించే డ్రాఫ్టు బిల్లుకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ఎటువంటి భయాలు లేకుండా వివాదరహితంగా ఉండేలా చూడటానికి బోర్డుకు స్వయం ప్రతిపత్తి కల్పించే బిల్లు దోహదపడుతుందని మంత్రిమండలి భావించిందన్నారు. ఏపీ ఈడీబీ చట్టం 2018 అనుసరించి స్టేట్ ఇన్వెస్టుమెంట్ ప్రమోషన్ బోర్డు, స్టేట్ ఇన్వెస్టుమెంట్ ప్రమోషన్ కమిటీలకు కూడా స్వయం ప్రతిపత్తి కల్పించేలా బిల్లు రూపొందించారన్నారు.

విశాఖ, తిరుపతిలో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామన్నారు. ఇందుకుగాను విశాఖలో 2.7 ఎకరాలలో జీవీఎంసీ పరిధిలో కుటుంబ వినోద కేంద్రానికి అనుమతి ఇస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నదన్నారు. లీజు రూపంలో మొదటి ఏడాది రూ. 4.284 కోట్లు చెల్లించాల్సి వుంటుంది. ఏడాదికి 5శాతం చొప్పున లీజు మొత్తాన్ని పెంచేలా ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. పీపీపీ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపడతారని చెప్పారు. తిరుపతి తుడా పరిధిలో కుటుంబ వినోద కేంద్రంగా అన్నమయ్య సర్కిల్‌లో 3.72 ఎకరాలలో సినిమాస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించేందుకు తుడా వైస్ చైర్మన్‌కు అనుమతి ఇస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నదన్నారు. 42 నాన్ అమృత్ పట్టణాలలో మౌలిక సదుపాయాలు కోసం ఎక్స్‌టెర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల క్రింద ఏసియాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టుమెంట్ బ్యాంకు చేపట్టిన అన్ని ప్రాజెక్టులకు పబ్లిక్ హెల్త్ , మెడికల్ ఇంజనీరింగ్ విభాగాన్ని సింగిల్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీగా నియమిస్తూ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రూ.4,188.71 కోట్ల మొత్తం ప్రాజెక్టు వ్యయం కోసం పరిపాలనా ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,116.99 కోట్లు, ఆయా పురపాలక సంస్థలు రూ.465.41 కోట్లు, ఎక్స్‌టెర్నల్ ఏజెన్సీల నుంచి రూ.2,066.31 కోట్లు చొప్పున ప్రాజెక్టుకు ఫైనాన్సింగ్ చేస్తాయి. 42 నాన్ అమృత్ పట్టణాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ అర్బన్ వాటర్ సప్లై అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్ కింద ఈ ప్రాజెక్టు చేపడతారన్నారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను నోడల్ ఏజెన్సీగా నియమిస్తూ, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరుకు ఏసియాన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టుమెంటు బ్యాంకుతో వివిధ ఒప్పందాలను చేసుకునే బాధ్యతను అప్పగిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుందని చెప్పారు.

నూతన నియామకాలు ...

ఏసీబీ,సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో,స్పీకర్ పీఆర్వోకు నూతన నియామకాలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. ఏసీబీలో కొత్తగా 350 పోస్టులు మంజూరు చేసింది. 300 ఖాళీలను నేరుగానూ, మిగిలిన 50 ఖాళీలను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని నిర్ణయించిందన్నారు. రాజధాని నిర్మాణం, రాష్ట్రంలో ఇతర అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టినందున ఎక్కడా అవినీతికి తావు లేకుండా చూసేందుకు ఏసీబీని బలోపేతం చేయాలని మంత్రివర్గం భావించిందని మంత్రి తెలిపారు. 300 పోస్టులకు ఏడాదికి రూ. 23.57 కోట్లు ,50 అవుట్ సోర్సింగ్ పోస్టులకు ఏడాదికి రూ. 84.36 లక్షలు వ్యయం కానుందన్నారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ,సీనియర్ సివిల్ జడ్జిల కోర్టు కోసం కొత్తగా 25 పోస్టులు మంజూరు చేశామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర పోస్టులు గాను ఏడాదికి రూ. 1.46 కోట్లు ఖర్చు కానుందన్నారు. శాసన సభాపతికి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌ని నియమించేందుకు వీలుగా ఒక పోస్టును సృష్టిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుందన్నారు

విజయవాడలో ఉర్దూ జూనియర్ కళాశాల.. :

విజయవాడ విద్యాధరపురంలో వార్డు నెంబర్ 13లో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుకు 0.92 సెంట్ల భూమిని కేటాయించారన్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం సంచాం గ్రామంలో 44.97 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు నిమిత్తం ఏపీఐఐసీకి ఉచితంగా అందిస్తూ మంత్రిమండలి నిర్ణయించిందన్నారు.

సీపీఐ ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

భద్రతను క్షీణింపచేస్తున్నది. ఈ నిర్ణయంపై విచారం వ్యక్తంచేస్తూ ఇది జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైనదని ప్రభుత్వం దీన్ని అమలు చేయవద్దని సీపీఐ కోరుతున్నది.

నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి: సీపీఎం

బొగ్గురంగాన్ని ప్రైవేటీకరించడం ప్రభుత్వం అనుసరించే నయా ఉదారవాద ఆర్థిక విధానాల్లో భాగమనీ, ఈ నిర్ణయం ఇంధన భద్రతను క్షీణింపచేస్తుందని, తక్షణం ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీపీఎం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఇలాంటి నిర్ణయాలు కార్మికులకు భద్రతలేకుండా చేస్తాయని ఆ పార్టీ పేర్కొంది.

మోడీ ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను దుందుడుకుగా ముందుకు తీసుకువెళుతున్నాదని పార్టీ పేర్కొంది. ప్రమాదకరమైన ఇలాంటి చర్యలను ట్రేడ్‌యూనియన్లు, వామపక్షాలు నిరంతరం వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. ఈ చర్యను ప్రజాస్వామ్య శక్తులన్నీ నిరసించాలని పార్టీ కోరింది.

ప్రైవేటీకరణ తగదు - ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: దేశంలో బొగ్గు గనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని కేంద్రం నిర్ణయించడం సరికాదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు తీవ్రంగా ఖండించారు. వాణిజ్య అవసరాలకు వినియోగించే శిలాజ ఇంధన గనుల ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండు చేశారు. ఈమేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో బొగ్గు గనుల తవ్వకాల వేలంలో పాల్గొనేందుకు ప్రైవేటు సంస్థలకు అనుమతిని ఇవ్వాలని ఆమోదం తెలియచేయడంపై ఆయన స్పందించారు. దేశంలో 1973లో బొగ్గు గనులను జాతీయం చేసారని గుర్తు చేస్తూ.. ప్రైవేటువ్యక్తులకు గనుల నిర్వహణను అప్పగించడం వల్ల జరిగిన నష్టాన్ని ఒకసారి మననం చేసుకోవాలని కేంద్రాన్ని కోరారు. ప్రధానంగా ఝరియా, రాంఘడ్ గనులే ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయన్నారు. బొగ్గు గనుల వేలం విషయమై కేంద్రం పున:సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్డీఏ పాలనలో అన్ని రంగాలూ నిర్వీర్యమైపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో భారీ కుంభకోణం జరిగిందని, బడా వ్యక్తులు బ్యాంకులను లూటీ చేస్తున్నారనడానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ తాజా తార్కాణంగా ఆయన అభివర్ణించారు. కార్పొరేట్ వర్గాలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. దేశంలో జరిగే విద్యుదుత్పాదనలో 70 శాతం బొగ్గు ఆధారంగా జరుగుతోందన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ నిర్ణయం ఇంధన భద్రతకు తీవ్ర ముప్పును కలిగించే విధంగా ఉన్నదని ఓబులేసు ఆందోళన వ్యక్తం చేశారు.

మరింత దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

పోస్టుల వల్ల ప్రభుత్వంపై ఏడాదికి రూ.23.57 కోట్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వల్ల రూ.84.36 లక్షలు, మొత్తంగా రూ.24.41 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. నిందితులకు శిక్షలు వేయించటంలోనూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్న ఏసీబీని మరింత పటిష్టపరిచేందుకు ప్రభుత్వం అదనంగా పోస్టులు మంజూరు చేయటంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇదిలావుండగా, అవినీతి అధికారులు, లంచావతారుల గుండెల్లో మాత్రం దాడులపై భయాందోళన పెరుగుతోంది.

తొలిరోజే ఆటంకం..!

(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షించారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనలేని కొందరు అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్షలు రాసేందుకు అసౌకర్యానికి గురయ్యారు. హైదరాబాద్-7, బెంగుళూరు -10, చెన్నయ్-7 కేంద్రాల్లో ఏపీ టెట్ పరీక్షను నిర్వహించారు. తెలంగాణా రాష్ట్రమైన చర్లపల్లి లక్ష్మణ్ ఐటీ అకాడమీలో 600 మందికి కేటాయించిన అభ్యర్థుల పరీక్షా కేంద్రాన్ని మార్పు చేయడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. పరీక్షకు ముందు అకాస్మాత్తుగా వేరొక కేంద్రానికి తరలించడంపై అసౌకర్యానికి గురయ్యారు. అనంతపురంజిల్లా హిందూపురం పరీక్షా కేంద్రంలో సర్వర్ మొరాయించి టెట్ పరీక్ష నిలిచిపోయింది.మరికొన్ని పరీక్షా కేంద్రాల్లోనూ సర్వర్లు మొరాయించడంతో పరీక్షలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది.ఆయా ఆన్‌లైన్ సెంటర్లలో వున్న కంప్యూటర్ల కంటే ఎక్కువ మంది అభ్యర్థులను కేటాయించడంతో టెట్ పరీక్ష గందరగోళానికి దారితీసింది.టెట్ పరీక్షలు రాసే పీహెచ్‌సి, గర్భిణీలకు అదనంగా 50 నిమిషాల సమయాన్ని ప్రభుత్వం కేటాయించింది.

ఆన్‌లైన్ కేంద్రాల్ని పటిష్టం చేయాలి

తొలిరోజు ఏపీ టెట్ పరీక్షలకు ఎదురైన అనుభవాల్ని దృష్టిలో వుంచుకుని ఆన్‌లైన్ సెంటర్లను పటిష్టం చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఆన్‌లైన్ పరీక్షలతో గిరిజన, గ్రామీణ ప్రాంత అభ్యర్థులు తడబడ్డారు.కంప్యూటర్‌పై అవగాహనలేని వారంతా ఒక్కసారిగా పరీక్షలు రాయడం భారంగా మారింది. పది రోజులపాటు కొనసాగే టెట్ పరీక్షల నిర్వహణపై ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఇతర రాష్ట్రాల పరీక్షా కేంద్రాలపై పర్యవేక్షణ ఎవరిది..?

ఏపీ టెట్‌కు ఇతర రాష్ట్రాల్లో కేటాయించిన పరీక్షా కేంద్రాలపై పర్యవేక్షణ ఎవరు చూస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది.ఏపీ టెట్‌కు రాష్ట్రంతోపాటు హైదరాబాద్, బెంగుళూరు, చెన్నయ్‌లో ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ కేంద్రాల్లో దాదాపు 15వేల మంది అభ్యర్థుల్ని కేటాయించారు.ఏపీలోని 13జిల్లాల వారీగా టెట్ పరీక్షల పర్యవేక్షణా బాధ్యతల్ని డీఈవోలకు అప్పగించారు. ఏపీ టెట్ పరీక్షలకు ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలని అభ్యర్థులు కోరుతున్నారు.

చంద్రబాబుపై జేఎఫ్‌సీ వేయాలి
వైసీపీ నేత పార్థసారథి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా సాధనలో నాలుగేళ్ల నుంచి ప్రజల్ని మోసగిస్తున్న సీఎం చంద్రబాబుపై పవన్ కల్యాణ్ జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జేఎఫ్‌సీ) వేయాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.పార్థసారథి డిమాండు చేశారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోదా విషయంలో చంద్రబాబు 5 కోట్ల మంది ఆంధ్రులను మోసగిస్తున్నారని విమర్శించారు. పరిపాలనలో సీనియార్టీ వుందని చెప్పుకునే చంద్రబాబు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధులు తేవడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు.రాష్ట్ర ప్రయోజనాలు, యువత భవిష్యత్తు వైసీపీకి ముఖ్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందుల ఎదురైనా హోదా సాధించి తీరుతామని స్పష్టం చేశారు.

ఏపీ డీఈడీ కోర్సుల్లో గందరగోళం
ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ డీఈడీ కోర్సుల్లో కనీస ప్రమాణాలు పాటించకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా డీఎడ్ కళాశాలల్లో విద్యా సంవత్సరం ముగిసినా వార్షిక పరీక్షలను నిర్వహించక పోవడంపై విద్యార్థులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు.దీంతో కర్నూలుజిల్లా ఎస్వీఎస్ డీఈడీ కాలేజీకి చెందిన 2016-18 బ్యాచ్ విద్యార్థులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు.వార్షిక పరీక్షలు నిర్వహించకుండా, అధికారులు అవినీతికి పాల్పడుతూ విద్యా ప్రమాణాల్ని దెబ్బతీస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. విద్యార్థుల లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పేర్కొంటూ హైకోర్టు విచారణకు స్వీకరించింది. పూర్తి వివరాలతో కౌంటరు దాఖలు చేయాలని రాష్ట్రానికి నోటీసులు జారీ చేసింది. డీఈడీ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులకు ఏపీ టెట్ పరీక్షలు రాసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.పరీక్షల నిర్వహణపై అడుగడుగునా ఆటంకాలు నెలకొనడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.హైకోర్టు నోటీసులతో డీఈడీ కళాశాలల యాజమాన్యం ఆత్మరక్షణలో పడ్డాయి.

వడగాడ్పులు, ఉపశమన చర్యలపై ప్రణాళిక

- ఇతర దేశాల విధానాలపై అధ్యయనం
- జాతీయ వర్క్‌షాపులో జైన్



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : దేశంలో వడ గాడ్పులు, తీవ్రత ఆధారంగా ముందస్తు ఉపశమన చర్యలకు అవలంబించాల్సిన విధానాలు, సాంకేతిక అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నట్లు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సభ్యుడు ఆర్‌కే జైన్ చెప్పారు. అందులో భాగంగానే రెండు రోజుల జాతీయ సదస్సును విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంభవించే వడగాడ్పులు, ముందస్తు ఉపశమన చర్యల పైనా అధ్యయనం చేసిన తర్వాత ప్రణాళికను రూపొం దించనున్నట్లు తెలిపారు. జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో రెండు రోజులపాటు జరగనున్న వర్క్‌షాపును ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం వర్క్‌షాపులో జైన్ మాట్లాడుతూ సరికొత్త టెక్నాలజీని ఉపయోగించి, ప్రస్తుతం దేశంలోని వడగాడ్పుల తీవ్రత, ప్రభావంపై అధ్యయనం చేయాలని సూచించారు. 2015లో జపాన్‌లోని సెండాయ్‌లో నిర్వ హించిన అంతర్జాతీయ సదస్సులో చర్చించిన పలు దేశాల విధానాలను పరిశీలించాలని సూచించారు. ఆ సదస్సులో 175 దేశాలు వడగాడ్పులు, ముందస్తు ఉపశమన చర్యలకు సంబంధించిన ప్రణాళికలను ప్రవేశ పెట్టినట్లు ఆయన తెలియజేశారు. ప్రపంచ దేశాలలో అవలంబిస్తున్న విధానాలకు అనుగుణంగా మన దేశం లోనూ కార్యాచరణను రూపొందించాలని సూచించారు. జాతీయ విపత్తుల నిర్వహణశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.తిరుగప్ప మాట్లాడుతూ వాతావరణ మార్పులతో వడగాడ్పుల తీవ్రత ఆధారపడి ఉంటుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో చోటు చేసు కుంటున్న విధానాలను పరిశీలించి మెరుగైన పద్ధతులను దేశంలో అవలంబించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎంవీ శేషగిరిబాబు మాట్లాడుతూ వాతావరణంలోని మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నట్లు చెప్పారు. ఫలితంగా వడగాడ్పుల తీవ్రత పెరుగుతుందని, దీనికోసం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. శాఖల వారీగా అమలు చేయాల్సిన ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. నిపుణుల నుంచి సూచనలు, సలహాలు తీసుకుని వడగాడ్పులతో సంభవించే నష్టాన్ని తగ్గించేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,168 ఆటోమెటిక్ వెదర్ స్టేషన్స్ ఉన్నాయని, వాటి ద్వారా ఎప్పటికప్పుడు, ముందస్తుగా ఉష్ణోగ్రతల వివరాలను సంబంధిత కలెక్టర్లు, ఇతర అధికారులకు తెలిజేసే వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. 2016తో పోల్చితే గతేడాది వడగాడ్పుల మరణాలు తగ్గాయన్నారు.

17 రాష్ట్రాల ప్రతినిధులు హాజరు

విజయవాడలో రెండు రోజులపాటు జరగనున్న వడగాడ్పులు, ముందస్తు ఉపశమన చర్యలపై ఏర్పాటు చేసిన వర్క్‌షాపునకు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సభ్యులతోపాటు 17 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. తొలి రోజున నిర్వహించిన టెక్నికల్ సెమినార్‌లో నేషనల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి అంజలి జైశ్వాల్..పలు దేశాలలో వడగాడ్పులు, విపత్తులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. నాగపూర్‌కు చెందిన విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశ్రీ కొఠారి మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల విపత్తులు స్వల్పకాలిక, దీర్ఘ కాలికంగా ఇబ్బందులు వస్తుంటాయన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వడగాడ్పులు సంభవించటంలో వ్యత్యాసాలు ఉంటున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. సాయంత్రం నిర్వహించిన సెమినార్‌లో భారత వాతావరణ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం మహాపాత్ర, కమల్ కిశోర్ వడగాడ్పులపై ముందస్తు కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ప్రధానంగా రాష్ట్రంలోని వడ గాడ్పులపై అందులో ప్రత్యేకంగా పేర్కొన్నారు. సదస్సులో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సభ్యుడు ఎన్‌సీ మార్వా పాల్గొన్నారు.

మూడంచెల కాంట్రాక్టు విధానం రద్దు చేయాలి
విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
మంత్రి కళావెంకట్రావుకు కె రామకృష్ణ లేఖ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విద్యుత్ రంగంలో మూడంచెల కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు విద్యుత్ సంస్థలో విలీనం చేసి డైరెక్ట్ వేతన విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర విద్యుత్‌శాఖమంత్రి కె కళా వెంకట్రావుకు ఆయన లేఖ రాశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజుకు చేరింది. తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు కొంతకాలంగా ఆందోళనబాట పట్టారు. కార్మికులు 2017 డిసెంబరులో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆ తదుపరి యాజమాన్యంతో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చర్చలు జరిపిన సందర్భంగా 'సమస్యల పరిష్కారానికి కమిటీ వేశామని, ఫిబ్రవరి 4వ తేదీకల్లా కమిటీ రిపోర్టు ప్రభుత్వానికి పంపుతుందని' తెలిపారు. కానీ ఇప్పటివరకు కమిటీ రిపోర్టు ప్రభుత్వానికి చేరలేదు. మేనేజ్‌మెంట్ తాత్సార వైఖరికి నిరసనగా తప్పని పరిస్థితుల్లో ఈ నెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపట్టారని రామకృష్ణ లేఖలో వివరించారు.

రెండు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విద్యుత్ సంస్థలలోని పలు విభాగాలలో దాదాపు 30వేల మందికి పైగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరు చాలీచాలని వేతనాలతో అత్యంత ప్రమాద కరమైన పని ప్రదేశాలలో సైతం విధులు నిర్వహిస్తున్నారు. విపత్తులు, తుపానుల వంటి అత్యంత క్లిష్టపరిస్థితుల్ని సైతం లెక్కచేయకుండా, పని గంటలతో నిమిత్తం లేకుండా తమ బాధ్యతలను సమర్థవంతంగా నెరవేరుస్తున్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు చాలకపోవడంతో కుటుంబాల పోషణ కడు భారంగా మారింది. దీనికితోడు మూడంచెల విధానం వల్ల కొందరు కాంట్రాక్టర్లు కార్మికులు, ఉద్యోగుల నుంచి నెలనెలా అదనపు సొమ్ము వసూలు చేస్తున్నారు. పొరుగునున్న తెలంగాణ ప్రభుత్వం మూడంచెల కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసింది. కాంట్రాక్టు కార్మికులను ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లలో విలీనం చేసి నేరుగా జీతాలు చెల్లిస్తోంది. తమిళనాడు రాష్ట్రంలోనూ దశలవారీ క్రమబద్ధీకరణ చేశారు. హర్యానా రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌రంగంలో అమలులో ఉన్న మూడంచెల కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయడంతోపాటు జెన్‌కో, ట్రాన్స్‌కో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను విద్యుత్ సంస్థలలో విలీనం చేసి సంస్థల ద్వారా జీతాలు డైరెక్టుగా ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలుచేయాలి.. దశలవారీగా క్రమబద్ధీకరించాలి.. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే రూ.20 లక్షలు నష్టపరిహారం ఇచ్చి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. మహిళా కార్మికులకు వేతనంతో కూడిన 5 నెలల మెటర్నిటీ సెలవు మంజూరు చేయాలి. ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం వర్తింపచేయాలనే తదితర డిమాండ్లతో విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. కావున విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తక్షణమే తగు చర్యలు చేపట్టవలసినదిగా రామకృష్ణ కోరారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఎర్రజెండా అండ



న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి : జి.ఓబులేసు

విశాలాంధ్ర-కడప జిల్లా పరిషత్ : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు ఎర్రజెండా అండగా వుంటుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఓబులేసు అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని దాదాపు 26 వేల మంది కార్మికులు సమ్మెబాట పట్టారు. నగరంలోని శంకరాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా బుధవారం సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావంగా జి.ఓబులేసు శిబిరంలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లు నెరవేర్చాలని సమ్మె చేపడితే దాన్ని నిర్వీర్యం చేసేందుకు కొంత మంది కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.20 లక్షలు ప్రమాద బీమా కల్పించాలని,మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయరాదన్నారు. పెట్టుబడుల కోసం చంద్రబాబు, అధికారులు విమానాలలో తిరుగుతున్నారు తప్ప కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. 45 ఏళ్ల క్రితమే కాంట్రాక్టు కార్మికులు ఉండకూడదని, ఒక వేళ ఉంటే వారిని రెగ్యులరైజేషన్ చేయాలని చట్టం ఉన్నా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కరెంటు కాంట్రాక్టు కార్మికుల వద్ద కుట్రలు చేయడం కుదరదని, రాతపూర్వక హామీ ఇచ్చేంత వరకూ ఈ సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ఛైర్మెన్ కె.మల్లికార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు దారుణంగా ఉన్నాయన్నారు. గత ఏడాది డిసెంబర్5న విద్యుత్ సంస్థ యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామని, కమిటీ ఫిబ్రవరి5 లోపు రిపోర్టు ఇస్తుందని, అప్పుడు న్యాయమైన కోర్కెలు పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించామని, ఫలితం లేకపోవడంతో సమ్మెలోకి దిగామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గణేష్‌బాబు, సీవీ సుబ్బయ్య, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.సృజన్, ఈశ్వరయ్య, విశ్వనాథ రెడ్డి, జయకృష్ణారెడ్డి, పులివెందుల కార్యదర్శి చంద్ర పాల్గొన్నారు.



సమ్మె విచ్ఛిన్నానికి యత్నిస్తే సహించేది లేదు
రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తే సహించేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరించారు. 3 నెలలుగా శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం చేయనందునే 20 నుంచి రాష్ట్ర వ్యాపితంగా నిరవధిక సమ్మె ప్రారంభించామన్నారు. రెండో రోజైన బుధవారం ఇబ్రహీంపట్నంలోని నార్లతాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్‌టీటీపీఎస్) మెయిన్ గేట్ వద్ద కార్మికులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. సమ్మె ప్రారంభమైన రోజునే గుర్తింపు పొందిన రెగ్యులర్ యూనియన్లతో సంప్రదింపులు జరపడం, సమ్మెను విచ్ఛిన్నం చేయమని ప్రోత్సాహించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి తార్కాణమన్నారు. ఇలాంటి ప్రయత్నాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అనేక పోరాటాలతో కార్మికులు వేతనాలు పెంచుకుని విజయం సాధించారని, ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని కూడా ఇప్పటివరకు తొలగించలేదని ఆయన స్పష్టం చేశారు. కార్మికులు సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఎలాంటి వదంతులు నమ్మకుండా ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్యోగులను కోరారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో ఏఐటీయూసీ శ్రేణులు సంపూర్ణ మద్దతునిచ్చి కార్మికుల వెంటే ఉంటారని రవీంద్రనాథ్ హామీ ఇచ్చారు. ఈ సభకు ఎన్‌టీటీపీఎస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు టి తాతయ్య అధ్యక్షత వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ మాట్లాడుతూ సమ్మె విరమింపచేయడానికి ప్రభుత్వం మంగళవారం సాయంత్రం విద్యుత్‌శాఖ మంత్రి కళా వెంకటరావు సమక్షంలో చర్చలు జరిపినప్పటికీ రాతపూర్వకమైన హామీలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

14న జనసేన ప్లీనరీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జనసేన దళపతి పవన్ కల్యాణ్ మార్చి 14 నుంచి ప్లీనరీ సమావేశాలు నిర్వహించి పోరాట కార్యాచరణకు రూపకల్పన చేయనున్నారు. ప్లీనరీలో సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణకు అడుగులు వేయనుంది. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కేంద్రం ఇచ్చిన నిధులపై ఇటీవల రెండు రోజుల పాటు నిర్వహించిన నిజ నిర్ధారణ కమిటీ భేటీ నిర్వహించింది. ప్రత్యేక హోదా, విభజన చట్టం 2014లో పేర్కొన్న అంశాలను సాధించే వరకు జనసేన తనదైన శైలిలో పోరాటాలు సాగించాలని సంకల్పించింది. ఈ పూర్వరంగంలో పార్టీ ప్లీనరీలో వివిధ అంశాలపై చర్చించనుంది. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పవన్ ప్రయత్నాలు ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ రెండు రాష్ట్రాల్లో పోటీ చేసే అవకాశం ఉంది. జనసేన పార్టీ ఏర్పాటై నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటివరకు ప్లీనరీ సమావేశాలు నిర్వహించలేదు. దీంతో పార్టీ సిద్ధాంతాలను జనంలోకి తీసుకువెళ్లడానికి పార్టీ ఆవిర్భంచిన మార్చి 14నే ప్లీనరీ సమావేశాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్వహించేందుకు యత్నాలు చేస్తున్నారు. గుంటూరు ఆచార్య రంగా యూనివర్సిటీ గ్రౌండ్స్‌ను ఈ సమావేశం కోసం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ వన్ మ్యాన్ షో గానే ఉన్న జనసేన పార్టీలో మరికొందరిని కీలకం చేసి పార్టీ అధికార ప్రతినిధులుగా ప్రజలకు పరిచయం చేసేందుకు పవన్ కల్యాణ్ ప్లీనరీని వేదికగా చేయనున్నారు. వచ్చే ఎన్నికల్లో అనంతపురం జిల్లా నుంచి పోటీ చేస్తానని పవన్ ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. పార్టీని రెండు తెలుగు రాష్ట్రాల్లో బలోపేతం చేయడానికి ఆయా ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించడంతోపాటు సభ్యత్వాలను వేగవంతం చేశారు. దీంతోపాటు తెలుగు రాష్ట్రాల్లో చలోరే చలోరే చల్ పేరుతో రాజకీయ యాత్రను నిర్వహించి కార్యకర్తల్లో ఊపు తెచ్చారు.

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా డేగా ప్రభాకర్




విశాలాంధ్ర- తాడేపల్లి గూడెం : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా డేగా ప్రభాకర్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆయనతో పాటు 15 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. సమితి సభ్యులుగా 71 మంది, ఆరుగురు ఆహ్వానితులుగా, ఆరుగురు క్యాండిడేట్ సభ్యులుగా ఎన్నికయ్యారు. పార్టీ సహాయ కార్యదర్శులుగా బండి వెంకటేశ్వర రావు, కోనాల భీమారావులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రేఖా భాస్కరరావు, వైట్ల విద్యాధర్, పి కన్నబాబు, నెక్కంటి జగదాంబ, సోడెం వెంకటేశ్వరరావు, కలిశెట్టి వెంకట్రావు, ఎం సీతారామ ప్రసాద్, కారం దారయ్య, బి.నాగరాజు, ఎండి మునీర్, సీహెచ్ రంగారావు, ఎం వెంకటాచారి, సన్నేపల్లి సాయిబాబు, గాళ్ల శారద, ఆహ్వానితులుగా ఎం కృష్ణ చైతన్య, యు హేమశంకర్ ఎన్నికయ్యారు.

అర్హుల జాబితా లేకుండా పదోన్నతులా?
ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సుధీర్‌బాబు, నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అర్హుల జాబితా లేకుండా పురపాలక, నగర పాలక సంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు హడావుడీగా కౌన్సెలింగ్ నిర్వహించడంపై ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ మేరకు బుధవారం ఏపీ ఎస్టీయూ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. పదోన్నతులలో అర్హులైన ఉపాధ్యాయుల మెరిట్ కమ్ రోస్టర్ ప్యానెల్ జాబితాలను ముందస్తుగా ప్రకటించకుండానే..కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేయడం అన్యాయమన్నారు.ఉపాధ్యాయుల అభ్యంతరాల్ని స్వీకరించకుండా అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించడంపై అనుమానాలు నెలకొన్నాయని విమర్శించారు.

అగ్రి బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించాలి
ముప్పాళ్ల, విశ్వనాథరెడ్డి, తిరుపతిరావు ప్రభృతుల డిమాండు
ముగిసిన మూడు రోజుల దీక్షలు : పలువురు నేతల సంఘీభావం

విశాలాంధ్ర నెట్‌వర్క్ : అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం సత్వరమే న్యాయం చేయాలని డిమాండు చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారం ముగిశాయి. ఈ దీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండు చేశారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 4వేల కోట్లు కేటాయించాలని, మృతిచెందిన ప్రతి ఒక్క బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. గుంటూరు జిల్లా గురజాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షా శిబిరాన్ని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరాన్ని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి. విశ్వనాథరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణమే పరిహారం ఇచ్చే విధంగా రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో మొత్తం 21.14లక్షల అగ్రిగోల్డ్ బాండ్లు ఉన్నాయని, వారందరికి సొమ్ములు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతపురం జిల్లాలో : ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన చేసి, బాధితులకు న్యాయం చేయాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు డిమాండు చేశారు.అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారంతో ముగిశాయి. మూడవ రోజు దీక్షాశిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రాయలసీమ అభివృద్ధి కమిటి కన్వీనర్ జి.ఓబుళు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు సి.జాఫర్, పి.నారాయణస్వామి, మానవ హక్కుల వేదిక నాయకులు అబ్దుల్ రసూల్, అనంత అభివృద్ధి వేదిక అధ్యక్షులు కొగటం విజయ్ భాస్కర్‌రెడ్డి, జనసేననాయకులు విశ్వనాథ్, పలువురు సీపీఐ నేతలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు.



కర్నూలు జిల్లాలో : కర్నూలు జిల్లాలో బుధవారం మూడవరోజు కర్నూలు, డోన్, బేతంచర్ల, ఎమ్మిగనూరు, పత్తికొండ, బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, ఆత్మకూరు, ఆదోని, హోళగుంద, ఆలూరులలో నిరాహారదీక్షలు చేపట్టారు.

కడప జిల్లాలో : కడప జిల్లాలో అగ్రిగోల్డ్ బాధితుల రిలే దీక్షలు బుధవారం కొనసాగాయి. బి.మఠం, ఓబులవారిపల్లి, బద్వేలు, యర్రగుంట్ల, ప్రొద్దుటూరులో రిలే దీక్షలు నిర్వహించారు. ఓబులవారిపల్లిలో సీపీఐ మండల కార్యదర్శి జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. బిమఠంలో అగ్రిగోల్డ్ ఏజెంటు సుధాకర్ రావు నాయకత్వం వహించారు. బద్వేలులో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహబూబ్ బాషా, యర్రగుంట్లలో వైసీపీ నాయకులు మల్లు గోపాల్ రెడ్డి, దివాకర్, జగన్‌మోహన్ రెడ్డి, భరత్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, షేర్‌ఫుద్దీన్, హుసేన్ పీరా, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో : నెల్లూరు జిల్లావ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నెల్లూరులోని కలెక్టరేట్ ఎదుట, నాయుడుపేట ఆర్డీఓ కార్యాలయం ఎదుట, సూళ్లూరుపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట, కావలిలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద, వెంకటగిరి, ఆత్మకూరు, సంగం, కలిగిరి, వెంకటాచలం మండలాలతో పాటు అన్ని మండలాల్లో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలేదీక్షలు నిర్వహించారు. వారికి సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు.

ప్రకాశం జిల్లాలో : అగ్రిగోల్డ్ బాధితులు చేపట్టిన మూడు రోజుల రిలేనిరాహార దీక్షలు ప్రకాశం జిల్లాలో బుధవారం విజయవంతం ముగిశాయి. కనిగిరి, యర్రగొండపాలెం, పెదదోర్నాల, కొండెపి, శింగరాయకొండ, వెలిగండ్ల, కందుకూరు, మార్కాపురం, ఒంగోలు తదితర చోట్ల ఈ నెల 19న ప్రారంభించి బుధవారం వరకూ నిర్వహించారు. ఆయా దీక్షా శిబిరాలను పలు పార్టీల నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని సీపీఐ నాయకులు భరోసా ఇచ్చారు. కనిగిరి, శింగరాయకొండల్లో సీపీఐ నియోజవర్గ కార్యదర్శులు వై. రవీంద్రబాబు, వీరారెడ్డి మాట్లాడారు. పలుచోట్ల ఆయా మండలాల సీపీఐ కార్యదర్శులు పాల్గొని బాధితులకు ధైర్యాన్నిచ్చారు.

గుంటూరు జిల్లావ్యాప్తంగా : గుంటూరు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల రిలే నిరాహార దీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలోని గుంటూరు, చిలకలూరిపేట, గురజాల, రేపల్లె, నిజాంపట్నం, మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, పొన్నూరు, పెదకాకాని తదితర ప్రాంతాలలో దీక్షలను మూడు రోజుల పాటు కొనసాగించారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే ఛలో అసెంబ్లీకి సిద్ధమని ప్రకటించారు. వినుకొండలో దీక్షల ముగింపు సందర్భంగా సీపీఐ, అగ్రిగోల్డ్ బాధితులు మానవహారాన్ని ఏర్పాటు చేశారు. నిజాంపట్నంలో అర్ధనగ్నంగా రాస్తారోకో నిర్వహించారు.



కృష్ణాజిల్లాలో : కృష్ణాజిల్లాలో గన్నవరం, మచిలీపట్నం, మైలవరం, గుడివాడ, ముసునూరులో మూడో రోజు దీక్షలు జరిగాయి. మైలవరంలో జరిగిన నిరాహార దీక్షలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ ఎదుట దీక్ష శిబిరాన్ని జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మోదుమూడి రామారావు ప్రారంభించారు. గన్నవరంలో ఏరియా కార్యదర్శి కొండా వీరాస్వామి దీక్షలో పాల్గొన్నారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో : నిడదవోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు పాల్గొన్నారు. తణుకులో కూడా దీక్షలు జరిగాయి.

తూర్పుగోదావరి జిల్లాలో : కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలో రిలే నిరాహారదీక్షలు జరిగాయి.

విశాఖ జిల్లాలో : అగ్రిగోల్డ్ బాధితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. గత మూడురోజులుగా విశాఖ జిల్లా అనకాపల్లిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారం ముగిశాయి. దీక్షాశిబిరాన్ని కొణతాల రామకృష్ణ సందర్శించి సంఘీభావం తెలిపారు.

విజయనగరం జిల్లాలో : విజయనగరం జిల్లాలో దీక్షలు ముగిశాయి. జిల్లా కేంద్రమైన విజయనగరంలోని ఆర్టీసి కాంప్లెక్స్ ఎదుట నిర్వహించిన దీక్షాశిబిరంలో బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుగతా సూరిబాబు మాట్లాడారు.

శ్రీకాకుళం జిల్లాలో : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో మూడురోజుల పాటు కొనసాగిన అగ్రిగోల్డ్ ఏజెంట్‌ల రిలే నిరాహారదీక్షను బుధవారం సీపీఐ నాయకులు చాపర సుందర్‌లాల్ నిమ్మరసం తాగించి విరమింపజేశారు.

చిత్తూరు జిల్లాలో : చిత్తూరు జిల్లాలో చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల రిలే దీక్షలు బుధవారం కూడా కొనసాగాయి. తిరుపతి, శ్రీకాళహస్తి మండలాల్లో రిలే దీక్షలు నిర్వహించారు. తిరుపతిలో ఆర్‌డీవోకు వినతిపత్రం సమర్పించారు.

సంపాదకీయం

రాజకీయ వైరుధ్యాల్లో దక్షిణాఫ్రికా

పెట్టుబడిదారీ వ్యవస్థలో వస్తూత్పత్తితో పాటు అవినీతి ఒక ఉప ఉత్పత్తిగా తయారవుతోందనే వాస్తవం అనేక సందర్భాల్లో వివిధ దేశాల్లో రుజువైంది. బూర్జువా శక్తులు అధికారంలో ఉంటే అవినీతికి ముసుగు కప్పి, ప్రజల్ని మభ్యపర్చేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తారు. అవినీతి వల్ల తలెత్తిన దుష్ఫలితాన్ని మరో రూపంలో, వేరే పేరుతో చూపించి జనాన్ని తప్పుదోవ పట్టిస్తారు. ఏ దేశంలోనైనా కమ్యూనిస్టు పార్టీ బలంగా ఉన్నా, చట్టసభల్లో ఆ పార్టీకి తగిన ప్రాతినిధ్యం ఉన్నా.. అవినీతి ఊడలను సైతం పెరికి ప్రజల ముందు ఉంచుతుంది. అందుకు తాజా ఉదాహరణే దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా రాజీనామా. అంతేకాదు, మన దేశంలో యూపీఏ-1, యూపీఏ-2 పాలనకు మధ్య తేడా కూడా ఆ కోణంలోనే చూడాలి. అవినీతి ఆరోపణలకు గురైన జుమా రాజీనామా వెనుక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) జాతీయ కార్యవర్గం ఒత్తిడి పనిచేసిందని చెప్పుకున్నా.. దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఏసీపీ), కార్మిక సంఘాల కూటమి(కొసాటు) డిమాండు బలంగా పనిచేసింది. జుమా సర్కారు కార్పొరేట్ అనుకూల చర్యలు చేపట్టడాన్ని, అవినీతి ఆరోపణలు, ఆశ్రిత పక్షపాతం పెరగడాన్ని, అనేక రంగాల్లో వైఫల్యాలను తీవ్రంగా నిరసిస్తూ ఆయన రాజీనామాకు కమ్యూనిస్టు పార్టీ పట్టుబట్టింది. అందుకు ప్రతిగా తన మంత్రివర్గంలోని కమ్యూనిస్టు మంత్రి ఒకరిని జుమా తొలగించారు. 2017 డిసెంబర్ 18న జరిగిన ఏఎన్‌సీ అధ్యక్ష ఎన్నికల్లో తన పూర్వపు భార్యను గెలిపించుకునేందుకు జుమా తీవ్ర ప్రయత్నం చేశారు. ఉపాధ్యక్షుడు రాంఫోసా కొద్ది తేడాతో పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. జుమాపై 18 అంశాలలో అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రతిపక్ష డెమోక్రటిక్ అలయన్స్ దాఖలు చేసిన కేసులో ఆయన విచారణ ఎదుర్కొనాల్సిందేనని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విచారణకు ఒక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఒక అవినీతి నివేదికను తొక్కిపెట్టడంలో జుమా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు మరో కేసులో న్యాయస్థానం స్పష్టం చేసింది. జుమాతో ఉన్న సంబంధాలను అడ్డుపెట్టుకొని భారతీయ సంతతికి చెందిన గుప్తా కుటుంబం అనేక ప్రభుత్వ కాంట్రాక్టులను పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో జుమా రాజీనామా చేయకపోతే అధికార కూటమి నుంచి తాము వైదొలుగుతామనీ, అవసరమైతే వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేస్తామని కమ్యూనిస్టు పార్టీ హెచ్చరించింది. దీంతో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) జాతీయ కార్యవర్గం మరోదారి లేక జుమాతో రాజీనామా చేయించింది. 1994లో జాత్యహంకార పాలనను అంతమొందించిన తర్వాత అధ్యక్ష బాధ్యతలను నెల్సన్ మండేలా చేపట్టారు. ఆయన తర్వాత తాబో ఎంబెకీ అధ్యక్షుడిగా నియమితులైనా అవినీతి ఆరోపణలతోనే రాజీనామా చేశారు. ఇప్పుడు జుమా వంతు వచ్చింది. జుమా రాజీనామాతో అధ్యక్షుడిగా సిరిల్ రాంఫోసా బాధ్యతలు చేపట్టారు. నెల్సన్ మండేలా తన వారసునిగా గని కార్మికుల జాతీయ యూనియన్ అధ్యక్షుడైన సిరిల్ రాంఫోసా కావాలన్నా, ఆలివర్ టాంబో తదితరులు ఎంబెకీని అంగీకరించేటట్లు ఆయనకు నచ్చచెప్పారు. జైలునుంచి మండేలా విడుదల అనంతరం ప్రజాస్వామ్యంలోకి పరివర్తనకు నాయకత్వం వహించిన టాస్క్‌ఫోర్స్‌లో రాంఫోసా కీలకమైనవ్యక్తి. జుమా కూడా జాత్యహంకార పాలనకు వ్యతిరేక పోరులో జైలు జీవితం అనుభవించారు. 1997లో ఏఎన్‌సీ ఉపాధ్యక్షుడిగా, 1999లో దేశ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఐరోపా కంపెనీతో ఆయుధ లావాదేవీలలో చోటుచేసుకున్న అక్రమాలతో జుమాకు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. జుమా 2005లో పదవీచ్యుతుడయ్యాడు. అయితే తాను ఎంబెకీ అక్రమాలను వ్యతిరేకించినందునే బలిపశువునయ్యానని జుమా చేసిన వాదనను ఏఎన్‌సీ విశ్వసించింది. తిరిగి 2009లో అధ్యక్షుడిగా నియమించింది. మండేలా అనంతరం అధ్యక్ష పదవి లభించకపోవటంతో అసంతృప్తి చెందిన రాంఫోసా రాజకీయాలు విడిచిపెట్టి వ్యాపారంలోకి వెళ్లారు. 45 కోట్ల డాలర్ల ఆస్తివిలువతో రాంఫోసా ఆఫ్రికాలో సంపన్నుల జాబితాలో 42వ స్థానంలో ఉన్నట్లు 2015 లో ఫోర్బ్ ప్రకటించింది. 2012లో ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చి పార్టీ నాయకత్వంలో రెండోస్థానం పొందారు, 2014లో దేశ ఉపాధ్యక్షుడయ్యారు. జాకబ్ జుమా అవినీతిని అడ్డుకోలేక పోయారన్న అపవాదు ఆయనపై ఉంది. నిరుడు డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో ఏఎన్‌సీ అధ్యక్షుడుగా, ఇప్పుడు దేశాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈయన కూడా కార్పొరేట్ విధానాలకే మొగ్గుచూపే వ్యక్తి. కాబట్టి దేశ ఆర్థిక వ్యవస్థలో మెరుగుదలకు అవకాశాలు తక్కువేననే విశ్లేషణలు వెలువడుతున్నాయి. దేశంలో నల్లజాతి పాలనే సాగుతున్నా ఆర్థిక వ్యవస్థపై పట్టు మాత్రం బహుళజాతి కంపెనీలు, శ్వేత జాతీయుల చేతిలోనే కొనసాగుతున్నదనే విమర్శ ఉంది. జుమా కాలంలో ప్రభుత్వ నియామకాల్లో కూడా వారి ప్రభావం విస్తరించింది. ఫ్రీడం చార్టర్‌ను అమలు చేయడంలో వైఫల్యం, అవినీతి పెరగడం తదితరాలకు ఇది కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. రాంఫోసా పాలన ఇందుకు భిన్నంగా సాగే అవకాశం లేదని కూడా విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. భూ సంస్కరణలు అసమగ్రంగా ఉండిపోవడం, మైనింగ్, మీడియా, టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోవడం వల్ల పాలకులు ఎవరైనా కార్పొరేట్‌ల మాటే చెల్లుబాటు అవుతున్నది. ఏఎన్‌సీలో భాగస్వాములైన ఎస్ఏసీపీ, కొసాటులు ఈ ధోరణికి తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. నయా ఉదారవాద విధానాల అమలును తప్పుపడుతున్నాయి. తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోతున్నందున వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల్లో తాము విడిగా పోటీచేయాలని కూడా ఇవి నిర్ణయించాయి. జాతీయ ప్రజాస్వామిక విప్లవాన్ని(ఎన్‌డీఆర్) సాధించాలన్నది త్రిపక్ష కూటమి (ఏఎన్‌సీ, ఎస్ఏసీపీ, కొసాటు) ప్రధాన లక్ష్యం. ఆచరణలో దీనికి ఏఎన్‌సీ విభిన్న భాష్యాలు వల్లిస్తూ జాతి వివక్షలేని సమాజాన్ని ఏర్పాటుచేసి తద్వారా సోషలిస్టు వ్యవస్థ స్థాపనకు దారి తీసేలా ఎన్‌డీఆర్‌ను అమలు చేయాలన్న అవగాహన నుంచి దూరం కావడంపై కమ్యూనిస్టులు ఎప్పటినుంచో నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఒకనాటి కార్మికనేత సిరిల్ రాంఫోసా 1994 తర్వాత వాణిజ్య, పారిశ్రామికవేత్తగా ఎదిగారు. కాబట్టి ఆయన పాలనలో ఎన్‌డీఆర్ సాధన దిశగా ప్రభుత్వ చర్యలు, నిర్ణయాలు ఉంటాయనుకోవడం దుస్సాహసమే. ఇప్పటికీ 90శాతం సంపద పదిశాతంగా ఉన్న శ్వేతజాతీయుల చేతుల్లోనే ఉంది. సారవంతమైన భూములు వారికిందే ఉన్నాయి. ఇప్పటికీ 79శాతం భూములు వివిధ రూపాల్లో శ్వేతజాతీయుల ఆధీనంలో ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకోడానికి సరైన చట్టాలు చేసేందుకు కూడా ఈ ప్రభుత్వాలు సిద్ధం కావడంలేదు. 1994 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం 49లక్షల హెక్టార్ల భూమి స్వాధీనం చేసుకుంది. దీనిలో 34లక్షల హెక్టార్లను పంపిణీ చేసింది. మరోవైపు నల్ల, శ్వేతజాతీయులు కలిసి సాగుచేసేలా ప్రభుత్వమే తమ పథకాల ద్వారా ప్రోత్సహిస్తున్నది. ఇటువంటి చర్యల కారణంగానే సమాజంలోని మెజారిటీ తరగతులలో అసంతృప్తి పెరుగుతోంది. అది పాలక కూటమిలో రాజకీయ సమస్యలకు దారితీస్తున్నది. ఈ నేపథ్యంలో రాంఫోసా పాత విధానాలనే కొనసాగించాలని చూస్తున్నారని, దీన్ని జనం అంగీకరించరని ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీ హెచ్చరించింది. కాబట్టి రానున్న రోజులలో జాతీయ ప్రజాస్వామ్య విప్లవ కార్యాచరణపై ఈ త్రిపక్ష కూటమిలో అంతర్గత పోరు తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అవి ముదిరితే రాజకీయ పునరేకీకరణకు దారితీసినా ఆశ్చర్యం లేదు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే ఎన్నికల నాటికి ఈ కూటమి ఇలాగే ఉంటుందా అన్నది ఒక పెద్ద ప్రశ్న. కమ్యూనిస్టుపార్టీ కింది శాఖలలో వేరుగా పోటీకి సంబంధించిన చర్చ కొనసాగుతున్నది. అయితే వచ్చే ఎన్నికల నాటికి అది దేశాన్ని నడిపించేందుకు తనదైన పంథాలో పయనిస్తుందా లేదా అన్నది ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తృతంగా సాగుతున్న చర్చ. అదే జరిగితే ఏఎన్‌సీతోనే కమ్యూనిస్టుపార్టీ, కొసాటు తలపడే పరిస్థితి తలెత్తుతుంది.

విశ్లేషణ

ఆంధ్ర, ఒడిశా ప్రభుత్వాల ఆకస్మిక ప్రేమ!

గనుల కోసమా ! గిరిజనుల కోసమా !!



నల్లి ధర్మారావు

చెక్కిళ్లపై ఆకుపచ్చని రంగు పులిమినట్టు, కొండ చరియల్లో అక్కడక్కడా జొన్న, సామలు, కొర్రచేలు.. శిఖరాల శిరస్సుల నుంచి స్వేచ్ఛగా విడిచి పెట్టి నట్టుగా దట్టమైన అడవులు.. చిన్న, చిన్న జలపాతాలు.. లోయల్లో పాయలు, పాయలుగా సెలయేర్లు.. స్వచ్ఛమైన ప్రకృతితో సహవాసం చేస్తున్న ఆదివాసీల అచ్చమైన జీవన సంస్కృతి - చూడటానికి విదేశీ పర్యాటకులు సైతం వస్తారు. రహదారులు, ఫోన్, విద్యుత్, భోజన, వసతి సదుపాయాలు లేకపోయినా ప్రత్యేకంగా చైత్ర, మాఘ, వసంత మాసాల్లో ఆ అందాలను చూడాలని ఆరాటపడతారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతాల్ని 'ఇరవై ఒక్క శిఖరాల' కొటియాగా పిలుస్తారు. విశాఖ నుంచి అరకు మీదుగా, విజయనగరం నుంచి సాలూరు మీదుగా ఈ ప్రాంతాన్ని చేరుకోవచ్చు. ఎనిమిది దశాబ్దాల నుంచి ఒడిశా, ఆరు దశాబ్దాల నుంచి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు, పూర్తిగా ఈ ప్రాంతాన్ని గాలికొదిలేశాయి. ఆ ఏడు శిఖరాలదగ్గర మానవులు ఉన్నారని, వారికి కనీస సదుపాయాలు కల్పించాలని ఆలోచించలేదు. ఏ రాష్ట్ర పరిధిలోకి, ఆ ప్రాంతం వస్తుందనే అంశాన్ని, సరిహద్దు వివాదంగా మార్చేశాయి. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో, భౌగోళికంగా పెద్ద సరిహద్దు వివాదమిదే! పదేళ్ల క్రితం సుప్రీం కోర్టు, ఆంధ్రాకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకోలేకపోయింది. 'సుప్రీం' తీర్పును ప్రత్యేక బెంచ్ దగ్గర ఒడిశా సవాలు చేసింది. మున్నెన్నడూ లేని విధంగా, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, గత మూడు నెలల నుంచి ఆ ప్రాంతంపై విపరీతమైన శ్రద్ధను కనబరుస్తూ, ప్రేమను ఒలకబోస్తున్నాయి. ఈ ఆకస్మిక మార్పులకు కల్లా, కపటం తెలియని గిరిజనులు తెల్లబోతున్నారు.


ఆ శిఖరాల్లో ఏమున్నది!?

బ్రిటిష్ పాలనలో, దేశంలోనే భౌగోళికంగా జయపురం కొండ జమిందారీ (జైపూర్-ఒడిసా) పెద్దది. అది శిలా వంశస్థుల రాజ్యంగా ఎనిమిది శతాబ్దాల చరిత్ర ఉన్నది. బ్రిటిష్ పాలనలో, అనేక కారణాల వల్ల రాజ్యాలు బలహీనమై, జమిందారీలుగా మారిపోయాయి. జయపురం తూర్పు కనుమల్లో విస్తరించి, శత్రుదాడులకు చిక్కని సహజ రక్షణ ప్రాంతంగా నిలబడింది. చివరకు, పాలనా సౌలభ్యం కోసం జైపూర్ జమిందార్లే, చిన్న, చిన్న జమిందారీలను ఏర్పాటు చేసి, తమ విధేయులకు అప్పగించారు. కురుపాం, మేరంగి, సాలూరు, పార్వతీపురం, పాలకొండ వంటి జమిందారీలు, జయపురం జమిందార్లు ఏర్పాటు చేసినవే! 1936 ఏప్రిల్ 1న ఒరిస్సా ప్రత్యేక రాష్ట్రమయింది.

ఆనాటికి మద్రాస్, జైపూర్ ప్రావెన్సీలుగా ఉన్నాయి. 1936 మార్చిలో ఒరిస్సా ఏర్పాటుకు విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ తొలి షెడ్యూల్‌లో ప్రస్తుతం ఒడిశాలోని పొత్తంగి తాలూకా (బ్లాక్) లేదు. అది జైపూర్ జమిందారీలో భాగం కాకపోవడమే కారణం. 1942లో ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్ నిర్వహించిన ఉమ్మడి సర్వేలో పొత్తంగి బ్లాక్‌లోని కొన్ని గ్రామాలను విస్మరించారు. అవే, ప్రస్తుత వివాదంలోని ఇరవై ఒక్క శిఖరాల కొఠియా గ్రామాలు. 1953 నవంబర్ 1న ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ కూడా, 1955 వరకు వాటిని సర్వే చేయలేదు. కేంద్ర ప్రభుత్వం వాటిని ఒరిస్సా పరిధిలోనివిగానే భావించిందని చెవుతూ, 1968లో కొఠియా ప్రాంత ముఖద్వారం దగ్గర (ప్రవేశం) ఒక పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసి, ఒరిస్సా ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసింది. అంటే, రాష్ట్రం ఏర్పడిన 32 ఏళ్ల వరకూ ఆ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించిందన్నమాట! ఒరిస్సా ప్రయత్నాన్ని పసిగట్టి, రాష్ట్రం ఏర్పడిన 15 ఏళ్ల తరువాత ఆంధ్ర ప్రభుత్వం కళ్లు తెరిచింది. అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా విడిచిపెట్టి, రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా హక్కుల కోసం 'లీగల్' పోరాటం ప్రారంభించాయి. దీనికి గల కారణం చాలా కీలకమైనది. 1962-63లో 21 శిఖరాల కొఠియా ప్రాంతంలో బంగారం, ప్లాటినం, మాంగనీస్, బాక్సైట్, గ్రాఫైట్, లైమ్‌స్టోన్ వంటి విలువైన ఖనిజ సంపదలున్నట్టు ఒక 'అన్వేషణ'లో తెలిసింది. సహజంగానే, రెండు రాష్ట్రాలూ స్పందించాయి. ఆంధ్రా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల పేరుతో అడుగుపెట్టడం గమనించి, 1964లో పొత్తంగి బి.డి.ఓ., తహసీల్దార్ ఒరిస్సా ప్రభు త్వానికి ఫిర్యాదు చేశారు. 1968లో సుప్రీం కోర్టులో ఒరిస్సా పిటిషన్ దాఖలు చేసింది. (నం.10/1968, తేదీ 1-12-68)) ఆ ఏడాదే పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయడం గమనించాల్సిన అంశం. 1988లో కొరాపుట్ జిల్లా జడ్జిని కేసుల కమిషనర్‌గా నియమించి వాస్తవాలను, రికార్డుల ఆధారంగా ఒక నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించింది. 2000లో ఆ నివేదిక ఆధారంగా, 2006 మార్చి 30న సుప్రీంకోర్టు తీర్పును ప్రకటించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 131 ప్రకారం, రాష్ట్రాల సరిహద్దు వివాదం తమ పరిధిలోనిది కాదని, పార్లమెంటులో తేల్చుకోవాలని సూచిస్తూ, శాశ్వత 'ఇంజక్షన్' ఇచ్చింది. ఒడిశా పట్టువదలకుండా 'సుప్రీం' ధర్మాస నానికి అప్పీలు చేసింది. 2015 మేలో, కొఠియా ప్రాంతం ఆంధ్ర ప్రదేశ్ పరిధిలోని దేనని ధర్మాసనం ప్రకటించింది. తదుపరి 'లీగల్' ప్రయత్నాలను ఒడిసా ప్రారంభించింది.

స్వతంత్ర భారతంలో హక్కులు తెలియని తెగలు

ఏడు గ్రామ పంచాయతీల పరిధిలో, 21 రెవెన్యూ గ్రామాలు గల ఈ ప్రాంతాన్ని 'కొఠియా'గా స్థానికులు వ్యవహరిస్తారు. 600 నుంచి 1672 మీటర్ల ఎత్తుగల కొండలు, శిఖరాలు, లోయలు, అడవుల మధ్య దాదాపు పదివేలమంది నివసిస్తున్నారు. వీరు 'ఖోండ్'కు ఉపతెగ కుఠియా లేదా కొఠియ. వీరి భాష



'కువి'. ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది. ఒడిసా అటవీ ప్రాంతంలోని ప్రాచీన తెగ 'ఖోందు'లు మాట్లాడే 'కుయి' భాషకు దగ్గరగా ఉంటుంది. పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ జీవన ఉపాధి మార్గాలు. గంజాయి సాగు వంటి చట్ట వ్యతిరేక మార్గంలో నడుస్తున్నవారు కూడా ఉన్నారు. గిరిజనేతర వ్యాపారులే, పెట్టుబడిగా రుణాలిచ్చి, ఆదివాసులతో కొన్ని లోతట్టు ప్రదేశాల్లో సాగు చేయిస్తున్నారు. కొఠియా గ్రామాల్లో 'గంజాయి భద్ర' అనే వూరు కూడా ఉంది. సాలూరు రోడ్ మీదుగా గంజాయి స్మగ్లింగ్ జరుగుతుంటుంది. కొన్ని దశాబ్దాల పాటు వైద్యం, విద్య, విద్యుత్, ఫోన్, రహదారుల సౌకర్యం లేదు. ఆదివాసీ, అటవీ హక్కుల చట్టాలు తెలియవు. ఓటు హక్కుకూడా లేకుండా, స్వతంత్ర భారతంలో దాదాపు 15 ఏళ్లు బతికారు. ఈ ప్రాంతంపై ఆధిపత్యం సంపాదించే ప్రయత్నాల్లో భాగంగా, రెండు రాష్ట్రాల్లోనూ ఓటు హక్కు ఇచ్చారు. రెండు ప్రభుత్వాలు అంగీకరించడం ఒక గమ్మత్తయిన పరిణామం. ఏడు పంచాయతీలకు రెండు రాష్ట్రాలు ఎన్నికలు నిర్వహిస్తాయి. ఒక పంచాయతీకి ఇద్దరేసి సర్పంచులు, రెండు పాలకవర్గాలుంటాయి.

పోలీస్ అవుట్ పోస్టు ప్రారంభించి, 1968లో ఈ ప్రాంతంపై దృష్టి సారించిన ఒడిశా ప్రభుత్వం పి.హెచ్.సి., పంచాయతీ, వ్యవసాయ కార్యాలయం, పశువుల ఆసుపత్రి, రక్షిత మంచినీటి పథకం, అంగన్‌వాడీ సెంటర్, ఒరియా మీడియం స్కూల్, వారపు సంత, పింఛన్లు, సోలార్ లైట్లు, ఏడు గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించింది. ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా తీర్పురాగానే, కొఠియా సర్కిల్ పేరుతో ఆంధ్ర ప్రభుత్వం ఒక సి.ఐ.ని, వంద మంది కానిస్టేబుళ్లని ఏర్పాటు చేసింది. మావోయిస్టుల సమస్యతో ఇది సాలూరు నుంచి పనిచేస్తుంది. ఒడిశా పోలీసు అవుట్ పోస్టు కూడా పొత్తంగికి మారింది. ఆంధ్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల వేగం పెరిగింది. పి.హెచ్.సి. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌక డిపోలు, పింఛన్లు, విద్యుత్, రోడ్డు సదుపాయాలను కల్పిస్తోంది.

రగిలిన రాజకీయం

కొఠియా వివాదాన్ని ఒడిశాలో ప్రధాన రాజకీయ పార్టీలు క్రమంగా, వాటి ఎన్నికల ప్రయోజనాల కోసం జటిలం చేస్తున్నాయి. భాషాపరంగాను కొన్ని సంస్థలు ఆజ్యం పోస్తున్నాయి. ఆంధ్ర ప్రభుత్వం నిర్మిస్తున్న రోడ్ దగ్గర తెలుగులో బోర్డు పెడితే, ఉత్కళ సమ్మేళన్ సభ్యులు దాన్ని తొలగించారు. ఒరిస్సాలోనే ఉంటామని, ఆదివాసీ గ్రామాల్లోకి వెళ్లి, వారితో ప్రతిజ్ఞలు చేయిస్తున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ రెవెన్యూ మంత్రులు బిశ్వభూషణ్, సూర్యనారాయణ పాత్రో సభలు, సమావేశాల్లో ముఖ్యమంత్రి నవీన్ జోక్యాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కూడా, రాజకీయంగా నష్టం జరగకుండా స్పందించారు. తెలుగు తెలిసిన అధికారిని కొరాపుట్ కలెక్టర్‌గా నియమించారు. జనవరి రెండో వారంలో విజయనగరం జిల్లా కలెక్టర్, తొలిసారిగా కొఠియా గ్రామాలు పర్యటించారు. దీన్ని ఒడిశా మీడియా, బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ, నవీన్ ప్రభుత్వాన్ని విమర్శించారు. దాంతో, ఆ రాష్ట్ర రెవెన్యూ మంత్రి మహేశ్వర మహంతి, కలెక్టర్‌తో పరిస్థితిని సమీక్షించి, ఆంధ్రా ప్రభుత్వంపై కోర్టుకు వెళతామని ప్రకటించారు. ఈ నెల రెండో వారంలో ఉన్నతాధికారుల బృందం పర్యటించి, 'కొఠియా' అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామని ప్రకటించింది. ఆంధ్ర అధికారులు రాకుండా, గంజాయిభద్ర దగ్గర్లోని, దేవ్‌మల దగ్గర ఒక చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. దీన్ని అధికారికంగా, పొత్తంగి ఎం.ఎల్.ఏ. పర్శుల్ పొంగి ప్రారంభించడం విశేషం.

రెండు రాష్ట్ర ప్రభుత్వాలు చూపిస్తున్న ఆకస్మిక ప్రేమకు కొఠియా ఆదివాసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. దశాబ్దాల నుంచి పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు గత మూడు నెలల నుంచి 'దశ' మార్చేస్తామని వెంటబడుతున్నందుకు ఆశ్చర్యపోతున్నారు. బలవంతపు ప్రతిజ్ఞలు, చెక్ పోస్టులు వంటివి, వారి గ్రామాల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయి. ప్రశాంతంగా, సెలయరులా సాగిపోయే జీవితాల్లో అస్థిరత, అభద్రత చేరాయి. ఇదంతా దేనికంటే, 'కొఠియా'లోని విలువైన గనుల కోసమేనన్న జవాబు వినిపిస్తోంది. 2003 ఏప్రిల్‌లోనే 'ఒడిశా రివ్యూ' పత్రికలో, దిలీప్ దాస్ శర్మ అనే ఉత్కళ సమ్మేళన్ నాయకుడు రాసిన వ్యాసంలోనే గనుల ప్రస్తావన దొర్లింది. బంగారం, ప్లాటినం, రంగురాళ్లు, బాక్సైట్ వంటి విలువైన ఖనిజాల కోసమే, ఆంధ్రా ప్రభుత్వం 'కొఠియా'పై కన్నేసిందని ఆయన ఆరోపించారు. ఒడిసా ప్రభుత్వం కూడా అదే దృష్టితో ఉందనే విమర్శలూ ఉన్నాయి. ఇదంతా చూస్తుంటే, కొలంబస్ 1921లో కనుగొన్న 'హైతీ' దీవిలో, బంగారం గనుల ఆచూకీ చెప్పాలని వేధించిన అతని సిబ్బందిపై, స్థానిక ఆదివాసులైన రెడ్ ఇండియన్లు తిరుగుబాటు చేసిన చరిత్ర గుర్తొస్తోంది. 'కొఠియా'లోనూ చరిత్ర పునరావృతం అవుతుందా? - అంటే ఏమో! అని కొందరు భయపడుతున్నారు.

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు,
సెల్ : 7396816430

2019 ఎన్నికలు - మోడీ గాభరా!



పి.జనార్దనరావు

2019లో రాబోయే ఎన్నికలు - వాటిలో మరోసారి విజయ సాధన గురించి అంచనాల్లో మునిగిపోయాడు మోడీ. ప్రధానిగా రాజ్యపాలన విస్మరించాడు. ఆయన తాబేదారు అమిత్‌షా చాలా హడావిడిపడుతున్నాడు. కార్పొరేట్ మీడియా, నీతిష్ కుమార్‌లాంటివారు మోడీ అజేయత్వాన్ని గురించి భజన ప్రారంభించారు. ప్రతిపక్షం బలంగా లేదనే ప్రబలమైన ఆలోచన ఆయన్ని నిలువనీయడంలేదు. దేశమంతటా పార్లమెంటుకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపే ప్రతిపాదన ముందుకు తెస్తున్నాడు. కాని కాలం ఒక్కరీతిగా వుండనట్లు ప్రజాభిప్రాయం ఎప్పుడుఎటువైపు మళ్లుతుందో అంచనావేసిన మేధావి లేడు. ఆరెస్సెస్ బలం కార్పొరేట్ రంగం అందచేసే ఆర్థికం, తన వాగ్ధాటితో కల్పించే ఆకర్షణ, ప్రకటిస్తున్న పథకాలు విజయాన్ని అందించగలవని, దేశాన్ని, వివిధ రాష్ట్రాల్లో పాలన తన హస్తగతం అవుతుందని పెద్దగా ఆశిస్తున్నాడు. కాని 2014లో ఏకపక్షంగా తనకు మెజారిటీ అందించిన వివిధ వర్గాలకు చేసిన వాగ్దానాలు ప్రజలు మరిచపోలేదు. వాగ్దానాలు అమలు చేయలేదని గుర్తు చేశారు ఢిల్లీ ప్రజలు. పాలన ఎక్కువ కాలం గడవకుండా అక్కడ గెలిచింది ప్రతిపక్షం కాంగ్రెసు కాదు అప్పటికప్పుడు ఏర్పడిన ఆప్. అదే సంవత్సరం చివర్లో బీహారు ఘట్‌బంధన్ ఓటమి రుచి చూపింది. గెలుపు గర్వం తలకెక్కిన ప్రధాని మరిన్ని గెలుపులు ఆశించి హద్దులు మీరుట ప్రజలు గమనించట లేదనుకుంటే నిన్నటి రాజస్థాన్ ఉప ఎన్నికలు అందించిన ఫలితాల నుండి ఆయన ఏమీ నేర్చుకోలేదు. నైతికతకు తిలోదకాలిచ్చి ఎత్తుగడలతో బీహారు, గోవా, మణిపూర్లలో ప్రభుత్వాలు కైవసం చేసుకున్నారు. వారిచే నియమించబడిన హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు ముళ్లబాటలో నడుస్తున్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రులు బయటపడలేని ఇబ్బందుల్లో వున్నారు. జబర్‌దస్తీ ధోరణులు, పాశవిక దమనకాండ ఆయా రాష్ట్రాల్లో రైతుల ఆందోళనను ఆపలేకపోయాయి. యువత ఉపాధి కోసం చేస్తున్న ఉద్యమం కొనసాగటం వైఫల్యాన్ని వెల్లడిస్తుంది. ప్రతిపక్షాలు ఏకమై ప్రతిఘటించే అవకాశం లేకుండా పార్లమెంటు ఎన్నికలను ముందస్తుగా ప్రకటించేందుకు మోడీ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాల ఎన్నికలతో కలిపి ఆ విధంగా ఆ రాష్ట్ర ప్రభుత్వాలపై పెరిగిన అసంతృప్తిని పక్కదారిపట్టించవచ్చని వారి భావన. అయితే ఇండియా షైనింగ్ నినాదంతో 2004లో వాజ్‌పేయి ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లి భంగపడ్డ చరిత్ర వుంది. మోడీ ఆకర్షణ తగ్గిందనడానికి ప్రధాన కారణం రైతులకు, యువతకు చేసిన వాగ్దానాలు నెరవేర్చనందుసేనని తేలింది. గతంలో చేసిన వాగ్దానాలు వెంటాడుతున్నాయి. గ్రామీణ ప్రజల సమస్యలను విస్మరించటాన్ని అధిగమించాలి. అంటే ఉపాధికల్పన జరగాలి. ఉపాధి, కొనుగోలు శక్తిని ప్రజల్లో పెంచాలి. గ్రామీణ ప్రాంతాలను, వ్యవసాయ రంగాన్ని అశ్రద్ధ చేసిన ఫలితం గుజరాత్ గ్రామీణులు చూపించారు. అయినా కనువిప్పు కలగలేదు. దేశంలో పరిస్థితి ఏమిటి? జీవితావసరాల ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వమే రాబడిని దృష్టిలో పెట్టుకొని పెట్రోలు, డీజెల్, వంటగ్యాస్, కిరోసిన్ వగైరాల ధరలను పెంచాయి. వ్యవసాయ రంగంలో అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు పూర్తి చేయలేకపోవడం, ఆర్థిక వ్యవస్థలోకి ఏ విధమైన అడ్డంకులు లేకుండా గ్లోబల్ ద్రవ్యపెట్టుబడులను అనుమతించారు. అవి దేశాభివృద్ధికి గాని ఉపాధి కల్పనకు తోడ్పడకపోవడం సమస్యగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులతో మనుగడ సాగిస్తున్నాయి. అంతర్జాతీయ సంస్థలు భారతదేశ ఆర్థిక స్థితిపై అనేక సందేహాలు వెల్లడించటమే కాదు, క్రెడిట్ రేటింగ్‌ను పెంచటానికి ఇష్టపడటం లేదు. వేగవంతంగా వృద్ధి సాధించటం లక్ష్యంగా ప్రకటించారు. కాని అందుకు కావల్సిన పెట్టుబడి లేదు. నైపుణ్యం గల వర్క్‌ఫోర్స్ లేదు. పథకాలు అనేకం ప్రకటించారు. ఏ ఒక్క పథకం పూర్తిచేయ ప్రయత్నం చేయలేదు. వాగాడంబర జాస్తి, మన్‌కి బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలను చేరే ప్రయత్నం చేశారు కానీ వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పార్లమెంటులో గాని, బయటగాని సమాధానాలు చెప్పలేదు. అంతేగాదు ప్రతి సమస్యకు కారణం గతంలో పాలించిన కాంగ్రెసు, యూపీఏలుగా ప్రచారం చేస్తున్నారు. తాను పదవి చేపట్టి నాలుగు సంవత్సరాలు గడిచినా సాధించనది ఏమున్నది. 2014 ఎన్నికలనాడు వ్యవసాయదారులకు 50 శాతం లాభమందించే విధంగా ధరలు నిర్ణయిస్తానని మోడీ వాగ్దానం చేశాడు. విషయం సుప్రీం కోర్టుకు చేరితే ఫిబ్రవరి 2015లో వాగ్దానం చేసినా అమలు చేయటం సాధ్యకాదని ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. బ్యాంకులు పారుబాకీలు ఎదుర్కొంటున్నాయి. నేడు 10 లక్షల కోట్ల రూపాయలకు చేరాయి. మొండి బాకీల కిందకు చేర్చి బ్యాంకులు వాటిని రద్దు చేస్తున్నాయి. యూపీఏ హయాంలో 12-13, 13-14లో రూ. 61,640 కోట్లు రద్దు చేస్తే 2015లో రూ. 52,542 కోట్లు బ్యాంకులు రద్దు చేసాయి. 2017 చివరి నాటికి 3,60,000 వేల కోట్లకు చేరాయి. నేడు 10 లక్షల కోట్లకు చేరాయి. బకాయిల్లో 40 శాతం పైగా కార్పొరేట్ వ్యాపారులవి. వారి ఆస్తులు గాని, లాభాలు గాని తగ్గలేదు.

దావోస్ సమావేశానికి మోడీ ఈ సంవత్సరం హాజరయ్యాడు. గత సంవత్సరం ఆక్సుఫామ్ సంస్థ వెల్లడించిన సంపద కేంద్రీకరణ వివరాలు- ఆర్థిక వ్యవస్థ 301 ట్రిలియన్ డాలర్లు. మొత్తం సంపదలో 58 శాతం అత్యంత ధనికులైన ఒక్క శాతం వద్దకు చేరింది. 2017 సంపదలో 73 శాతం ఒక్క శాతం వద్దకు చేరింది. అనగా మోడీ పాలన కాలంలో వృద్ధి ద్వారా సాధించిన సంపద దేశీయ సంపన్నుల సంపద పెరగటానికి తొడ్పడింది. సమాజంలో అసమానతలు ధనిక-పేద వర్గాల మధ్య పెరిగాయి. ఉపాధిలేక ఆదాయం లేక అధికుల ఆహార వినియోగం తగ్గింది. మొత్తం జనాభా ఆహారం అవసరాలు వ్యవసాయ రంగం తీరుస్తుంది. పెట్టుబడులు తగ్గించటంవల్ల ఉత్పత్తి తగ్గి పల్సెస్, వంట నూనెల దిగుమతి చేసుకొంటున్నారు. భారతదేశంలో రైతు కుటుంబాలు 80.35 మిలియన్లు. అందులో మార్జినల్ రైతులు, కౌలుదారులు అధికం. 43.42 మిలియన్లు పంట పండిస్తూ రుణభారంతో వున్నారు. రుణభారం తగ్గించమని అనేక రాష్ట్రాల వ్యవసాయదారులు కోరుతూ ఆందోళన చేపట్టారు. కేంద్ర బ్యాంకుల్లోని కోట్లాది మొండి బకాయిలు రద్దు చేయటానికి ప్రభుత్వం ఇష్టపడతుంది గాని రైతుల రుణం రద్దు చేయటానికి ఇష్టపడటలేదు. గ్రామీణ వ్యవసాయదారులు వ్యవసాయం నుండి వైదొలుగుతుంటే వారు చేసే ఉత్పత్తులు ఎగుమతుల ద్వారా ఆదాయం పొందుతుంటే పేదరికం పంట నష్టం వల్ల రుణగ్రస్తులైన వారికి తోడ్పడటానికి సిద్ధంగా లేదు. రాష్ట్రాలు విధి లేక ఊరట కల్పిస్తుంటే కేంద్రం తమకు బాధ్యత లేదంటోంది. ఎంతటి దుర్నీతి. ఉత్పత్తి ఖర్చులు పెరగడం బ్యాంకులు పరపతి అందించక వడ్డీ వ్యాపారులే దిక్కుగా వుంటే ప్రభుత్వాలకు ఎటువంటి బాధ్యత లేదు. కార్పొరేట్ రంగాన్ని, కేపిటల్ ఇంటెన్సివ్ రంగాల్ని ప్రోత్సహిస్తున్నారు. అదానీకి ఆస్ట్రేలియాలో బొగ్గు గని కోసం బిలియన్ డాలర్లు అప్పు ఇవ్వమని మోడీ బ్యాంకులను కోరిన విషయం తెలిసిందే.

దేశదేశాలు తిరిగి గ్లోబల్ ద్రవ్యపెట్టుబడుల రాకకై అంగలార్చిన మోడీ దేశం నుండి ప్రతి సంవత్సరం విదేశాలకు తరలిపోతున్న కోట్లాది సొమ్మును ఆపటానికి ప్రయత్నించటం లేదు. దేశం నుండి అత్యంత సంపన్నులు రూ. 4 వేల లక్షల కోట్లు 2015లో, 6 వేల లక్షల కోట్లు 2016లో, 7 వేల లక్షల కోట్లు 2017లో తరలించారు. పెద్ద లోటుబడ్జెట్లు వేస్తూ పెద్దఎత్తున అప్పుచేస్తూ కూడా ఆస్తులునిర్మించటం గాని, ప్రాతిపదిక సౌకర్యాలు ఏర్పారచటం కానీ చేయలేదు. వడ్డీ చెల్లింపుల భారం పెరిగింది. 2015 నుండి చేస్తున్న అప్పు నేటికి 1,22,427 మిలియన్ల నుండి 15,75,468 మిలియన్లకు పెరిగింది. 69.58 శాతం జీడీపీల్లో వడ్డీ చెల్లింపులకు 5.76 లక్షల కోట్లు చెల్లిస్తున్నారు. ఇదంతా కేంద్ర ప్రభుత్వం చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పువేరు. ఇదిగాక విదేశాల నుండి చేస్తున్న అప్పుంది. తలసరి ప్రతి భారతీయుడిపై రూ. 1,190 అప్పుంది. పెట్టుబడులు పెరగకపోవడానికి ప్రధానకారణం చేస్తున్న అప్పులు. నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించే సామర్థ్యం ప్రభుత్వానికి లేక పిపిపి ద్వారా బీఓటీల ద్వారాను ప్రైవేటు రంగానికి అప్పగిస్తుంది. అప్పు తీసుకోవటానికి వ్యాపార వర్గాలు ముందుకు రావడం లేదు. ఆర్థిక వ్యవస్థ పుంజుకోటానికి ప్రైవేటు రంగపెట్టుబడులు, ప్రైవేటు వినిమయం అవసరం.

ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ సలహాలను పాటించటం ద్వారా భారత ఆర్థిక వ్యవస్థలో ప్రధాన రంగాలను ప్రైవేటీకరిస్తున్నారు. ప్రభుత్వరంగం ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా వుంది. ఆ రంగ సంస్థల్లోని వాటాలను అమ్మటం ద్వారా ప్రైవేటు రంగానికి తోడ్పాటు అందిస్తున్నారు. ఉదాహరణకు బ్యాంకులు, ఇన్సూరెన్సు రైల్వేల్లోను, రక్షణ రంగంలోను, ఇతర పబ్లిక్ రంగ సంస్థల్లో వాటాలను అమ్మకం చేస్తూ పబ్లిక్ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.

ప్రజలకు సంక్షేమం చేకూర్చే పథకాలపై మోడీకి ఆసక్తి లేదు. గ్రామీణ, పట్టణ ఉపాధి హామీ పథకాలపై పార్లమెంటులోనే వ్యతిరేకించటం జరిగింది. ఉపాధులు కల్పించుట ద్వారా గ్రామీణ, పట్టణ పేదలకు కొద్దిపాటి ఊరట కల్పించే పథకాలివి. 75 శాతం ప్రజలకు పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ విధానం ద్వారా ఆహార ధాన్యాలు అందించటం, పేదరికం నిరోధించటానికి ఉద్దేశించిన పథకమది. సామాజికంగా సంక్షేమం చేకూర్చే చర్యలు చేపట్టటానికి ప్రభుత్వం లక్ష్యంగా వుండాలి. అత్యధిక శాతం ప్రజలు నాణ్యమైన జీవితం గడపాలి. అందుకు సూచిక తలసరి ఆదాయం. కొన్ని దేశాల తలసరి ఆదయం చూచినప్పుడు భారతదేశం ఎక్కుడుందో తెలుస్తుంది. తలసరి ఆదాయం స్విట్జర్లాండు 5,17,600 డాలర్లు, ఆస్ట్రేలియా 4,02,600 డాలర్లు, అమెరికా 3,88,000 డాలర్లు, భారత్ 2016-17లో 1,03,219; 17-18లో 1,11,782 రూపాయల్లో. గుజరాత్ ఎన్నికలనాడు ఆత్మగౌరవం గూర్చి ప్రస్తావిస్తూ సర్దార్ పటేల్‌కు, మొరార్జీ దేశాయికి కాంగ్రెస్ అన్యాయం చేసిందని ప్రచారం చేశాడు. కాని తను ఎల్.కే. అద్వానీకి, మురళీ మనోహర్ జోషీకి ఏమి చేశాడు. గుజరాత్‌లో 22 సంవత్సరాల పాలనలో ఎవరి ఆత్మగౌరవం కాపాడాడు? ఎవరి ప్రయోజనాలు కాపాడటానికి కార్మికులు, కర్షకులు, మహిళలు, షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు జాతులకు, ఓబీసీలకు చేసిన వాగ్దానాలు ప్రధానిగా అటకెక్కించాడు. కార్పొరేట్లు ప్రయోజనాలు కాపాడటానికి ఎంతగానో శ్రమపడుతున్నాడు. ఇంధనం, బంగారం, వైట్ గూడ్స్, మెషినరీ దిగుమతులు ఉన్నతాదాయాల వారి కొరకే చేస్తున్నారు. గ్రామీణులను భూముల నుండి వెళ్లగొట్టింది. సంపన్నవర్గాలకు ప్రయోజనం కల్పించడానికి ఆదివాసీలను ఆవాసాల నుండి, జీవన వనరు నుండి వెళ్లగొట్టింది. మోడీ పాలన దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టింది. అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ట మసకబార్చింది. మోడీ, బీజేపీకి ఏ విధమైన తోడ్పాటు అందించినా దేశంలో ఫాసిస్టు పాలన వస్తుంది. దీనిని నిరోధించాలి. భారత లౌకిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి.

- వ్యాస రచయిత : విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ.

విశాలాంధ్ర
బతుకు
The Life
గురువారం
22 ఫిబ్రవరి 2018



కాశ్మీర్ కొండలు!
ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా తాంగ్‌మార్గ్‌లో మంచుతో నిండిపోయిన బ్రిడ్జిపై నుంచి పరుగు తీస్తున్న పిల్లలు.

పిల్లలకు పరీక్షల కాలం సమీపిస్తోంది. మరో వారం రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆ వెంటనే పదో తరగతి పరీక్షలు కూడా. ఈ మధ్యలోనే డిగ్రీ పరీక్షలు. ఈ సమయంలో అందరి దృష్టి దాదాపుగా ఒకే విషయం మీద ఉంటుంది. అదే ప్రిపరేషన్. ఏ సబ్జక్టు ఎలా చదవాలి? ఎంతవరకూ చదవాలి? వీటి గురించే ఆలోచిస్తారు. కానీ ఇక్కడ పట్టించుకోవలసిన కీలకమైన విషయం మరొకటి ఉంది. అదే చేతిరాత. మీకు మార్కులు తెచ్చేపెట్టేది మీ ప్రిపరేషన్ ఒక్కటే కాదు మీ దస్తూరి కూడా. మీరు ఎంత చదివినా, అది అర్థమయ్యేలా. గుండ్రంగా, అందంగా రాయకపోతే సగానికి సగం మార్కులు తగ్గిపోతాయి. సో, చదువుతో పాటు చేతిరాత మీదా దృష్టి పెట్టండి. అందమైన దస్తూరితో అదనపు మార్కులు కొట్టేయండి. ఇందుకోసం ఇప్పటినుంచే ప్రాక్టీస్ ప్రారంభించండి. పరీక్షార్థులూ ఆల్ ది బెస్ట్!

అక్షరం మురిపిస్తే...
ఫలితం మెరిసే!!

దస్తూరితో మార్కులు కొట్టేయండి!

శిలలపై ఉలితో అక్షరాలు చెక్కే కాలమైనా....కంప్యూటర్‌పై అక్షరాలు పేర్చే యుగమైనా ఎక్కడికక్కడ ఈ అక్షరాలను తీర్చిదిద్దడంలోనే ఉంది ప్రత్యేకత అంతా. అక్షరానికి ఉన్న ప్రత్యేకతే అది. జీవితాన్ని తెలియజేస్ప కళల్లోనే అక్షరానికి ఇంత ప్రాధాన్యత ఉంటే జీవితం తొలిదశలో ఉన్న విద్యార్థులు ఎంత ప్రాముఖ్యతనివ్వాలి. తమ చేతిరాతను ఎంతగా తీర్చిదిద్దుకోవాలి. ముఖ్యంగా పరీక్షల్లో దస్తూరియే కీలకమనే విషయాన్ని పిల్లలే కాదు పెద్దలూ గుర్తించాలి. పిల్లల చేతిరాతను మెరుగుపర్చేందుకు పెద్దలూ తగిన శ్రద్ధ పెట్టాలి. వారికి అవసరమైన సలహాలు ఇవ్వాలి. మంచి దస్తూరీ కోసం వారి చేత అభ్యాసం చేయించాలి. సమాధానపత్రం మూల్యాంకనం చేసేవారి మనసును హత్తుకునేలా దస్తూరీ ఉంటే, పొందికైన అక్షరాలతో వారి కళ్ళను కట్టిపడేస్తే సగం మార్కులు కొట్టేసినట్టే. మీరు రాసే జవాబులకు పడేది సగం మార్కులే.

చాలామంది విద్యార్థుల ధ్యాసంతా చదువుపైనే ఉంది. దస్తూరీపై దృష్టి పెట్టేది ఏదో కొద్దిమంది మాత్రమే. పరీక్షల్లో సమాధానాలను ఉన్నది ఉన్నట్లు రాసినా దస్తూరీ బాగా లేకపోయినా, అక్షరాలు అర్థం కాకపోయినా మార్కులు తగ్గిపోతాయి. దస్తూరి బాగుంటే, జవాబు స్పష్టంగా అర్థమయితే మంచి మార్కులు పడతాయి.

ఏడాది పాటు చదివిన పాఠ్యాంశాలను జవాబుల రూపంలో రెండున్నర గంటల్లో సమాధానపత్రంపై పెట్టాలి. పరీక్ష సమయంలో సహజంగా హడావుడి, ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు అక్షరాలు చక్కగా రాసి తర్వాత సమయం మించిపోతుందని వేగంగా రాస్తుంటారు. దీంతో మొదట రాసినట్టు దస్తూరి అందంగా చివరికి రాయలేక పోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందుగానే ఇంటి వద్ద దస్తూరిపై సాధన చేస్తే పరీక్షల్లో ఇటువంటి ఇబ్బందులను అధిగమించవచ్చన్నది నిపుణుల సూచన. ఆణిముత్యాలాంటి అక్షరం కోసం విద్యార్థులు కొన్ని ప్రాథమిక సూత్రాలను పాటించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- జవాబు సూటిగా ఉండటంతో పాటు అక్షరాలు పొందికగా ఉంటే పేపరు దిద్దేవారు మార్కులు అదనంగా వేసేందుకు అవకాశం ఉంటుంది
- పేజీ పై భాగంలో ఒక అంగుళం విడిచి పెట్టి మొదలుపెట్టాలి. సామాన్య, భౌతికశాస్త్రంలో బొమ్మలు గీసి భాగాలను గుర్తించే విషయంలో పెన్నును గట్టిగా ఒత్తి పెట్టి రాయకూడదు. అలా చేస్తే పేపరు వెనకభాగం ఇంకు అంటుకున్నట్టు కనిపించడమే కాదు పేపరంతా అధ్వాన్నంగా తయారవుతుంది.
- కొంతమంది సెంటిమెంట్ అంటూ ఎప్పటినుంచో వాడుతున్న పెన్నులు వాడుతుంటారు. అలాంటి అపోహలకు పోవద్దు. రాయడానికి అనువుగా ఉండే పెన్నులనే ఎంచుకోవాలి.
- పేజీకి 16 నుంచి 20 పంక్తులకు మించి రాయకూడదు. ఎక్కువ కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.
- రోజూ కొద్దిసేపు రాతపై దృష్టిపెట్టి సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయవచ్చు.
- పెన్నును మరీ దగ్గరగా కాకుండా కొంచెం దూరంగా పట్టుకుని రాస్తే అక్షరాలు పూర్తిగా కనిపించడంతో పాటు గుండ్రంగా వస్తాయి.
- జవాబు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకూ వెనక్కి కూర్చుని రాయడం మంచిది. అంగ్ల అక్షరాలు మూడు మి.మీ పొడవు ఉండేలా రాస్తే ముత్యాల్లా ఉంటాయి. అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగినంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి.
- గ్రాఫాలజిస్టులు చేతిరాతను బట్టి వ్యక్తి గుణగుణాలను అంచనా వేయవచ్చని చెప్పడం మనందరికీ తెలిసిందే. దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు మనం మన చేతిరాతకు ఎంత ప్రాముఖ్యతనివ్వాలో.

సమాధానాలు రాసేటప్పుడు...

- గణితంలో సూత్రాలు, సమీకరణాలు కొట్టొచ్చినట్లు కనిపించేలా ఉండాలి. చిత్రపటాలు ఉంటే వాటిని ఆకట్టుకునేలా వేయాలి, శీర్షికలు, ఉపశీర్షికలు, ముఖ్యాంశాలు స్పష్టంగా కనిపించేలా వాటి కింద గీతలు గీయాలి. అవసరమైనచోట విరామచిహ్నాలు ఉండేలా చూసుకోవాలి.

చేతిరాతకు ఎంతో ప్రాధాన్యం



శాస్త్ర, సాంకేతికపరంగా ఎంత ఎదిగినా చేతిరాతకు ఉండే ప్రాధాన్యం వేరు. సంబంధిత భాషలో పట్టు ఉంటే రాయడం తేలిక అవుతుంది. దస్తూరి బాగున్న విద్యార్థులు అదనంగా మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థులు చేతిరాతపై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల చేతిరాత అభివృద్ధి చేసేందుకు కాపీ రైటింగ్, ఉక్తలేఖనం రాయించాలి.

ఎల్. రాఘురామిరెడ్డి,
ఉపాధ్యాయులు, కోటబొమ్మాళి

ఆందోళన వద్దు



విద్యార్థులు పరీక్షల సమయంలో ఎట్టి పరిస్థితిల్లోనూ మానసిక అందోళనకు గురి కాకుడదు. ఆందోళనతో అక్షరాలను సరిగా రాయలేరు. పరీక్షల సమయంలో విశ్రాంతి తీసుకోకుండా చదువుతుంటారు. పరీక్ష కేంద్రాలోకి ప్రవేశించే వరకూ కొందరు చదువుతూనే ఉంటారు. ఇది మంచిది కాదు, ఇలా చేస్తే సమాధానాలను కుదురుగా రాయలేని పరిస్థితి ఏర్పడుతుంది. విశ్రాంతి లేకపోతే అలసటకు గురై దాని ప్రభావం చేతిరాతపై పడుతుంది. పరీక్ష రాసేటప్పడు కూర్చునే భంగిమ కూడా ముఖ్యమే.

నౌగాపు సుశీలనాగరాజు,
ఉపాధ్యాయురాలు, నలంద స్కూల్.

- ఎస్.రమేష్, కోటబొమ్మాళి





వాల్ మిర్రర్ డిజైన్స్!

అద్దం మన అవసరానికే కాదు ఇంటి అలంకరణకూ ఉపయోగపడుతుంది. గోడకు తగిలించే పెద్ద అద్దాల్లో ఇప్పుడు రకరకాల డిజైన్స్ వస్తున్నాయి. ఇవి ఇంటి అందాన్ని మరింత పెంచుతున్నాయి. అద్దం చుట్టూ పువ్వులు, డైమండ్స్, సూర్య కిరణాలు ఇలా చూడచక్కని ఆకృతుల్లో మురిపిస్తున్నాయి. ఇంట్లో అడుగు పెట్టిన అతిథులను ఆకర్షించే వస్తువుల్లో అద్దం కూడా ఒకటి. మరి దీనిమీద, ఈ డిజైన్స్ మీదా మీరూ దృష్టి పెట్టండి మరి!







ముసలితనంలోనూ మెదడు చురుగ్గా....!

జ్ఞాపకశక్తి, అభ్యాసనా నైపుణ్యాలు, విజ్ఞాన స్థాయిలు అన్ని వయస్సుల వారిలోనూ ఒకేలా ఉండవు. వయస్సుతో పాటే మతిమరపు పెరుగుతుంది. ఆమాటకొస్తే...జ్ఞాపకశక్తి తగ్గిపోవడమనే సమస్య నేడు అన్ని వయస్సుల వారినీ వేధిస్తోంది. ప్రస్తుతం వయస్సు పైబడిన వారిలోనే కాదు....మిగిలిన వారిలో కూడా మానసిక ఒత్తిడి వల్ల ఇలాంటి సమస్యలు కనిపిస్తున్నాయి. సాధారణంగా 70 ఏళ్ళు పైబడిన వారిలో జ్ఞాపకశక్తి మందగించడం మొదలవుతుంది. దీనికి తోడు మెదడుకు సంబంధించిన సమస్యలూ వస్తాయి. వయస్సు మీద పడే కొద్దీ మెదడులోని కణాలు క్షీణించడం మొదలవుతుంది. ఏ వయస్సువారైనా...మెదడు పనితీరు చురుగ్గా వుండాలనుకుంటే ఈ చిట్కాలను పాటించాల్సిందే.



- మీకు అభిరుచి ఉన్న పనులను అలవాటుగా చేసుకోవడం వల్ల మెదడు చురుగ్గా పని చేస్తుంది. పెయింటింగ్, పాటలు పాడటం, నృత్యం చేయటం వంటి సృజనాత్మకను పెంచే పనులను చేయడం ద్వారా మెదడులోని కణాలు క్షీణించడం తగ్గుతుంది. దీని వల్ల మెదడు పని తీరు కొంతకాలం వరకు ఆరోగ్యవంతంగా వుంటుందని విశ్లేషకులు వెల్లడించారు.
- జిమ్‌కి వెళ్ళటం, పరిగెత్తడం వంటి శారీరక వ్యాయామాలు చేయడం వల్ల కూడ మెదడు సమర్థవంతంగా పని చేస్తుంది. దీనితో పాటు మెదడుకు పదును పెట్టే పదవినోదం, సుడోకు, మెమోరీకి సంబంధించిన ఆటలు ఆడటం వల్ల కూడా ఏ వయస్సు వారిలోనైనా బ్రెయిన్ చురుగ్గా పనిచేస్తుంది.
- నిత్యం సమతుల్యమైన ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల బ్రెయిన్ చురుగ్గా వుంటుంది. మెదడును ఆరోగ్యవంతంగా వుంచే పోషకాలున్న ఆహారాన్ని తీసుకుంటే అవి బ్రెయిన్ పని తీరు కొంతకాలం పాటు రీ జనరేట్ చేస్తాయి.
- మెదడుకు విటమిన్‌లు, పోషకాలు ఎంతో అవసరం ప్రత్యేకించి ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు మెదడు పని తీరును మెరుగు పరుస్తాయి. ఉదాహరణకు చేపలు, నెయ్యి, కొబ్బరి వంటి ఒమేగా-3 కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల మెదడు ఎక్కువ కాలం పనిచేస్తుంది.
- ఒకే సమయంలో రెండు వేరు వేరు పనులు అంటే డైలీ జాబ్, పార్ట్ టైమ్ జాబ్, రెండు కోర్సులు నేర్చుకోవడం వంటి పనులు చేయడం వల్ల కూడ ఒక్కొక్కసారి మెదడు పని తీరు మందగిస్తుంది. ఈ తరహా పని వల్ల బ్రెయిన్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇలాంటివి మానేస్తే మీ మెదడు పనితీరు కొంత మెరుగవుతుంది.
- మీకు నచ్చిన వారితో కాసేపు కబుర్లు చెప్పడం, నవ్వుతూ వుండటం లాంటి పనులకు ఎక్కువ సమయం కేటాయిస్తే మెదడులోని కణాలు మళ్ళీ పుంజుకుంటాయి.
- ఇంటి పనులు గిన్నెలు కడగటం, ఇల్లు శుభ్రపరచటం, మొక్కలకు నీళ్ళు పోయడం, వంట చేయడం లాంటి పనులను ఇష్టంగా చేయడం వల్ల కూడా మెదడు పనితీరు మెరుగవుతుంది.
- మెదడు సంబంధింత వ్యాధులు రావడానికి మరో కారణం శరీరంలోని కొలెస్ట్రాల్. కొవ్వు పెరగకుండా ఎప్పటికప్పుడు అదుపులో వుంచుకోవాలి.
- మద్యం తాగడం, సిగరెట్, గుట్కా , పాన్ నమలడం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండడండి. ఇలా చేయడం వల్ల మెదడులోని కణాల స్థాయి తగ్గకుండా ఆరోగ్యవంతంగా వుంటుంది.

ఇవి కలిపి తింటే విషమే!

రకరకాల ఆహార పదార్థాలను కలిపి తినే అలవాటు వుందా? అయితే దాన్ని మానుకోవాల్సిందే. ఇలా తీసుకోవడం వల్ల మీ జీర్ణశక్తి తగ్గి గ్యాస్‌ట్రబుల్, అల్సర్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం పొంచి వుంది. కడుపు నొప్పి, వాంతులు, వికారం, కళ్ళు తిరగడం, అలసట వంటి సమస్యలూ తలెత్తుతాయి. మీకు తెలుసా కొన్ని పదార్థాలను కలిపి తీసుకోవడం వల్ల అవి విషపూరితంగా మారతాయి. సకాలంలో స్పందించకపోతే వీటివల్ల ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదమూ ఉంది. మరి, అలా కలిపి తినకూడనివి ఏమిటో చూద్దామా!





- ★ గుడ్లు, పందిమాంసం ఒకేసారి తినకూడదు. ఇలా తింటే గుడ్డులోని ప్రోటీన్స్, పందిమాంసంలోని కొవ్వు వెంటనే జీర్ణం కావు. జీర్ణక్రియ మందగింపు వల్ల శరీరానికి భారం పెరుగుతుంది, నీరసం వస్తుంది.
- ★ బర్గర్, వేపుడు పదార్థాలని కలిపి తినడాన్ని చాలామంది ఇష్టపడతారు. కానీ వీటిల్లోనూ కొవ్వు అధికమే. దీనివల్ల బద్ధకం, నిద్రమత్తు ఆవహిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.
- ★ చాలా మంది చల్లని శీతల పానీయాలు లేకుండా పిజ్జా తినరు. పిజ్జాలో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ ఉంటాయి. దీంతోపాటు సోడాలోని షుగర్ జీర్ణశక్తిని మందగించేలా చేస్తుంది. దీని వల్ల పొట్ట ఉబ్బరంగా వుంటుంది.



- ★ ఆలివ్ ఆయిల్, డ్రైఫూట్స్ కలిపి తీసుకోవడం వల్ల కొవ్వు అధికమై జీర్ణశక్తి తగ్గుతుంది.
- ★ ఉడికించిన బంగాళాదుంపలు, మటన్ ఒకేరోజు తినకూడదు. దీనివల్ల జీర్ణశక్తికి సంబంధించిన సమస్యలు వస్తాయి.



- ★ అరటిపండులో పోటాషియం ఎక్కువగా వుంటుంది. పాలల్లో ఎంజైమ్ శాతం ఎక్కువగా వుంటుంది. తరచుగా ఈ రెండిటిని కలిపి తినడం వల్ల శరీరాకృతి దెబ్బతింటుంది. మెదడు పనితీరూ మందగిస్తుంది.
- ★ ఆమ్లాల శాతం ఎక్కువగా వున్న నిమ్మ, వేప, టమాటా లాంటివాటిని తియ్యని పండ్లు బొప్పాయి, అరటి పండు, ఎండుద్రాక్షలతో కలిపి తినకూడదు.



- ★ చికెన్, మటన్ వంటి ఆహార పదార్థాలతో పాటు తియ్యటి వంటకాల్ని తీసుకోకూడదు. అలా చేస్తే గ్యాస్‌ట్రబుల్ వస్తుంది.



జరిగిన కథ

...మదనం మంచిహుషారులో వున్నాడు. కారణం అడిగేను. తనకి 'మేజరు' హోదా ఇస్తానని జనరల్ రాబర్టు ఖరారు చేశాడనీ - ఉత్తర సర్కారుల 'రిక్రూటుమెంటు' సంఘానికి తనని అధ్యక్షుడిగా వుండమని కలక్టరే కోరేడని-చెప్పాడు ... ఇంటి ముందు కారు దిగుతూండగా - మదనం నన్ను ముద్దు పెట్టుకోబోయాడు. అతని పెదిమెలు నన్ను తాకేముందు - ఆ షాంపేను వాసన నాకు తగలగానే చురుక్కుని ఒక్క లెంపకాయ తగిలించినాను.

4 అతడు

ఇన్నాళ్ళకి శుభదగ్గిరనుంచి వుత్తరం! నిజానికి ఉత్తరం కాదు-కార్డు! అందులోనూ-బొమ్మకార్డు! ఒక వేపు 'డాల్ఫిన్స్ నోసు' దృశ్యం - రెండోవేపు నాలుగు పాదాల చాటువు!

(నిన్నటి సంచిక తరువాయి)

"యేరాడ కొండపై నీరెండల క్రీడలు
పడుచుల ఎదదలు తొణకని కుండలు
లోయతోట నీడలు వలపుల పుంతలు
ఎడబాటుల బాధలు ఆవంతలు కొండంతలు!"
-1 ఏప్రిల్ 1942...శుభ."

పదిమాట్లు - పదిమాట్లేమిటి - నూరుమాట్లు చదువుకున్నాను. అక్షరాలు ముత్యాలకోవలు. అక్షరం అక్షరం కళ్ళకద్దుకున్నాను. అక్షరం అక్షరం ముద్దుపెట్టుకున్నాను. ఆ అక్షరాల్లో నుంచి కలకలమని ఆమె నవ్వు వినిపించింది. ఆమె కళ్ళ కొలకులనుంచి చుక్కల కాంతులై రాలినట్టున్నాయి. ఆమె అక్షరాలు. ఆ చాటువులో ఆమె నా ప్రేమని హాస్యం చేస్తుందా? లేకపోతే తన ప్రేమనే వ్యక్తపరుస్తుందా?

....యేరాడకొండ ....లోవతోట...డాల్ఫిన్సునోసు.... తల్చుకుంటే నాకు తల తిరుగుతూంది! చిన్నతనంలో ఏకాకినై ఎన్నిసార్లీ స్థలాల్లో కాలం గడిపేనో! ఆ స్థలాలన్నీ ఆ ఐ.సి.యస్. వాడితో శుభ సరదాగా చూస్తూంది కాబోలు! చిన్నప్పటి నుండీ నాకు ఒంటరిగా వుండడం అలవాటైపోయింది. మా పేదరికం - తెలిసిన వారందరిళ్ళలోనూ అమ్మ నీళ్ళబిందెల వాడికచూసి, నాతోడిపిల్లలు నన్ను అసహ్యంచేస్తూ నా సహవాసం చేసేవారుకారు. వాళ్ళతో చదువుకునేందుకు నన్ను వాళ్ళిళ్ళకి రమ్మనే వారుకారు. సాయంకాలం ఆటలాడుకునేటప్పుడు నా జట్టు కూడేవారు కారు. కాణీ పెట్టి నేను పకోడీలు కొనుక్కుంటే ఇచ్చినా పుచ్చుకునేవారుకారు. ఒక్కొక్కప్పుడు పుచ్చుకుని నా ముఖంమీదే గిరవాటు వేసేవారు. చిన్న తరగతుల్లో చదువుకునేటప్పుడు ఈ వెలినన్నంత బాధ పెట్టకపోయినా - హైస్కూలు తరగతుల్లో నన్ను మహా బాధించేది. ఆ అంక్ష తల్చుకునేటప్పుడల్లా నా గుండె సీసపుగుండై పోయేది. లోలోపల యేడ్చుకునేవాడిని. వూరికే కోపం పుట్టుకొచ్చేది. ఎవరిమీదో, ఎందుకో, ఎలా తీర్చుకోవడమో తెలిసేదికాదు. నా కసి ఎవరిమీద చూపించుకోను? నా కోపం ఎలా ఉపశమింప జేసుకోను? తెలియక - అలా యేడుస్తూనే ఉప్పు టేరుదాటి ఒక్కపరుగున యేరాడ కొండ ఎక్కిపోయేవాడిని. కాలుజారితే బుర్ర బద్దలైపోతుంది - కెరటాలు నడిసముద్రంలోకి ఈడ్చేస్తాయి అన్న మతే లేకుండా ఆ గుహల్లో జొరపడి పోయేవాడిని. ఒంటి అలసటతో - ఉడుకుమోత్తనం - నిస్పృహ - మాయం అయిపోయేవి. నా బాధ అమ్మతోనేనా చెప్పేవాడిని కాను. చెబితే అసలే నా గురించి ఆమె పడుతూన్న కష్టాలు మరింత దుర్భరం అయిపోతాయని నాలో నేనే కుళ్ళి ఓర్చుకునేవాడిని. ఒకనాడు నేను ఎంతో అపురూపంగా లడ్డుండ కొనుక్కుని తినబోతూంటే, తోడికుర్రాళ్ళు నలుగురు పోగయి, "నీళ్ళబిందెలాడివి నీకు లడ్డుండ కూడానా" అంటూ నా చేతిలో వుండని లాక్కుని కాళ్ళకిందేసి మట్టేశారు. వాళ్ళు చేసిన హింసకి మరి సహించలేక అమ్మతో చెప్పి ఏడ్చాను. అప్పుడు అమ్మ "ఎవరిని అనగలంరా నాయనా? ప్రపంచాన్నే అనాలి!" అంది...లోయతోట్లో కొబ్బరిచెట్ల నీడని బోడిగుండు చేసినా



హిందూ ప్రపంచాన్నా? ఎండనక, వాననక, దుమ్మనక, బురదనక అమ్మని రోజూ ఆ పాసిపోయిన కాళ్ళతో నీళ్ళబిందె నెత్తిమీద పెట్టుకుని మైళ్ళకొద్దీ నడిపించే సంఘాన్నా? నూతుల దగ్గిర, కుళాయిల దగ్గిర, రవ్వరొప్పుపడలేక, చంకని బిందె మొయ్యడానికి శక్తిలేక గుమాస్తా మొగుళ్ళు సంపాదించే 25 రూపాయలతోను కాలక్షేపం చేసుకోలేక అమ్మని బతిమాలుకుని ఖర్చులేకుండా మంచినీళ్ళు పోయించుకునే ఒంటికాపురపు ఆడపడుచులనా? వేలాది ప్రజలకి తాగడానికి నీళ్ళు చుక్కేనా లేకుండా చేసిన మునిసిపాలిటీ వాళ్ళనా? నాలాంటి బీద కుర్రవాడికి వార్షికం ఇచ్చి ఉచితంగా చదువు చెప్పించడం



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

పోయి, నా ఓనమాలకోసం నీళ్ళబిందికి అమ్మని బానిసగా చేసిన గవర్నమెంటునా? నా చిన్నతనంలో హిందూమతం అంటే పుల్లంభొట్ల పేరావధాన్లే అని. అతను సంవత్సరానికి ఒకసారి మాయింటికొచ్చి నాన్న తద్దినం పెట్టించి అమ్మదగ్గిర్నుంచి రెండు రూపాయలు దక్షిణ, గావంచ జతా పట్టుకుపోయేవాడు. అది మినహా మా జోలికి అతను వచ్చేవాడు కాడే! సంఘం అంటే ఘరానా వర్తకులు కట్టించిన రామ మందిరంలో కచేరీ గుమాస్తాలు, ప్లీడరు గుమాస్తాలూ, కోమటికొట్టు గుమాస్తాలూ కలిసి పెట్టిన భజనసంఘం అనుకునేవాడిని. వీరందరిళ్ళలోనూ అమ్మదే మంచినీళ్ళ వాడిక. ఆ చిన్న సంసారాలు చేసుకోలేక, నెల రెండునెలలూ అటూ ఇటుగా అమ్మకి బాకీలు పెడుతూ డబ్బులు యిచ్చుకునేవారు. సగంమంది ఇళ్ళల్లో అమ్మ డబ్బు పుచ్చుకోకుండానే పోసేది. వాళ్ళు మాకేం అపకారం చేయడంలేదే! మునిసిపాలిటీ అంటే మేనేజరు అంభారీఖానా సేతు మాధవరావు పంతులుగారే. జల్తారు అంచు ఎర్రటి బుట్టతలపాగా పెట్టుకొని పెట్టిబండిలో కృష్ణయ్యగారి బడి ముందునుంచే వెళ్ళేవాడు రోజూ మునిసిపలు కచేరీకి. ఆ వీధిలో వున్న కుళాయి ఆయన ఇంటి గుమ్మంలోనే వుండేది. తీనిరేకు దోనెలోనించి రాత్రంతా వీధి కుళాయి మంచే వారింట్లోకీ నీళ్ళొచ్చేవి. కుళాయిదగ్గిర అలాగాజనం పెట్టేగోలకి ఆయన జపం జరగదని, ఆయన మడిస్నానం అయాక బంట్రోతు నీళ్ళకుళాయి మర బిగించేసి వెళ్ళి పోయాడు. వాళ్ళింట్లో నీళ్ళు పుష్కలంగా వుండడంచేత వాళ్ళకి నీళ్ళవాడిక అవసరం లేకపోయేది. అంచేత మేం యెవరమో ఆయనకీ తెలియందే! గవర్నమెంటు అంటే కలెక్టరు దొరగారూ పోలీసు సూపరింటెండెంటు దొరగారున్నూ. వాళ్ళు పెద్ద వాల్తేరులో నాల్గంతస్తుల భవనాల్లో వుంటారుట. వాళ్ళింట్లో నీళ్ళు అన్నీ కుసినీ వాళ్ళే పోస్తారు. వాళ్ళెప్పుడూ మా రంగురాజు వీధికే రాలేదు. మాలాంటివాళ్ళమి వున్నామనే వాళ్ళకి తెలియదు పాపం! అలాంటప్పుడు అమ్మకీ నాకూ కిట్టనివాళ్ళెలా అవుతారు? అమ్మనిలా అష్టకష్టాలు పెడుతున్న వాళ్ళెవళ్ళో నాకు బోధపడ్డం లేదు. అర్థంకాక నాకు మరింత కోపంవచ్చి కంటినుంచి వేడి చుక్కలు బొటబొట బుగ్గలమీద రాలేయి. చిన్ననిద్దర పట్టింది. చీమలు కరుస్తే తెలివొచ్చింది. కొబ్బరి చెట్టుమీద నుంచి చీమల బారు పాకుతూంది. అడ్డంగా నేనుంటే నన్ను కరుస్తున్నాయి చీమలు. వాటికి నేను ఏ హానీ చేయకపోయినా వాటిదారిలో నేనుండటంచేత నన్ను శత్రువుకిందే భావించి నన్ను హింసిస్తున్నాయి. నేను, అమ్మకూడా ఈ ప్రపంచానికి శత్రువులమే కాబోలు? మమ్మల్నీ మాబోటి అమాయకుల్నీ హింసిస్తేకాని యీ ప్రపంచం కలక్టరుగారూ, పోలీసు సూపరింటెండెంటుగారూ, మునిసిపల్ మేనేజరుగారూ, పేరావధాన్లుగారూ, వర్తక శిఖామణులూ వీరందరి నాయకత్వాన్న నడుస్తున్న యీ ప్రపంచం - ముందుకు నడవదేమో?... చీమల్ని చంపడం ఎందుకు వాటిదారినుంచి లేచిపోయి - పనసచెట్టు నీడకిందికి పోతే సరి ... పనసచెట్టుకింద ఎర్రపులి చీమలు! ....పోనీ యింటికి వెళ్ళిపోతాను. ఇంటికి వెళ్ళిపోతాను, కాని ప్రపంచంనుంచి వెళ్ళిపోలేనే? ...బడిలో చదువుతున్న "గల్లివర్" పాఠం జ్ఞాపకం వొచ్చింది. నేను చదువుకుని పెద్దవాణ్ణయి కసరత్తుచేసి గల్లివర్ అంతవాణ్ణి అవుతాను. అప్పుడు నన్ను దారంతో కట్టేయడానికి వచ్చిన యీ మరుగుజ్జు వాళ్ళందరినీ ధూం ధూం చేసి అమ్మ నెత్తిమీద వీళ్ళు పెట్టిన నీళ్ళ బిందిని కిందపడేసి అమ్మతలమీద వజ్రాల కిరీటం పెడతాను...నా మటుకు నాకే నవ్వొచ్చింది! కంఠతా వచ్చిన గల్లివరు పాఠం అంతా వల్లించుకుంటూ ఆనందపడుతూ - ఒక్కపరుగున కొండదిగి బల్లకట్టుదాటి ఇంటికెళ్ళి పోయాడు.

ఈ స్వానుభవాలన్నీ శుభతో చెప్పాలనుకుంటాను. ఆమె పరిచయం అయినప్పటి నుంచీ నా హృదయంలో వుండే సీసపు గుండుకు చలనం వచ్చింది. వసంత ఋతువుగాలికి ఆ సీసపు గుండు కరిగి ఉడుకు రక్తపుకండైంది. ఆమెతో వున్నప్పుడల్లా గాలిలో తేలిపోతున్నట్లుంటుంది. నాకు. నాకళ్ళముందొక తేజస్సు తాండవిస్తుంది. పరమానందం సన్నావరిస్తుంది. దివ్య సుందరమైన పరిమళంలో రెక్కలు కట్టుకుని ఎగిరిపోతున్నట్టుంటుంది. ఆమె వ్రాసిన చాటువు నాల్గు పంక్తులు మళ్ళీ చదివాను. నా హృదయంలో ఆమె నవ్వులు వినిపించాయి. ఆ నవ్వులు నా హృదయంలోనుంచే వచ్చాయేమో?....

కొత్తగా మంజూరైన రైలుమార్గం తాలూకు ఆఖరి అంచనా లెక్కలని మరోమాటు తిరగేశాను. రైల్వేశాఖ నుంచి మిలటరీ శాఖకి, మిలటరీ శాఖ నుంచి రైల్వేశాఖకీ, నాలుగుసార్లు కాగితం నలిగి అంచనా లెక్కలు నాలుగుసార్లు తనిఖీ అయే టప్పటికల్లా - ఎనిమిది లక్షల ఇరవై వేల అంచనా పన్నెండు లక్షల యాభైవేలకి పెరిగింది. నా దగ్గరినుంచి ఆఖరిసారి కాగితాలు పైకివెళ్ళేముందు అన్ని లెక్కలు మళ్ళీ మరొకసారి క్షుణ్ణంగా తనిఖీ చెయ్యాలి. అదిగో బకింగుహాము కెనాలు మీద , కూము నదిమీద రెండు వంతెనలకీ చెరి రెండు లక్షలూ ఖర్చు చూపించారు. ఈ వంతెనల నిర్మాణమే మార్చేస్తాను. సమూనా అంతా బూజుపట్టిన పాత పద్ధతుల్లో తయారుచేశారు - ఉక్కు వాసాలు - ఉక్కు దూలాలున్నూ కొల్లకొల్లలుగా వేశేశారు- వాళ్ల సొమ్ము యేం పోయిందని కాబోలు! యుద్ధం రోజుల్లో ఇంత విలువైన ఉక్కును ఇంత నిర్లక్ష్యంగాను యింత దుబారాగాను వాడడమే? ఈ కోఫర్‌డామ్ము యేమిటి? - ఇంకా వుంది.

అమ్మాయిల్లో ఆటిజం గుర్తించడం కష్టమే !



అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిల్లో తొలి దశలో ఆటిజంను గుర్తించడం కష్టమని తాజా అధ్యయనమొకటి తెలిపింది. నలుగురితో కలివిడిగా ఉండటం, వేషధారణ వంటి సామాజికపరమైన అంశాల్లో అమ్మాయిలు కాస్త ఎక్కువగా ఇబ్బంది పడుతుండటమే ఇందుకు కారణమని వెల్లడించింది. పాఠశాల విద్యనభ్యసిస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలపై తాము తాజా పరిశోధన నిర్వహించినట్లు అమెరికాలోని 'ఆటిజం స్పెక్ట్రం రుగ్మతల పరిశోధనల కేంద్రం' శాస్త్రవేత్త అల్లిసన్ రట్టో తెలిపారు. ఆటిజం లక్షణాలు అమ్మాయిలు, అబ్బాయిల్లో వేర్వేరుగా ఉండే అవకాశముందన్న వాదనను తమ అధ్యయన ఫలితాలు బలపరిచినట్లు పేర్కొన్నారు. ఆటిజంతో బాధపడుతున్న అబ్బాయి లతో పోలిస్తే.. అమ్మాయిలు (ఆటిజం ఉన్నవారు) రోజువారీ పనులు చేసుకోవడంలో ఎక్కువ ఇబ్బంది పడుతున్నట్లు తాము గుర్తించామన్నారు. అందువల్ల అబ్బాయిలకు చేసే పరీక్షలతోనే అమ్మాయిల్లోనూ ఆటిజం గుర్తించడం సులువు కాదని అభిప్రాయ పడ్డారు. ఆటిజం లక్షణాలు లింగంపై కూడా ఆధారపడి ఉంటాయని గుర్తించిన తొలి అధ్యయనం ఇదే కావడం గమనార్హం.

ఎక్సైటినోయిమ్‌ను కనుగొన్న శాస్త్రవేత్తలు



పదార్థానికి సంబంధించిన ఒక కొత్త రూపం ఉనికిని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఎక్సైటినోయిమ్ అనే రూపాన్ని 50 ఏళ్ల కిందట సూత్రీకరించారు. అప్పటినుంచి అది శాస్త్రవేత్తలతో దోబూచులాడుతూనే ఉంది. తాజాగా అమెరికాలోని బెర్కెలీ, ఇలినోయి విశ్వవిద్యాలయాలకు చెందిన శాస్త్రవేత్తలు ఈ గుట్టును విప్పారు. ఎక్సైటినోయిమ్ అనేది ఒక సంక్షేపణం (కండెన్సేట్). సూపర్ కండక్టర్ తరహాలో క్వాంటమ్ తీరుతెన్నులను అది ప్రదర్శిస్తుంది. అది ఎక్సైటాన్లు అనే రేణువులతో తయారైంది. ఇవి పలాయన ఎలక్ట్రాన్, అది మిగిల్చిన రంధ్రం ద్వారా.. చాలా విచిత్రమైన విధానంలో రూపుదిద్దుకుంటుంది. ఒక సెమీ కండక్టర్‌లో రద్దీగా ఉండే ఎలక్ట్రాన్ వేలెన్స్ బ్యాండ్ అంచువద్ద ఉన్న ఒక ఎలక్ట్రాన్.. ఉత్తేజితమై, ఖాళీగా ఉండే గ్రాహక బ్యాండ్‌కు చేరుకుంటుంది. ఫలితంగా వేలెన్స్ బ్యాండ్‌లో ఒక 'రంధ్రం' ఏర్పడుతుంది. ధనావేశం కలిగిన ఒక రేణువులా ఆ రంధ్రం వ్యవహరిస్తుంది. పలాయనమైన ఎలక్ట్రాన్‌ను ఆకర్షిస్తుంది. రుణావేశం కలిగిన ఆ ఎలక్ట్రాన్.. ఆ రంధ్రంతో జతకట్టినప్పుడు ఎక్సైటాన్ ఏర్పడుతుంది. ఎక్సైటోనియం, పెయిర్స్ అనే ఓ దశ ఒకేలా ఉంటాయి. అందువల్ల ఎక్సైటోనియంను నిర్దిష్టంగా గుర్తించే ప్రయోగసాధనాలు ఇప్పటివరకు శాస్త్రవేత్తల వద్ద లేవు. తాజాగా శాస్త్రవేత్తలు మొమెంటమ్ రిసాల్వ్‌డ్ ఎలక్ట్రాన్ ఎనర్జీలాస్ స్పెక్ట్రోటస్కోపీ (ఎం-ఈఈఎల్ఎస్) అనే వినూత్న విధానం ద్వారా ఈ ఇబ్బందిని అధిగమించారు. ఎక్సైటినోయిమ్ అనే పేరును 1960లలో బెర్ట్ హాల్పరిన్ అనే భౌతికశాస్త్రవేత్త పెట్టారు.

సూర్యుడికన్నా 200 రెట్లు భారీ తారలు

మన పాలపుంత నక్షత్ర మండలానికి పొరుగునున్న గెలాక్సీలో భారీ నక్షత్రాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ఖగోళ శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. సూర్యుడితో పోలిస్తే.. ఈ భారీ తారల పరిమాణం పదిరెట్ల కన్నా ఎక్కువ ఉన్నట్లు పేర్కొన్నారు. భారీ నక్షత్రాలపై శాస్త్రవేత్తలకు ఎక్కువ ఆసక్తి కలగడానికి కారణం.. పరిసరాలపై అవి చూపే భారీ ప్రభావమే. ఈ తారల్లో ఇంధనం నిండుకున్నాకే.. సూపర్‌నోవా అనే భారీ విస్ఫోటనంతో అవి పేలిపోతాయి. ఫలితంగా... న్యూట్రాన్ తారలు, కృష్ణబిలాలు వంటి వింత ఖగోళ వస్తువులు పుట్టుకొస్తాయి. పాలపుంతకు సమీపంలో



ఉన్న లార్జ్ మెగాలానిక్ క్లౌడ్ గెలాక్సీలోని నక్షత్ర ప్రాంతమైన '30 డోరాడస్'లోని దాదాపు వెయ్యి భారీ తారలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు సాగించారు. వీటిలో 250 నక్షత్రాల ద్రవ్యరాశి... సూర్యుడికన్నా 15 నుంచి 200 రెట్లు ఎక్కువగా ఉంది. "సూర్యుడికన్నా 200 రెట్లు పెద్దగా ఉన్న నక్షత్రాలు విస్తృతంగా కనిపించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఇటీవలివరకు వాటి ఉనికిపై వివాదం ఉండేది. అయితే 300 రెట్లు పెద్ద నక్షత్రాలు ఉంటాయని మా పరిశోధనలో తేలింది" అని హ్యూగ్స్ సనా అనే శాస్త్రవేత్త పేర్కొన్నారు. విశ్వంలో సూర్యుడికన్నా పదిరెట్లు పెద్దగా ఉండే నక్షత్రాలు ఒక్కశాతం లోపే ఉంటాయన్న అంచనా ప్రస్తుతం ఉంది. అయితే ఊహించినదానికన్నా ఇవి ఎక్కువ సంఖ్యలోనే ఉంటాయని తాజా పరిశోధనలో వెల్లడైంది.

విశ్వం గుట్టు విప్పిన విద్యార్థి ఉపగ్రహం

విద్యార్థులకు సంబంధించిన ఒక చిన్న ఉపగ్రహం.. విశ్వానికి సంబంధించిన ఒక పెద్ద గుట్టును విప్పింది. భూమి రేడియో ధార్మిక వలయాల్లో ఉండే హానికర, అవేశ రేణువుల మూలంపై ఉన్న మిస్టరీని ఛేదించింది. సీఎస్ఎస్‌డబ్ల్యూఈ అనే ఈ బుల్లి ఉపగ్రహాన్ని కొలరాడో విశ్వ విద్యాలయం విద్యార్థులు నిర్వహిస్తున్నారు. అందులో ఆవేశరేణు టెలిస్కోప్ ఉంది. భూమి రేడియో ధార్మిక వలయంలోని ఎలక్ట్రాన్లను, సౌర ఆవేశ ప్రోటాన్ల తాకిడిని కొలవడం దీని విధి. ఈ వలయంలో పొరలుపొరలుగా ఆవేశ రేణువులు ఉంటాయి. భూమి అయస్కాంత క్షేత్ర ప్రభావంతో అవి అక్కడే ఉండిపోతాయి. ఈ రేడియోధార్మిక వలయంలోని ఆవేశ ఎలక్ట్రాన్లు.. నక్షత్రాలు పేలిపోయేటప్పుడు జన్మించే కాస్మిక్ కిరణాల ద్వారా ఉత్పత్తవుతున్నట్లు తాజా పరిశోధనలో తేలింది. భూ వాతావరణంలోకి ప్రవేశించే కాస్మిక్ కిరణాలు.. తటస్థ అణువులను ఢీకొడతాయని వెల్లడైంది. ఫలితంగా ఎలక్ట్రాన్లు సహా ఆవేశ రేణువుల ఉత్పత్తి జరుగుతుందని నిర్ధారణ అయింది.

సైన్స్, టెక్నాలజీ తాజా సమాచారం

అమెజాన్‌లో తొలి హైబ్రిడ్ పక్షి జాతి గుర్తింపు

అమెజాన్ వర్షాధారల అడవుల్లో తొలిసారిగా హైబ్రిడ్ పక్షి జాతిని శాస్త్రవేత్తలు గుర్తించారు. బంగారు వర్ణపు తురాయి కలిగిన ఈ పక్షికి గోల్డెన్ క్రౌన్డ్ మానాకిన్ అని పేరు పెట్టారు. అనేక జన్యు, ఇతర పరీక్షలు నిర్వహించి... దీన్ని హైబ్రిడ్ జాతిగా నిర్ధారించారు. ఈ పక్షిని తొలుత 1957లో బ్రెజిల్‌లో కనుగొన్నారు. ఆ తరువాత 2002 వరకూ మళ్లీ వెలుగు చూడలేదు. రెండు మాతృ జాతుల మధ్య సంయోగం జరిగినప్పుడు హైబ్రిడ్ జాతి పుట్టుకొస్తుంది. హైబ్రిడ్ మొక్క జాతులు సర్వసాధారణంగా కనిపిస్తాయి. వెన్నెముక జీవుల్లో ఇవి చాలా అసాధారణం. తాజాగా పక్షి విషయానికొస్తే తెల్ల తురాయి కలిగిన స్నో క్యాప్డ్ మానాకిన్.. నీలం తదితర రంగుల తురాయి కలిగిన ఒపల్ క్రౌన్డ్ మానాకిన్‌కు మధ్య సంయోగం జరగడం వల్ల ఈ గోల్డెన్ క్రౌన్డ్ మానాకిన్ పుట్టుకొచ్చిందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ పక్షి జన్యుపటంలో చాలా భాగాన్ని ఆవిష్కరించారు. ఇందులో దాదాపు 16వేల భిన్న రకాల జన్యు మార్కర్లు ఉన్నాయి. ఈ రెండు జాతుల మధ్య సంకరం 1.8 లక్షల ఏళ్ల కిందట జరిగిందని తేల్చారు.

పగడపు దిబ్బలకు భూతాపం దెబ్బ

భూతాపం పెరిగిపోతుండటంతో సముద్రాలోని పగడపు దిబ్బలకు ముప్పు పొంచి ఉన్నట్లు తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. సముద్ర జలాలు వేడెక్కిపోతుండటంతో వీటిని తయారుచేసే జీవులకు రక్షణగా నిలిచే కవాటాలు క్రమేపీ మూసుకుపోతున్నట్లు తెలిపింది. జలాలు ఒకస్థాయికి వేడెక్కినప్పుడల్లా ప్రకృతిపరంగా పగడపు దిబ్బలు తెల్లబారిపోయే ప్రక్రియ (కోరల్ బ్లీచింగ్) జరుగుతుంటుంది. ఉష్ణమండల ప్రాంతాల్లో– 1980లకు ముందు ఒక్కో 'బ్లీచింగ్'కు మధ్య 25-30 ఏళ్ల విరామం ఉండగా... 2010 తరువాత అది ఆరేళ్లకు తగ్గిపోయిందని ఆస్ట్రేలియాలోని పగడపు అధ్యయన సంస్థ డైరెక్టర్ టెర్రీ హ్యూజెస్ తెలిపారు. ఈ ప్రక్రియలు పెరిగేకొద్దీ పగడపు జీవులు చనిపోయి... దిబ్బలు (రీఫ్) నాశనమవుతాయని, అవి మళ్లీ తయారుకావడానికి ఒక దశాబ్ద కాలం పడుతుందని శాస్త్రవేత్త ఒకరు తెలిపారు. ఎల్‌నినోలు వేగంగా తయారవుతుండటంతో గత 50 ఏళ్లుగా వాతావరణం వేడెక్కుతోందని.. ఇవి పగడాలకు ప్రమాదకరంగా మారినట్లు అమెరికాకు చెందిన శాస్త్రవేత్త సీ మార్క్ ఎయాకిన్ తెలిపారు. ఇలా ఆస్ట్రేలియా (క్వీన్‌లాండ్)లోని గ్రేట్ బేరియర్ రీఫ్ 1998 నుంచి నాలుగుసార్లు బ్లీచింగ్‌కు గురైనట్లు తెలిపారు.

కక్ష్యలోని శకలాలతో 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'

అంతరిక్షంలో నిరుపయోగంగా పడి ఉన్న ఒక రాకెట్ దశను చైనా శాస్త్రవేత్తలు ఒక స్మార్ట్ అప్లికేషన్ ప్రోగ్రామ్‌గా మార్చారు. ఇందుకోసం అందులో మేధో చిప్‌లను అమర్చారు. గత ఏడాది నవంబర్ నెలలో చైనా లాంగ్‌మార్చ్ 4సీ రాకెట్ ద్వారా ఫెంగ్యున్ 3 డీ ఉపగ్రహాన్ని ప్రయోగించిం ది. ఈ రాకెలోని తుదిదశలో అనేక ఇంటెలిజెంట్ చిప్‌లను షాంఘైకు చెందిన వుడాన్ విశ్వవిద్యాలయం అమర్చింది. ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టాక.. సాధారణంగా ఆ రాకెట్ భాగం వ్యర్థంగా పడి ఉంటుంది. అంతరిక్షంలోని వ్యర్థాల్లో ఇటువంటి భాగాలదే సింహభాగం. వీటిలో తెలివైన చిప్‌ల ఏర్పాటు వల్ల చౌకలో సైన్స్ ప్రయోగాలకు, కమ్యూనికేషన్ల వేదికలుగాను ఉపయోగించుకోవడానికి వీలవుతుందని పరిశోధనలో పాలుపంచుకున్న జెంగ్ లిరాంగ్ తెలిపారు. వివిధ వస్తువులను నెట్‌తో సంధానించే 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'(ఐఓటీ)ను ఇప్పటికే రోజువారీ జీవితాల్లో ఉపయోగిస్తున్నారు. శరీరంపై ధరించే స్మార్ట్ పరికరాలు, డ్రైవర్ రహిత వాహనాలు, జీపీఎస్ పరిశీలనలో పశువులను మేపడం వంటివి ఉన్నాయి. అయితే ప్రస్తుత అప్లికేషన్లలో డేటా రద్దీ, మందగమనం వంటి సమస్యలు ఉన్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఇది మరీ ఎక్కువ. తాజా అంతరిక్ష ఆధారిత నెట్‌వర్క్‌ల వల్ల ఈ ప్రాంతాల్లో మెరుగ్గా ఐఓటీ సేవలందించవచ్చు.

కెప్లర్-90 చుట్టూ ఎనిమిదో గ్రహం



సూర్యుని పోలిన నక్షత్రం కెప్లర్-90 చుట్టూ పరిభ్రమిస్తున్న ఎనిమిదో గ్రహాన్ని కనిపెట్టినట్లు నాసా ఇటీవలే వెల్లడించింది. దీనికి కెప్లర్-90 ఐ అని పేరుపెట్టారు. భగభగ మండుతూ ఉన్న ఈ గ్రహం తన నక్షత్రం చుట్టూ ప్రతి 14.4 రోజులకు ఒక సారి పరిభ్రమిస్తోంది. గూగుల్ ద్వారా కృత్రిమ మేధస్సును ఉపయోగించి దీని వివరాలను సేకరించారు. మన సౌర వ్యవస్థకు అవల ఇతర గ్రహాల నుంచి వెలువడుతున్న బలహీన సంకేతాలను శక్తిమంతమైన టెలిస్కోపుల ద్వారా నమోదు చేసి, గ్రహాలను గుర్తించడంలో ఈ కంప్యూటర్లు దోహద పడుతుంటాయి. దాదాపు 35 వేల సంకేతాలను ఇవి గ్రహించాయి. కెప్లర్-90 భూమికి దాదా పు 2545 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. తమవద్ద ఉన్న సమాచారంతో సరిపోలేలా ఉత్తేజభరిత ఆవిష్కరణ సాధ్యమైందని నాసాలోని ఖగోళ భౌతికశాస్త్ర విభాగం డైరెక్టర్ పాల్ హెర్ట్జ్ తెలిపారు. కెప్లర్-90ఐ భూమి కంటే 30 శాతం పెద్దది. దీనిపై సగటు ఉష్ణోగ్రత 800 డిగ్రీల ఫారన్‌హీట్ (426. 66 డిగ్రీల సెల్సియస్) దాటి ఉంటుందని భావిస్తున్నారు. ఇది దాదాపుగా బుధుడిపై ఉన్నంత వేడితో సమా నం. ఈ వ్యవస్థ మొత్తం మన సౌర వ్యవస్థను పోలి ఉంటుంది. చిన్న గ్రహాలు లోపలివైను, పెద్దవి బయటి వైపు ఉన్నట్లు గుర్తించారు. దీని కంటే ఇతర గ్రహాల్లోనే జీవనానికి ఎక్కువ అవకాశం ఉంటుందని నాసా అంచనా.

బుడగలో పుట్టిన సౌరకుటుంబం


మన సౌరకుటుంబం పుట్టుక గుట్టును ఖగోళ శాస్త్రవేత్తలు విప్పారు. ఒక మృత నక్షత్రం చుట్టూ గాలివాటంతో ఏర్పడ్డ బుడగల్లో సౌరమండలం ఏర్పడినట్లు తేల్చారు. మానవులు.. విశ్వానికి సంబంధించి ఎన్నో అద్భుత ఆవిష్కరణలు చేసినప్పటికీ సౌర కుటుంబం పుట్టుకపై మాత్రం ఇంకా అనిశ్చితి నెలకొంది. వందల కోట్ల ఏళ్ల క్రితం ఒక తారా విస్ఫోటనాని (సూపర్‌నోవా)కి సమీపంలో ఇది ఏర్పడిందని ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న ఒక సిద్ధాంతం చెబుతోంది. తాజాగా అమెరికాలోని షికాగో విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు వినూత్న సూత్రీకరణ చేశారు. సూర్యుడికన్నా 40-50 రెట్లు పెద్దదిగా ఉండే వుల్ఫ్-రేయట్ తరహా నక్షత్రం వద్ద ఇది ఏర్పడినట్లు వారు పేర్కొన్నారు. ఇలాంటి తారలు తీవ్రస్థాయిలో ప్రజ్వలిస్తాయి. టన్నులకొద్దీ మూలకాలను వెదజల్లుతాయి. ఈ నక్షత్రం.. తన ద్రవ్యరాశిని కోల్పోయే క్రమంలో, దానిచుట్టూ ఉన్న పదార్థాన్ని తారా వాయువులు ముంచెత్తుతాయి. ఫలితంగా ఒక బుడగ ఆకృతి ఏర్పడుతుంది. నక్షత్రాల జననానికి ఇవి అత్యంత అనుకూలమైన ప్రదేశాలు. ఎందుకంటే బుడగ లోపల చిక్కుకుపోయిన ధూళి, వాయువులు సాంద్రీకరణ చెంది, నక్షత్రాలుగా రూపాంతరం చెందుతాయి. సూర్యుడులాంటి తారలు దాదాపు 16 శాతం మేర ఇలాంటిచోట్లే పుడుతుంటాయని చెబుతున్నాయి.

సూపర్‌నోవా సూత్రీకరణకు భిన్నంగా తాజా సిద్ధాంతాన్ని తీసుకురావడానికి కారణాలు ఉన్నాయి. పాలపుంత గెలాక్సీలోని మిగతా నక్షత్రాలతో పోలిస్తే సౌరకుటుంబంలో అల్యూమినియం-26 అధికంగాను, ఐరన్-60 చాలా తక్కువగాను ఉంటుంది.



నిజానికి రెండు ఇసోటోపులు సూపర్‌నోవాల్లో వెలువడతాయి. అయినా ఒక్కటి మాత్రమే సౌర కుటుంబంలో ఉండటంతో వుల్ఫ్-రేయట్ నక్షత్రాన్ని శాస్త్రవేత్తలు తెరపైకి తెచ్చారు. ఈ తారలు ఎక్కువ పరిమాణంలో అల్యూమినియం-26ను విడుదల చేస్తాయి. ఐరన్-60ని వెలువరించవు.

భూతాపంతో నాలుగో వంతు ప్రపంచానికి ముప్పు



లక్ష్యం మేరకు భూతాపాన్ని 2 డిగ్రీల సెల్సియస్ మేరకు పరిమితం చేసినప్పటికీ ప్రపంచ భూభాగంలో నాలుగో వంతు ఎండిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యవసాయం, నీటి నాణ్యత, జీవ వైవిధ్యాలపై దుష్ప్రభావాలతోపాటు.. కరవు, కార్చిచ్చులు తీవ్రమవుతాయని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు చైనాలోని సదరన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ.. యూకేలోని ఈస్ట్ ఆంగ్లియా విశ్వవిద్యాలయం పరిశోధకులు ప్రపంచవ్యాప్తంగా 27 వాతావరణ నమూనాలను పరిశీలించారు. మధ్యధరా, ఆఫ్రికా (దక్షిణ), ఆస్ట్రేలియా (తూర్పు తీర) ప్రాంతాల్లో కరవు తీవ్రత పెరిగిందని.. మెక్సికో, బ్రెజిల్‌లతోపాటు ఆస్ట్రేలియా, ఆఫ్రికా దక్షిణ ప్రాంతాలు కొంతకాలానికి ఎడారులయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే భూతాపం డిగ్రీ సెల్సియస్‌కు చేరుకుందని.. దీన్ని 1.5 డిగ్రీల వరకు పరిమితం చేయగలిగితే ముప్పున్న ప్రాంతంలో 2/3వ వంతు భూభాగాన్ని కాపాడుకోవచ్చునని శాస్త్రవేత్తల్లో ఒకరైన (భారత సంతతి) మనోజ్ జోషి తెలిపారు. దీంతో ఆగ్నేయాసియా, ఐరోపా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా దక్షిణ ప్రాంతాలు.. మధ్య అమెరికాలకు మేలు జరుగుతుందని వివరించారు.

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
141.27 ▲	37.05 ▲	-50 ▼	29,110	-300 ▼	41,200	
33,844.86	10,397.45	29,100 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	ప్రొద్దుటూరు 29,110 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	39,400 (కిలో (రూపాయల్లో))	ప్రొద్దుటూరు 41,695 (కిలో (రూపాయల్లో))	65.25

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టీసీఎస్	3,043.05	3.33
ఐటీసీ	268.05	2.00
ఓఎన్‌జీసీ	190.10	1.66
ఎస్‌బీఐ	274.00	1.28
ఇన్ఫోసిస్	1,151.65	1.23

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
సన్‌ఫార్మా	524.75	-6.19
ఇండస్ ఇండ్ బ్యాంక్	1,595.30	-2.01
బీహెచ్‌ఇఎల్	91.65	-1.61
టాటాస్టీల్	655.40	-1.57
బజాజ్ ఆటో	3,075.60	-1.36

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	64.79	64.76
యూరో	79.99	79.68
పౌండ్	90.71	90.17
ఆస్ట్రేలియా డాలర్	51.07	50.76
సింగపూర్ డాలర్	49.13	49.00

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,110	31,133
చెన్నై	29,110	31,133
బెంగళూరు	28,700	30,695
ముంబై	30,100	32,192
విజయవాడ	29,100	31,500
విశాఖపట్నం	29,110	31,756
ప్రొద్దుటూరు	29,110	30,570

ముడి చమురు		65.25



స్వల్పంగా తగ్గిన

పసిడి, వెండి ధరలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, స్థానిక ఆభరణాల తయారీదారుల నుండి బంగారానికి డిమాండ్ మందగించడంతో వరుసగా రెండో రోజు బంగారం ధర తగ్గింది. మంగళవారం రూ.100 తగ్గిన పసిడి బుధవారం రూ.250 తగ్గడంతో పది గ్రాముల బంగారం ధర రూ.31,450కి చేరింది. డాలరు విలువ పెరగడంతో పాటు అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా పసిడి ధర భారీగా తగ్గిందని బులియన్ ట్రేడింగ్ వర్గాలు వెల్లడించాయి. ఇక పసిడి బాటలోనే వెండి పయనించింది. రూ.140 తగ్గడంతో కేజీ వెండి రూ.39,300గా ఉంది. పారిశ్రామిక వర్గాలు.. నాణెల తయారీదారుల నుంచి ఆశించిన మేర డిమాండ్ లేకపోవడంతో వెండి ధర కూడా పతనమైనట్లు ట్రేడర్లు చెబుతున్నారు. ఇక అంతర్జాతీయంగాను బంగారం ధర 0.21శాతం తగ్గి ఔన్సు 1,326 డాలర్లు పలికింది. వెండి 0.18శాతం తగ్గడంతో ఔన్సు 16.39డాలర్లు పలికింది.

వరుస నష్టాలకు బ్రేక్

- 141పాయింట్ల లాభంతో సెన్సెక్స్
- ఐటీ కంపెనీల జోరు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో గట్టెక్కాయి. ఐటీ కంపెనీల జోరు గత మూడురోజుల నష్టాలకు బ్రేక్ ఇచ్చాయి. సెన్సెక్స్ 141 పాయింట్ల లాభంతో నిఫ్టీ 10,400 దిగువన లాభాల్లో నమోదైంది. పీఎన్‌బీ కుంభకోణం అనంతరం మార్కెట్లు ఐదురోజులు నష్టాల్లో ముగిసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 141.27 పాయింట్లతో 33,844.86 పాయింట్ల వద్ద నిఫ్టీ 37.05 పాయింట్లతో 0.36శాతంతో 10,397.45 వద్ద ముడిసింది. టీసీఎస్, ఐటీసీ, ఎస్‌బీఐ, హెచ్‌డిఎఫ్‌సి, ఓఎన్‌జీసీ, యస్‌బ్యాంకు, ఇన్ఫోసిస్ లాభాలు నమోదు చేసాయి. సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంకు, టాటా మోటార్స్, టాటా స్టీలు, బజాజ్ ఆటో, ఎన్‌టీపీసీ, హెచ్‌డి ఎఫ్‌సీ బ్యాంకులు నష్టాల్లో నమోదయ్యాయి. డాక్టర్ రెడ్డీస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ సెన్సెక్స్ ప్రధాన లబ్దిదారులుగా నమోదయ్యాయి. బిఎస్ఇ బ్యాంకెక్స్ సుమారు 100 పాయింట్ల లాభాన్ని నమోదుచేసింది. 20:9,050 పాయిం ట్లతో ర్యాలీ నమోదుచేసింది. 1,067స్టాక్స్ లాభాల్లో నమోదు కాగా 585 స్టాక్స్ నష్టాల్లో నమోదయ్యాయి. 78 స్టాక్స్‌లో ఎటువంటి మార్పులేదు. గీతాంజలి జమ్స్‌అండ్ జ్యువెల్లర్స్ షేర్లు, పీఎన్‌బీ కుంభకోణంతో కలిసి వరుసగా ఐదవరోజు నష్టాల్లో ముగిసాయి. సుమారు 56శాతం నష్టాలను నమోదు చేసింది. ఉదయం ట్రేడింగ్‌లో గీతాంజలి షేర్లు 10శాతం నష్టంతో రూ.27.45 వద్ద నమోదయ్యాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరింత బలహీనపడింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకం విలువ తాజాగా మరో మూడు నెలల కనిష్టంలో 64.94గా నమోదైంది. రూపాయి బలహీనపడుతుండ టంతో, ఐటీ కంపెనీల షేర్లకు బూస్ట్ వచ్చిందని, ఓవర్ సీస్ మార్కెట్లలో ఐటీ కంపెనీలకు రెవెన్యూలు పెరుగుతున్నాయని విశ్లేషకులు చెప్పారు. నిఫ్టీ 50 స్టాక్స్‌లో టెక్ మహీంద్రా, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ 3 శాతం పైగా లాభపడ్డాయి. వీటితో పాటు ఐటీసీ, ఓఎన్‌జీసీలు కూడా టాప్ గెయినర్లుగా ఉన్నాయి. మెటల్, ఫార్మా, క్యాపిటల్ గూడ్స్ స్టాక్స్ లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది.

అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియాలో జపనీస్‌షేర్లు బుధవారం అత్యధికంగా నమోద య్యాయి. యన్‌తో పోల్చుకుంటే డాలర్ బలపడటంతో జపాన్ ముఖ్యంగా ఎగుమతులవైపు దృష్టి సారిస్తోందని చెప్పవచ్చు. ఆస్ట్రేలియన్‌స్టాక్స్ 0.1 శాతంతో సౌత్ కొరియా కాస్పి 0.3శాతం లబ్దిపొందింది.

అగమ్యగోచరంగా

5000 మంది ఉద్యోగులు



న్యూఢిల్లీ:రుణభారంతో మూతపడే దిశగా వెళ్లిన ఎయిర్‌సెల్ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 5000 మందికిపైగా ఉద్యోగులకు ఈ కంపెనీ వార్నింగ్ ఇచ్చింది. తీవ్ర పోటీ కర వాతావరణంలో నిధులు సమ కూర డం క్లిష్టతరంగా మారిందని, ఈ క్రమం లో ఉద్యోగులు ప్రమాదకర పరిస్థితుల్లో పడబోతున్నట్టు కంపెనీ హెచ్చరించింది. కొన్ని రోజుల నుంచి నిధులు సమకూ రడం లేదని, ప్రస్తుతం వ్యాపార కార్యక లాపాల నుంచే నిధులు రాబడుతు న్నామని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కైజాద్ హేర్జీ చెప్పారు. మాతృ సంస్థ మ్యాక్సిస్‌కు చెందిన ఈ కంపెనీకి ప్రస్తుతం మార్కెట్ లో నెలకొన్న పోటీకర వాతావరణం తీవ్రంగా దెబ్బ కొడుతోందని, రెవెన్యూలు, లాభాలు అన్నీ కొట్టుకు పోతున్నాయన్నారు. వచ్చే రోజుల్లో మరింత క్లిష్టతరమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాబోతున్న క్లిష్టకర పరిస్థితుల్లో కంపెనీ పరిస్థితిని రివ్యూ చేయడానికి బోర్డురీ గ్రూప్ అవబోతుంది. పలువురు డైరెక్టర్లు కంపెనీ నుంచి వైదొలగడంతో, వారి స్థానంలో కంపెనీ బోర్డు సందీప్ వాట్స్, ప్రకాశ్ మిశ్రా, లక్ష్మి సుబ్రహ్మణ్యంను నియమించింది. వాటాదారులతో కూడా బోర్డు చర్చలు జరుపుతోంది. సుమారు రూ.15,500 కోట్ల రుణాలు పేరుకుపోవడంతో కంపెనీ త్వరలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు దివాలా పిటిషన్ దాఖలు చేయనున్నట్టు కూడా రిపోర్టులు వస్తున్నాయి. తమ ఆర్థిక పరిస్థితితో లక్ష కొద్దీ కస్టమర్లు ప్రభావిత మవుతారని హేర్జీ పేర్కొన్నారు. కంపెనీకి ప్రస్తుతం 85 మిలియన్ మంది కస్టమర్లున్నారు. ఆరు సర్కిళ్లలో సర్వీసులను కంపెనీ ఇటీవలే ఆపివేసింది. కాగ టెలి కం రంగంలో సంచలనం సృష్టిస్తూ.. 20 16 సెప్టెంబర్‌లో చౌక చార్జీలతో రిలయన్స్ జియో ఎంట్రీ ఇచ్చాక.. మూత పడుతున్న కంపెనీల్లో ఎయిర్‌సెల్ నాలుగోది కానుంది. జియో రాకతో టెలికం పరిశ్రమ ఆదాయాలు సగానికి పడిపోగా.. టారిఫ్‌లు సైతం గణనీయంగా క్షీణించాయి.

గెలాక్సీ జే2, జే2 ప్రొ ధరలు తగ్గాయ్!



న్యూఢిల్లీ:శాంసంగ్ తన గెలాక్సీ ధరలను తగ్గించింది. గెలాక్సీ జే2 ప్రొ, గెలాక్సీ జే2(2017) స్మార్ట్ ఫోన్లపై భారత్‌లో ధరలు తగ్గిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. తగ్గింపు అనంతరం గెలాక్సీ జే2 ప్రొ 7,690 రూపాయలకు, గెలాక్సీ జే2(2017) 6,590 రూపాయలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ కొత్త ధరలు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రిటైలర్స్‌లో అన్నింటిలో బుధవారం నుంచి అందుబాటులో ఉంటాయని కంపెనీ చెప్పింది. కొత్త గెలాక్సీ జే2 ప్రొ ఇప్పటి వరకు ఈ-కామర్స్ సైట్లు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, శాంసంగ్ ఆన్‌లైన్ స్టోర్‌లలో లిస్ట్ కాలేదు. గెలాక్సీ జే2 (2017) మాత్రం అమెజాన్‌లో అందుబాటులో ఉంది.

గెలాక్సీ జే2 ప్రొ 2016 జూలైలో రూ.9,890కు లాంచ్ కాగ, గెలాక్సీ జే2((2017) గత అక్టో బర్‌లో రూ.7,390కు దేశీయ మార్కె ట్‌లోకి వచ్చింది. దేశీయ సరమైన స్మార్ట్ ఫోన్ మార్కెట్ సెగ్మెంట్‌లో మార్కెట్ షేరును పొందడానికి శాంసంగ్‌కు ఈ కొత్త ధరలు సహకరిస్తాయని కంపెనీ చెప్పింది. చైనీస్ కంపెనీ స్మార్ట్‌ఫోన్లు షావోమి రెడ్‌మి వై1 లైట్, రెడ్‌మి 5ఏ స్మార్ట్‌ఫోన్ల నుంచి గెలాక్సీ జే2 ప్రొ, గెలాక్సీ జే2(2017)లకు గట్టి పోటీ వస్తోంది.

శాంసంగ్ గెలాక్సీ జే2ప్రొ స్పెషిఫికేషన్లు
ఆండ్రాయిడ్ 6.0 మార్ష్‌మాలో
5అంగుళాల హెచ్‌డీ సూపర్ అమోలెడ్ డిస్‌ప్లే
1.5 గిగాహెడ్జ్ క్వాడ్-కోర్ ప్రాసెసర్
2జీబీ ర్యామ్
8 ఎంపీ రియర్ కెమెరా
5 ఎంపీ ఫ్రంట్ కెమెరా
16జీబీ ఆన్‌బోర్డ్ స్టోరేజ్
128జీబీ వరకు విస్తరణ మెమరీ
2600 ఎంఏహెచ్ బ్యాటరీ.

జంట కవలల ముచ్చట

- ఒకేచోట 78 మంది కవల పిల్లలు
- ప్రాణాలు వేరైనా పోలికొక్కటే...



విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : కవల పిల్లలను చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది. అందులోనూ ఒకే పోలికతో ఉండే కవలలను చూస్తే అదో గొప్ప అనుభూతి. వారి ప్రాణాలు వేరైనా.. పోలికొక్కటే.. తిరుపతిలో 78 మంది కవల పిల్లలు ఒక్కచోటచేరి సందడి చేశారు. అంతర్జాతీయ కవలల దినోత్సవం సందర్భంగా 'ప్రాణాలు వేరైనా.. పోలికొక్కటే' అన్న నినాదంతో తిరుపతి స్ప్రింగ్‌డేల్ స్కూల్లో మంగళవారం వీరు సందడి చేశారు. జంటగా జన్మించిన వారి కోసం ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించారు.. ఫిబ్రవరి 22 అంతర్జాతీయ కవలల దినోత్సవం.. ఈ సందర్భంగా స్ప్రింగ్‌డేల్ స్కూల్లో కవల పిల్లల సమావేశం ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహించారు. స్థానిక కరుకంబాడి రోడ్డులోని స్ప్రింగ్‌డేల్ స్కూల్లో ప్రతి ఏటా ఈ కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. పాఠశాలలో చదువుతున్న కవలలు ఒకేరకమైన దుస్తులు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. వీరితో విద్యార్థులు, ఉపాధ్యాయులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. పాఠశాల అధినేత వాసు మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు, కవలల దినోత్సవంపై కూడా అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. ఆ ఏడుగురు.. ఎవరు ఎక్కడుంటారో.. ఎవరికీ తెలియదు. కానీ అందులో ఒకే రూపం.. కలిగిన ఇద్దరు పిల్లలు.. ఒకే ఇంట్లో ఉంటే.. అది గొప్ప అనుభూతే.. వీరిని కన్న తల్లిదండ్రుల ఫీలింగ్స్ ఎలా ఉంటాయో తెలుసుకోవాలని ప్రతి ఒక్కరు ఆసక్తి చూపుతారు. కవలు రెండు రకాలుగా ఉంటారు. ఒకే పోలికతో ఉంటే వీరిని సమరూప, సహజాత కవలలు అని పిలుస్తారు. తిరుపతి నగరంలో ఒకే రూపంతో ఉన్న కవలలు చూపరులను ఆకట్టుకున్నారు. ఇంత మంది కవల పిల్లలను ఒకే చోటచూసిన వారంతా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈ ఘనత స్ప్రింగ్‌డేల్ స్కూల్ కే దక్కింది. పాఠశాలలో సాంస్క ృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి కవలలకు బహుమతులు అందించారు. ఒకే క్లాసులో ఇద్దరు ఉంటే స్నేహితులకైతే రోజూ ఫజిలే.. వీరిని పొరబడకుండా గుర్తించడం మాటల్లో చెప్పలేమంటున్నారు విద్యార్థులు.

స్వాతంత్ర్య సమరయోధుడు

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 171వ వర్ధంతి నేడు




ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం, నరసింహారెడ్డి కత్తిని చూపుతున్న విశాలాంధ్ర జనరల్ మేనేజర్ హరినాథ రెడ్డి

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ (కర్నూలు) : భారతదేశాన్ని బ్రిటీష్ బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేసేందుకు దేశంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను తృణప్రాయంగా భారతమాతకు అర్పించుకున్నారు. అహింసా పద్ధతుల ద్వారా కొందరు, విప్లవం తిరుగుబాటు ద్వారా మరి కొందరు పోరాటాలు చేశారు. వీటిలో రెండో కోవకు చెందిన వారే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. భారతదేశ చరిత్ర ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్ ప్రాంతంలో 1857 మే నెలలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. దీనిని మొదటి స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణిస్తారు. ఈ సంఘటనకు పదేళ్ల ముందుగానే 1847లో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూక ఉయ్యలవాడలో నరసింహారెడ్డి బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఈయన తండ్రి పెద్దిరెడ్డి, తాత జయరామ్‌రెడ్డి, ఇంటిపేరు మజ్జారి వారు. తాత జయరామ్‌రెడ్డికి కుమారులు లేకపోవడంతో మనుమడైన నరసింహారెడ్డిని నొస్సం కోటకు వారసుడిగా నియమించారు. తనకు రావాల్సిన భరణంకోసం నరసింహారెడ్డి తన సేవకుడిని కోవెలకుంట్ల ట్రెజరీకి పంపాడు. బ్రిటీష్‌వారి అండతో విర్రవీగుతున్న ట్రెజరీ అధికారి రాఘవాచారి భరణం ఇవ్వకపోవడమే కాకుండా సేవకుడిని నానా దుర్భాషలాడాడు. ఈ విషయం తెలుసుకొన్న నరసింహారెడ్డి 1846 జులై 10న 500 మంది బోయ సైన్యంతో కోవెలకుంట్ల ట్రెజరీని ముట్టడించాడు. తహసిల్దార్ రాఘవాచారిని శిక్షించి ట్రెజరీని కొల్లగొట్టాడు. అప్పటి కడప జిల్లా కలెక్టర్ కాక్రేన్ బ్రిటిష్ ప్రభుత్వానికి నరసింహారెడ్డి తీరు గురించి తెలియపరిచారు. 1847 జులై 23న వార్సన్ అనే సైన్యాధికారి 2వేల మంది సైన్యంతో నొస్సం కోటపై దాడిచేయడంతో పిరంగుదెబ్బలకు కోట నేలకూలింది. ఈ విషయాన్ని పసిగట్టిన నరసింహారెడ్డి అక్కడినుండి తప్పించుకొని ప్రకాశం జిల్లా గిద్దలూరు, కొత్తకోట ప్రాంతాల్లో నివాసం ఏర్పరచుకొన్నాడు. అదే సమయంలో అక్కడి ఫారెస్టు రేంజరైన పీటర్ అనే అవినీతి అధికారిని హతమార్చాడు. ఈ విషయం తెలుసుకొన్న ప్రభుత్వం నరసింహారెడ్డిని ప్రాణాలతోగాని, మృతదేహంగా గాని అప్పగించినవారికి వెయ్యి దీనారులు బహుమతిని ప్రకటించింది. ఈ ప్రకటనను నరసింహారెడ్డి పినతండ్రి కుమారుడు డబ్బుకు ఆశపడి బ్రిటిష్‌వారితో చేతులు కలిపి నరసింహారెడ్డిని పట్టించే ప్రయత్నం చేశాడే కానీ సాధ్యం కాలేదు. తద్వారా బ్రిటిష్ ప్రభుత్వం నరసింహారెడ్డి భార్య పిల్లలను బంధించి కడపకు తరలించారు. నరసింహారెడ్డి అర్ధరాత్రి సమయంలో బ్రిటిష్‌వారిపై మెరుపుదాడి చేసి తన భార్య, పిల్లలను విడిపించుకొన్నాడు. నరసింహారెడ్డి ఆగడాలు బ్రిటిష్‌వారికి తలనొప్పిగా మారాయి. చివరకు సంజామల మండలం గిద్దలూరు సమీపంలోని జగన్నాథగట్టువద్ద నరసింహారెడ్డిని, 200 మంది అతని అనుచరులను బ్రిటిష్‌వారు బంధించారు. వీరి ఆగడాలగురించి ప్రభుత్వం కడప జిల్లా కలెక్టర్‌ను విచారించి నరసింహారెడ్డికి ఉరి శిక్ష విధించారు. కోవెలకుంట్ల సమీపలోని జుర్రేరు వాగు ఒడ్డున 1847 ఫిబ్రవరి 22న ఉదయం 7 గంటలకు 2వేల మంది ప్రజలు చూస్తుండగా నిర్దాక్షిణ్యంగా ఉరితీశారు. 1877 వరకు నరసింహారెడ్డి తలను ఉరికంబానికి అలాగే ఉంచారు. చుట్టు ప్రక్కలవారు ఎవరు కూడా బ్రిటిష్‌వారిని ఎదురించే సాహసం చేయకూడదని వారి మూఢ విశ్వాసం. రాయలసీమ ముద్దుబిడ్డ ఉయ్యలవాడ నరసింహారెడ్డి చరిత్రను వింటే ఎవరైనా ముగ్దులవ్వాల్సిందే. ఈ వీరుడు ఉపయోగించిన ఖడ్గాన్ని రూపణగుడి గ్రామంలోని ఆయన వారసుల ఇంటిలో ఎంతో మంది ప్రముఖులు దర్శించడం విశేషం. దేశ చరిత్రలో కన్నెగంటి హనుమంతు, అల్లూరి సీతారామరాజులకు వచ్చిన పేరు ప్రఖ్యాతులు నరసింహారెడ్డికి లభించకపోవడం విచారకరం. నరసింహారెడ్డి విగ్రహాన్ని కోవెలకుంట్లలో ప్రతిష్టించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

విజ్ఞానం

30లక్షల ఏళ్ల క్రితమే మానవ మెదడు వృద్ధి...!



మానవ పూర్వీకుల మెదడు పరిణామం దాదాపు 3 మిలియన్ సంవత్సరాల క్రితమే అభివృద్ధి చెందినట్లు తెలుస్తోంది. ఆధునిక మానవుని మెదడు చింపాంజీల మెదడుకన్నా మూడురెట్లు పెద్దదిగా ఉన్నట్లు రూఢి అయింది. శాస్త్రజ్ఞులు అంగీకరించకపోయినప్పటికీ 94 హోమినిన్ ఫాజిల్స్ ద్వారా లభించిన సమాచారం ప్రకారం సరాసరిన మానవ మెదడు గత మూడుసంవత్సరాల క్రితమే వృద్ధి చెందినట్లు నిరూపణైంది. మానవుని మెదడు చింపాజీల మెదడును పోలిఉందనీ తదనంతరం అభివృద్ధి చెందిందనీ కానీ ఈ పరిణామ క్రమ అభివృద్ధి ఎలా జరిగిందనేదానిపై శాస్త్రజ్ఞులు పరిశోధన చేస్తున్నారు. మనిషి మెదడు పరిణామం వివిధ సంస్కృతుల, భాష, సాధనతో విశిష్టమైనదిగా పరిణమించిందని చికాగోయూనివర్సిటీ వెల్లడించింది. బ్రెయిన్ సైజ్‌కు, బిహేవియర్‌కు ఎటువంటి సంబంధంలేదని తెలుస్తోంది.

15 నూతన జన్యువుల గుర్తింపు

మన ముఖ కవళికలను నిర్ణయించే 15నూతన జన్యువులను గుర్తించడం జరిగింది. బెల్జియంకు చెందిన శాస్త్రజ్ఞులు, యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్, స్టాన్‌ఫోర్డ్,పెన్‌స్టేట్ శాస్త్రజ్ఞులు చేపట్టిన అధ్యయనంలో ఈ విషయాన్ని రాబట్టారు. మన ముఖంతీరుతెన్నులను మన డిఎన్‌ఏ నిర్ణయిస్తుంది. ఫోరెన్సిక్ ఎగ్జామినర్లు డిఎన్‌ఏ ఆధారంగా స్కెచ్ వేసి ముఖాన్ని రూపొందించడం తెలిసిందే..చరిత్రకారులు దీర్ఘకాలం అనంతరం కూడా డిఎన్‌ఏ ఆధారంగానే ముఖ ఆకృతిని పునర్నిర్మిస్తారు. డీఎన్‌ఏ ఏ జన్యువులు మన ముఖానికి కారణమవుతాయనే దానిపై పరిశోధన చేస్తున్నారు. ప్రధానంగా కళ్లకు, నోటికి మధ్యన ఉన్న వెడల్పు పొడవునుబట్టి ఆకృతి ఏర్పడుతుంది. తాజా అధ్యయనంలో భాగంగా పిట్స్‌బర్గ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీల అధ్యయనంలో వివిధ అంశాలపై పరిశోధన కొనసాగుతోంది. మనుషుల ముఖానికి సంబంధించిన డిఎన్‌ఏలను 3డి ఇమేజ్‌లో ఇమిడ్చి డేటాబేస్ ఆధారంగా పరిశోధన చేస్తున్నారు. ప్రతి ముఖాన్ని మళ్లీ సబ్ డివైడ్ చేసి డిఎన్‌ఏ మ్యాచ్ అయ్యే ప్రాంతాలను గుర్తించడం జరిగింది. ఈ విధమైన సాంకేతికతతో మొదటిసారి ఫేషియల్ ఫీచర్స్‌ను గుర్తించారు. ఈ విధంగా శాస్త్రజ్ఞులు డిఎన్‌ఏలో 15 ప్రదేశాలను గుర్తించారు. గర్భంలో ఉన్నప్పుడే ముఖ కవళికలు ఏర్పడేందుకు జీనోమిక్ లాక్ అనుసంధానితమవుతుందని స్టాన్‌ఫోర్డ్ శాస్త్రజ్ఞులు తెలిపారు.

మార్కెట్లోకి డ్యుయోపిక్స్ ఎఫ్9 మొబైల్స్



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జియోక్స్ తన డ్యుయోపిక్స్ సిరీస్‌కు డ్యుయోపిక్స్ ఎఫ్9ను జోడించడం ద్వారా తన ఉత్పాదన శ్రేణిని విస్తరించినట్లు జియోక్స్ మొబైల్ సిఇఒ దీపక్ కాబు తెలిపారు. డ్యుయల్ సెల్ఫీ విభాగంలో నూతన విప్లవంగా, డ్యుయోపిక్స్ ఎఫ్9తో బడ్జెట్ ధరలో అధునాతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చామన్నారు. మెరుగైన రీతిలో ఫ్లాష్‌తో పాటు డ్యుయల్ సెల్ఫీ కెమెరా (8 ఎంపి ఎఎఫ్+2 ఎంపి ఆటో ఫోకస్)ను ఈ ఫోన్ కలిగివుంది. 5 అంగుళాల హెచ్‌డి డిసిఎస్ డిస్‌ప్లే, 2.5డి కర్వ్‌డ్ డిస్‌ప్లే, 1 జిబి ర్యామ్, 16 జిబి రామ్‌లతో 1.3 గిగా హెర్ట్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్, 2500 ఎంఎహెచ్ బ్యాటరీని కలిగి ఉంది. ఆండ్రాయిడ్ 7.0 నౌగట్‌తో అప్లికేషన్, ఫీచర్స్‌ను, 4జి వోల్టె, వైఫైతో కూడిన డైనమిక్ కనెక్టివిటీతో వాయిస్, వీడియో కాల్స్‌ను చేసుకోవచ్చు. 21 భాషల సపోర్ట్, ఎఫ్ఎం రేడియో, ఎంపి3 ప్లేయర్స్, ప్రాక్సిమిటీ, లైట్, గ్రావిటీ లాంటి సెన్సర్స్ సోపర్ట్‌నపు ఈ స్మార్ట్ ఫోన్ కలిగివుందని వివరించారు.


అత్యంత విశ్వసనీయ బ్రాండ్‌గా కోల్గేట్...!

విజయవాడ : దంత ఆరోగ్య సంరక్షణలో కోల్గేట్ - పామోలివ్ దేశంలోనే అత్యంత విశ్వసనీయ బ్రాండుల్లో అగ్రస్థానంలో నిలిచింది. సర్వే సంస్థ నీల్సన్ నిర్వహించిన వినియోగదారుల సమీక్ష -2017లో అన్ని విభాగాల్లోనూ కోల్గేట్ నెంబర్‌వన్‌గా నిలిచింది. ఈ అగ్రస్థానాన్ని వరుసగా ఏడోసారి కోల్గేట్ నిలబెట్టుకుంది. బెంగళూరు, చెన్నై, న్యూఢిల్లీ ఎన్సీఆర్, ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, భువనేశ్వర్, చండీగఢ్, ఇండోర్, లక్నో, పాట్న, విజయవాడల్లో సుమారు 6059 మంది వినియోగదారులతో నీల్సన్ సమీక్ష జరిపింది. నీల్సన్ రూపొందించిన విశ్వసీయ బ్రాండ్‌ల పట్టీలో కోల్గేట్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కోల్గేట్ - పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇసామ్ బచలాని మాట్లాడుతూ, కోల్గేట్‌పై నమ్మకాన్ని ప్రదర్శించిన తమ వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. చిరునవ్వుల భారత దేశం ఆవిష్కరణకు ఈ నమ్మకమే తమకు సహకరిస్తోందన్నారు. 80 ఏళ్లుగా దేశంలో ప్రతి ఒక్కరిలో చిరు నవ్వులు రువ్వేలా దంత ఆరోగ్య సంరక్షణకు కోల్గేట్ జాగృతిని కొనసాగిస్తోందన్నారు.

పెరుగుతున్న మహిళా పారిశ్రామికవేత్తలు: నీతిఆయోగ్

న్యూఢిల్లీ: ప్రైవేటు, పబ్లిక్‌రంగాల్లో మహిళా పారిశ్రామిక వేత్తలు శరవేగంతో దూసుకువెళుతున్నారని నీతిఆయోగ్ సభ్యుడు అన్నారాయ్ వెల్లడించారు. అవగాహన కల్పించడం, దూరదృష్టితో భాగస్వామ్యాన్ని అనుసంధానించడం, ఏకీకృత మార్గాలతో మరింత ముందుకు వెళ్లవలసిందిగా పేర్కొన్నారు. మహిళా ఔత్సాహిక సంస్థలను మరింత వేగంగా అభివృద్ధి చెందవలసిందిగా సూచించారు. విభిన్నమైన స్టేక్ హోల్డర్లను మహిళా పారిశ్రామికవేత్తలతో అనుసంధానించేందుకుగాను ఉమెన్స్ సెల్ ప్రారంభించినట్లు తెలిపింది. గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో భాగంగాఅమెరికా పర్యటిస్తున్న మహిళా పారిశ్రామిక వేత్తల సమావేశంలో రాయ్ తెలిపారు. భారతదేశ ఆర్థికాభివృద్ధిలో ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మరింత దృష్టి సారించాలనీ సూచించారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా మహిళలు ప్రధాన భాగస్వాములు కావాలన్నారు. భారత్‌లో ప్రస్తుతం వ్యవస్థీకృత, నిర్మాణాత్మక మార్పులు ఉన్నతస్థాయిలో చోటుచేసుకున్నాయని ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసి ఉందని అభిప్రాయపడ్డారు. మహిళలను ప్రోత్సహించేందుకు భారత్ నిర్మానాత్మక చర్యలుచేపడుతోందన్నారు. దీన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవలసిన బాధ్యతను గుర్తుచేసారు.

దిగజారిన రూపాయి విలువ



ముంబై: వరుసగా నాలుగవ సెషన్‌లో కూడా రూపాయి నష్టాలు నమోదు చేసింది. 8పైసల నష్టంతో డాలర్ మారకంతో రూపాయి 3 నెలల కనిష్టానికి దిగజారి 64.87 వద్ద నిలిచింది.దిగుమతుల నేపథ్యంలో అంతర్జాతీయంగా డాలర్ డిమాండ్ పెరిగినట్లు తెలుస్తోంది. మంగళవారం రూపాయి 58పైసల నష్టంతో 64.79 అత్యల్పంగా నమోదైంది. విదేశీ మదుపరులు సుమారు రూ.850.35 కోట్లు షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది.

బీడు భూముల్లో సిరుల పంట



వ్యవసాయాన్నే నమ్ముకున్న నలుగురు ఇంజినీర్ల విజయగాథ

వ్యవసాయంలోకి దిగి తెలిసో తెలియకో ఒక్కసారి పెట్టుబడి పెడితే లాభం రాకున్నా సరే నష్టపోకుండా ఉంటే అదే పదివేలు అనుకునే రోజులివి. కానీ నలుగురు ఇంజనీర్లు వ్యవసాయాన్నే నమ్ముకున్నారు. కాసుల్ని పండిస్తున్నారు. చెట్లకు డబ్బులు కాస్తాయన్న మాటల్ని నిజం చేస్తున్నారు. ఓ వైపు పర్యావరణానికి మేలు చేస్తూ, మరోవైపు తమ ప్రాజెక్ట్‌ను లాభాల బాటలో నడిపిస్తున్నారు. ఇంతకీ ఆ ప్రాజెక్ట్ ఏమిటి? ఎవరా ఇంజనీర్లు?

హోసచిగురు... నలుగురు ఇంజనీర్ల మెదడులో మొలకెత్తిన గ్రీన్ ప్రాజెక్ట్ ఇది. పనికిరాకుండా పడి ఉన్న బీడు భూములను పచ్చగా కళకళలాడేలా చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతోంది ఈ ప్రాజెక్ట్. డబ్బులేమైనా చెట్లకు కాస్తాయా అని ప్రశ్నించే వారికి ..చెట్లను నమ్ముకుంటే కాసులు కురిపిస్తాయని రుజువు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి నాలుగు ముక్కల్లో చెప్పాలంటే... సాగుకు ఉపయోగపడే స్థలాన్ని కొనడం, రియల్ ఎస్టేట్ వెంచర్‌గా అభివృద్ధి చేయడం, కస్టమర్లకు అమ్మేయ్యడం, తర్వాత అదే స్థలంలో శాస్త్రీయ పద్ధతుల్లో పంటలు పండించడం, చివర్లో లాభాలు పంచుకోవడం... ఇదీ ప్రాజెక్ట్ పని చేసేతీరు. సరిగ్గా ఇలాగే రెండేళ్ల కిందట అనంత పురం జిల్లా గోరంట్లలో 31 ఎకరాల భూమిని తీసుకున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ వేసి, కస్టమర్లను భాగస్వాములుగా చేసి, బొప్పాయి దానిమ్మ పంటల్ని పండిస్తున్నారు. స్థానిక రైతులకు ఉపాధి కల్పిస్తున్నారు.

నలుగురు ఇంజనీర్లు... నలుగురిదీ వేర్వేరు నేపథ్యం. కొన్నేళ్ల క్రితం వారి మదిలో ఈ ప్రాజెక్ట్ మొలకెత్తింది. హోస చిగురు అని నామకరణం చేశారు. పట్టణప్రాంతంలో పెద్దపెద్ద ఉద్యోగాలు చేసేవారి దగ్గరికెళ్లి తమ ఐడియాను వివరించారు. కార్పొరేట్ కంపెనీల మేనేజర్లు, డాక్టర్లు, లాయర్లు, వ్యాపార వేత్తలు... ఇలా అందరిదగ్గరికెళ్లి తమ ప్రాజెక్ట్ గురించి వివరించారు. చాలా మందికి ఈ ఐడియా నచ్చింది. సాగుకు కావాల్సిన భూమిని కొనడం, అభివృద్ధి చెయ్యడం, చెట్లను పెంచడమంతా హోసచిగురు టీమ్ చూసుకుంటుంది. కేవలం కస్టమర్లు పెట్టుబడి పెడితే చాలు. మంచి లాభాలొస్తాయి. ఈ ఫార్ములా వర్కవుట్ కావడంతో చాలా మంది స్థలాల్ని కొన్నారు. హోస చిగురు ప్రాజెక్ట్‌కు లీజుకిచ్చారు. ఆ స్థలాల్లో బొప్పాయి, దానిమ్మ లాంటి చెట్లతో పాటు చందనం చెట్లను పెంచడం ద్వారా బోలెడన్ని లాభాలు వచ్చాయి. వచ్చిన లాభాల్ని అంతా కలిసి పంచుకున్నారు. "చెట్లను పెంచడం ద్వారా ప్రతీ కస్టమర్‌కు ఏటా లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. దానికి తోడు స్థలం విలువ పెరుగుతుంది. దీంతో పాటు పర్యావరణానికి మేలు చేస్తున్నామన్న సంతృప్తి మిగులుతుంది. కస్టమర్లకు కూడా వ్యవసాయంపై అవగాహన పెరుగుతుంది." ఇదీ హోసచిగురు హెడ్ శ్రీనాథ్ శెట్టి చెప్పే మాట.

ప్రాజెక్ట్ ఎందుకు విజయవంతమైంది ?

హోసచిగురు ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి చాలా కారణాలున్నాయి. ఎందుకంటే ఈ ప్రాజెక్టులన్నీ జాతీయ రహదారికి దగ్గర్లో ఉంటాయి. కాబట్టి రియల్ ఎస్టేట్ విలువ పెరుగుతుంది తప్ప తగ్గదు. పది నుంచి పదిహేనేళ్ల పాటు లీజుకు ఇవ్వొచ్చు. ఆ తర్వాత లీజ్‌ను కొనసాగించొచ్చు లేదా రద్దు చేసుకోవచ్చు. యజమానులు వారి ప్లాట్లలో ఫామ్ హౌజ్‌లు నిర్మించుకోవచ్చు. లేదా మంచి ధర వస్తే అమ్ముకోవచ్చు. వీఆర్ సత్యనారాయణ హోసచిగురు ప్రాజెక్ట్‌లో ఓ కస్టమర్. ఈయనను అడిగితే ఇది మంచి ఐడియా



అంటున్నారు.

కన్స్యూమర్ వరల్డ్ కంపెనీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణకు వ్యవసాయంపై అస్సలు ఆసక్తి లేదు. కానీ గోరంట్లలో హోసచిగురు ప్రాజెక్ట్ గురించి తెలుసుకున్న తర్వాత పెట్టుబడి పెట్టేందుకు అందరికంటే ముందు ఉత్సాహం చూపించింది ఆయనే. వ్యాపార కోణం మాత్రమే కాదు... మరో విషయం ఆయన్ను బాగా ఆకర్షించింది."అవును. ఈ ప్రాజెక్ట్‌లో పెట్టుబడి పెడితే కొంత భూమి నా సొంతం అవుతుంది. దానికి తోడు భూమాత మంచి కోసం నా వంతు కృషి చేస్తున్నానన్న సంతృప్తి మిగులుతోంది. నా స్థలంలో చెట్లను పెంచుతారు. కాబట్టి పచ్చని వాతావరణానికి, పర్యావరణానికి, స్వచ్ఛమైన గాలిని అందించడానికి నేను కృషిచేస్తున్నట్టే" అంటారాయన.

అనంతపురం జిల్లా గోరంట్లలో ఎకరా భూమి ధర 14 లక్షల రూపాయలు. దాంట్లో ఆరున్నర లక్షలను అభివృద్ధి పనుల కోసం ఉపయోగిస్తారు. మిగతా ఏడున్నర లక్షలు భూమి ధర. రెండో ఏడాది బొప్పాయి, మూడో ఏడాది దానిమ్మ పండించాలని ముందే ప్రణాళికలు సిద్ధం చేశారు. మొదటి దశలో భాగంగా 31 ఎకరాలు లీజుకు తీసుకున్నారు. తర్వాత మరో వందెకరాలు లీజుకు తీసుకోవాలని నిర్ణయించారు. గోరంట్లలోనే కాదు... అనేక చోట్ల హోసచిగురు టీమ్ అడుగు పెట్టింది. ఇప్పటివరకు హోసచిగురు ప్రాజెక్ట్‌లో భాగంగా వందల ఎకరాల బీడు భూముల్ని పచ్చని పొలాలుగా మార్చారు. వీరి ప్రాజెక్ట్‌లో వందల సంఖ్యలో కస్టమర్లున్నారు. వారిలో ఒకరు విప్రో కంపెనీలో పనిచేసే ముఖేష్ కుమార్. ఈయన గోరంట్ల ప్రాజెక్ట్‌లో పెట్టుబడి పెట్టారు. ఆయన కొన్న స్థలంలో చందనాన్ని పండిస్తున్నారు. దాంతో పాటు దానిమ్మ, మునగ చెట్లను పెంచుతున్నారు. బెంగళూరులోని హెచ్ సీజీ ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శ్రీకాంత్ కేవీ మరో ఇన్వెస్టర్. "వృత్తిపరంగా డాక్టర్ అయిన నాకు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని కాపాడటం లాంటి విషయంలో ఆసక్తి ఎక్కువ. ఈ ప్రాజెక్ట్ రూపంలో నాకో మంచి అవకాశం దొరికింది. నేను కూడా రైతును అన్న ఆనందం కలుగుతుంది. నేను కూడా పర్యావరణం కోసం కృషి చేస్తున్నానన్న సంతృప్తి మిగుల్తోంది." అని అంటున్నారు. ఈ సంతృప్తికి తోడు ఆయన పెట్టుబడికి తగ్గ ప్రతిఫలం లభిస్తోంది.





వ్యవసాయమూ ఓ పరిశ్రమే !

కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్‌లో ఓ రైతు కుటుంబానికి చెందిన శ్రీనాథ్ హోసచిగురు సహ వ్యవస్థాపకుల్లో ఒకరు. ఇంజనీరింగి పూర్తి చేశాడు. ఎంబీఏ గ్రాడ్యుయేట్ కూడా. ఎకరమో, రెండెకరాల స్థలంలో వ్యవసాయాన్ని నమ్ముకుంటే ఆర్థిక కష్టాలు తప్పవని శ్రీనాథ్‌కు బాగా తెలుసు. వ్యవసాయాన్ని చిన్నతరహా పరిశ్రమగా చేయడం లాభదాయకం కాదని శ్రీనాథ్‌కు తెలుసు. అనేక శాస్త్రీయ పద్ధతులు, వాణిజ్య ప్రక్రియలు అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో వ్యవసాయంలో లాభాలు సాధించడం అంత సులువు కాదంటారాయన. హోసచిగురు సహవ్యవస్థాపకుల్లో మరొకరు శ్రీరామ్ చిట్లూరు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారాయన. స్ట్రాటజీ అండ్ ఇన్వెస్ట్ మెంట్ విభాగానికి సీఈఓ, డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న హేమంత్ ప్రకాష్ ఐఐటియన్. పలు జాతీయ అంతర్జాతీయ సంస్థల్లో సహజ వనరుల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు విభాగాల్లో ఆరేళ్ల అనుభవం ఉంది. ఈ టీమ్‌లో మరొకరు అశోక్ జయంతి... వ్యవసాయ రంగ నిపుణులు. మట్టి లేకుండా మొక్కల్ని పెంచే పద్ధతులు, టేకు, ఉద్యానవనం లాంటి అంశాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. హోసచిగురుకు వ్యవసాయ పద్ధతులను వివరిస్తుంటారు. వీరితో పాటు అయ్యప్ప మాసగి, డాక్టర్ హెచ్ఎస్ అనంత పద్మనాభ, డాక్టర్ నారాయణ స్వామి లాంటి వాళ్లు ప్రచారకర్తలుగా ఉన్నారు. ఇరిగేషన్, వర్షపునీటిని నిల్వచేసుకుని పంటల సాగు, సాండల్ వుడ్ ఫార్మింగ్ లాంటి విషయాల్లో సలహాలిస్తుంటారు. ఈ బృందమంతా కలిసి ఇప్పటి వరకు 150 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. మరో 250 ఎకరాలకు కన్సల్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు.

నేలతల్లిని నమ్ముకుంటే ఎవరూ నష్టపోరని నిరూపిస్తున్నారు ఈ ఇంజనీర్లు. హోసచిగురు ప్రాజెక్ట్‌ను మూడు పువ్వులు ఆరు కాయలుగా విజయవంతంగా నడిపిస్తున్నారు.

ఎన్‌టిఆర్ సినిమాలో పూజా హెగ్డే



ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ ప్రాసెస్‌లో ఉన్నఎన్‌టీఆర్ త్రివిక్రమ్ సినిమాలో హీరోయిన్ ఫిక్సయింది. రీసెంట్‌గా అల్లు అర్జున్ డిజే దువ్వాడ జగన్నాథమ్‌తో ఇంప్రెస్ చేసిన పూజా హెగ్డే, ఇప్పుడు యంగ్ టైగర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనుంది. ఇప్పటికే బెల్లంకొండ శ్రీనివాస్ 'సాక్ష్యం' లో హీరోయిన్‌గా నటిస్తున్న పూజా, రీసెంట్ గా మహేష్ బాబు, వంశీ పైడిపల్లి సినిమాకి కూడా సంతకం చేసింది. దిల్ రాజు నిర్మాణంలో త్వరలోనే సెట్స్ పైకి రానున్న శ్రీనివాస కల్యాణం అనే సినిమాలో కూడా మెరవనుంది. అదే స్పీడ్‌లో ఇప్పుడు ఎన్‌టిఆర్, త్రివిక్రమ్ సినిమాలోను ఛాన్స్ కొట్టేసింది. డిజే సినిమాలో అల్లు అర్జున్‌కి ధీటుగా స్టెప్స్ వేసి ఇంప్రెస్ చేసిన పూజా హెగ్డే, 2018లో ఒక్కసారిగా టాప్ స్టార్స్ లిస్టులో చేరనుంది. రీసెంట్‌గా రామ్ చరణ్ 'రంగస్థలం' సినిమాలోను స్పెషల్ సాంగ్‌లో స్టెప్స్ వేసిన పూజా హెగ్డే, చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. హారిక హాసినీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్నఎన్‌టీఆర్ మూవీని మ్యాగ్జిమం మార్చిలో సెట్స్ పైకి తీసుకు వచ్చే ఆలోచనలో ఉంది సినిమా యూనిట్. తమన్ మ్యూజిక్ కంపోజర్ అని సమాచారం.

పంతంలో హంసానందిని



టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ ప్రస్తుతం తన 25వ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. మంచి మెసేజ్‌తో పాటు కమర్షియల్ వాల్యూస్‌తో సినిమా రూపొందనుంది. చక్రి అనే కొత్త దర్శకుడు ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా కె.కె.రాధామోహన్ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మెహరీన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు పంతం అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఇప్పుడు ఫిలింనగర్ వర్గాల్లో వినపడుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాలో గోపీచంద్ ఎన్నారై యువకుడిగా కనపడతాడట. మెహరీన్ టీచర్ పాత్రలో కనిపించనుంది. కాగా ఈ సినిమాలో హంసా నందిని కూడా కీలక పాత్ర పోషించనుంది. హంసా నందిని అంటే స్పెషల్ సాంగ్స్ మాత్రమే గుర్తుకు వస్తున్న తరుణంలో తనకు చాలా మంచి పాత్ర దొరికిందని, తప్పకుండా ఈ పాత్ర తనకు గుర్తింపు తెస్తుందని హంసా నందిని సంతోషాన్ని వ్యక్తం చేస్తుంది.

పెళ్లి కూతురు కానున్న అమీ జాక్సన్

మదరాసు పట్టణం ద్వారా దక్షిణాదిలోకి హీరోయిన్‌గా రంగ ప్రవేశం చేసిన బ్రిటన్ బ్యూటీ అమీ జాక్సన్ త్వరలోనే తన ప్రియుడు జార్జ్‌ను పెళ్లి చేసుకోనుందని వార్తలు వినపడుతున్నాయి. బ్రిటన్‌కు చెందిన వ్యాపారవేత్త జార్జ్, హీరోయిన్ అమీజాక్సన్‌ల మధ్య కొంతకాలంగా ప్రేమాయణం కొనసాగుతోంది. గత ఏడాది జూన్‌లోనే వీరిద్దరూ ఓ ఇంటివారు కావాలనుకున్నారు. అయితే అమీ జాక్సన్ బిజీ షెడ్యూల్ కారణంగా కుదరలేదు.

అయితే ఈ ఏడాదిలో పెళ్లి చేసుకోనుంది అమీ జాక్సన్. శంకర్ ఐతో పాటు ప్రస్తుతం రోబో సీక్వెల్ 2.0లో కూడా అమీ హీరోయిన్‌గా నటించింది. ఎవడు, థెరి చిత్రాల్లో అమీ జాక్సన్ నటించింది.

విశాలాంధ్ర సినిమా



గౌతమ్ మీనన్ దర్శకత్వంలో మాధవన్

స్టార్ డైరెక్టర్ గౌతమ్ వాసుదేవ్ మీనన్, నటుడు మాధవన్‌ల కలయికలో 2001లో వచ్చిన 'మిన్నాలే' చెలి చిత్రం మంచి సక్సెస్ అందుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం తర్వాత మళ్ళీ సినిమా చేయని వీళ్ళు దాదాపు 17 ఏళ్ల తర్వాత గౌతమ్ మీనన్ హిట్ సినిమాల్లో ఒకటైన 'విన్నైతాండి వరువాయ' ఏమాయ చేసావే సీక్వెల్ కోసం చేతులు కలిపారు. 'విన్నైతాండి వరువాయ' 10 ఏళ్ల తర్వాత ప్రారంభమయ్యే కథగా ఈ సీక్వెల్ ఉండనుంది. మొదటి భాగంలో ప్రేమ కోణాన్ని చూపిన గౌతమ్ మీనన్ ఇందులో స్నేహం అనే అంశాన్ని ఎలివేట్ చేస్తారని వినికిడి. ఇందులో మాధవన్ స్నేహితులుగా మరో ఇద్దరు ప్రముఖ హీరోలు నటించే అవకాశాలున్నాయట. ఈ కొనసాగింపునకు కూడా ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందివ్వనున్నారు. మరి ఈ ప్రాజెక్టును గౌతమ్ మీనన్ 'ఏమాయ చేసావే' తరహాలోనే తెలుగులోకి రీమేక్ చేస్తారా లేదా, ఒకవేళ చేస్తే ఎవరితో చేస్తారు అనే విషయాలపై ఇంకా క్లారిటీ రాలేదు.

అమెరికాలో గూఢచారి షూటింగ్

అడివి శేష్ 'గూఢచారి' ఫాస్ట్ పేజ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్‌లా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం అమెరికాలోని ఎగ్జోటిక్ లొకేషన్ లలో షూటింగ్ జరుపుకుంటుంది. రీసెంట్‌గా రిలీజైన ఈ మూవీ ఫస్ట్ లుక్ సినిమాపై పాజిటివ్ వైబ్ ని క్రియేట్ చేసింది. గతంలో 'క్షణం' లాంటి డిఫెరెంట్ ఎంటర్ టైనర్ తో ఇంప్రెస్ చేసిన అడివి శేష్, ఈ సినిమా కూడా అదే రేంజ్‌లో ఎట్రాక్ట్ చేయడం గ్యారంటీ అని కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. ప్రస్తుతం సినిమాలోని కీలక సన్నివేశాలను తెరకెక్కించే పనిలో ఉన్న ఫిల్మ్ మేకర్స్ సమ్మర్‌లో ఈ సినిమాను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారు. ఈ సినిమాతో మిస్ ఇండియా శోభిత ధూళిపాళ్ళ హీరోయిన్ గా ఇంట్రడ్యూస్ కానుంది. శశికిరణ్ తిక్క డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాని అభిషేక్ నామా టి.జి విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీచరణ్ పాకాల ఈ సినిమాకి మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నాడు.

'సత్య గ్యాంగ్' మార్చి 15 న విడుదల



సాత్విక్ ఈశ్వర్ ని హీరోగా పరిచయం చేస్తూ.. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్ వన్‌గా కర్నూలుకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు-వ్యాపారవేత్త మహేష్ ఖన్నా నిర్మిస్తున్న చిత్రం ' సత్య గ్యాంగ్'. పుష్కలమైన వినోదానికి కాస్తంత సందేశాన్ని జోడించి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆడియో వేడుక కర్నూల్ లో ఘనంగా జరిగింది. ఆదిత్య మ్యూజిక్.. ఈ చిత్రం ఆడియో విడుదల చేసింది. ఆడియోకు వస్తున్న స్పందనను పురస్కరించుకొని చిత్ర యూనిట్ ఆడియో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఇందులో హీరో సాత్విక్ ఈశ్వర్, హీరోయిన్ అక్షిత, నిర్మాత మహేష్ ఖన్నా, దర్శకత్వంతోపాటు చిత్రానికి సంగీతం కూడా సమకూర్చిన ప్రభాస్, సినిమాటోగ్రాఫర్ అడుసుమిల్లి విజయ్ కుమార్ పాల్గొన్నారు. నిర్మాత మహేష్ ఖన్నా మాట్లాడుతూ.. 'సమా జంలో అనాధలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి తీస్తున్న చిత్రం 'సత్య గ్యాంగ్'. హీరోగా పరిచయమవుతున్న సాత్విక్ ఈశ్వర్‌కి చాలా మంచి భవిష్యత్ ఉంది. ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన వస్తోంది. మా డైరెక్టర్ ప్రభాస్ మ్యూజిక్ డైరెక్టర్ గానూ మంచి మార్కులు స్కోర్ చేశాడు. మార్చి 15 న సినిమా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం " అన్నారు.

ప్రభాస్ మాట్లాడుతూ.. "సినిమా బాగా వచ్చిందన్నా.. మ్యూజిక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వస్తోందన్నా అందుకు కారణం మా ప్రొడ్యూసర్" అన్నారు. 'సత్య గ్యాంగ్' వంటి ఓ మంచి సినిమాతో హీరోగా పరిచయమవుతుండడం గర్వంగా ఉందని హీరో సాత్విక్ ఈశ్వర్ అన్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు అక్షిత కృతజ్ఞతలు చెప్పారు.

ప్రత్యూష్, హర్షిత, సుమన్, సుహాసిని, కాలకేయ ప్రభాకర్, షఫీ, జీవా, వినోద్, మహేష్ ఖన్నా, రాజేందర్, దిల్ రమేష్, బి. హెచ్.ఈ. ఎల్.ప్రసాద్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి.. కథ: సిద్ధయోగి క్రియేషన్స్, ఎడిటర్: నందమూరి హరి, కో-డైరెక్టర్స్‌బీ నాగబాబు-కొండలరావు, నిర్మాత-దర్శకత్వపర్యవేక్షణ: మహేష్ ఖన్నా, సంగీతం-దర్శకత్వం: ప్రభాస్

లండన్ వెళ్లనున్న మహేష్



సూపర్ స్టార్ మహేష్, కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమంతుడు సినిమా తర్వాత రూపొందుతోన్న చిత్రం భరత్ అనే నేను. డి.వి.వి.దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షెడ్యూల్ తర్వాత యూనిట్ లండన్ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో హీరో మహేష్, హీరోయిన్ కైరా అద్వానీపై ఓ సాంగ్‌ను చిత్రీకరించాల్సి ఉందట. ప్యాచ్ వర్క్ సహా సినిమాను మార్చి 27కంతా పూర్తి చేసేస్తారట. నిర్మాణాంతర కార్యక్రమాలను పూర్తి చేసేసి సినిమాను ఏప్రిల్ 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. తమిళ నటుడు శరత్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి టాలీవుడ్ రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ ముఖ్యమంత్రి పాత్రలో నటిస్తున్నారు

22 కోట్ల రూపాయల ఆఫర్



ఇంకా సెట్స్ పైకి వెళ్లకముందే రామ్ చరణ్, బోయపాటి సినిమాకు 22 కోట్ల రూపాయల ఆఫర్ వచ్చింది. ఈ సినిమా హిందీ డబ్బింగ్ రైట్స్ కోసం ఇంత మొత్తాన్ని ఇచ్చేందుకు ఓ నేషనల్ ఎంటర్ టైన్‌మెంట్ ఛానెల్ ముందుకొచ్చింది. అయితే ప్రస్తుతానికి దీనిపై ఇంకా అగ్రిమెంట్ పూర్తవ్వలేదు. నార్త్‌లో మాస్-యాక్షన్ సినిమాలకు మంచి గిరాకీ ఉంది. బి, సి సెంటర్లలో తెలుగు సినిమా హిందీ డబ్బింగ్ వెర్షన్లకు మంచి డిమాండ్ ఉంది. పైగా బోయపాటి సినిమాలకు ఉత్తరాది రూరల్ ఏరియాస్‌లో విపరీతమైన డిమాండ్. అది కూడా రామ్ చరణ్ కాంబినేషన్‌లో అనేసరికి రేటు 22 కోట్లు పలికింది. త్వరలోనే ఈ సినిమా సెట్స్ పైకి రానుంది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించి మేకోవర్ పనిలో ఉన్నాడు రామ్ చరణ్. తమన్ ఈ సినిమాకు సంగీతం అందించబోతున్నాడు.

అల్లు శిరీష్ యుద్ధభూమిలో మోహన్ లాల్



అల్లు శిరీష్ నటించిన మలయాళ మూవీ '1971 బియాండ్ బార్డర్స్' ఇప్పుడు తెలుగులో రిలీజ్ కి రెడీ అవుతోంది. 'యుద్ధభూమి' అనే టైటిల్ తో తెరకెక్కిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. మోహన్ లాల్‌కీ రోల్ ప్లే చేసిన ఈ సినిమాలో అల్లు శిరీష్ పవర్ ఫుల్ సైనికుడిలా నటించాడు. ఇండియన్ ఆర్మీలో జరిగిన యదార్థ ఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాకి మేజర్ రవి డైరెక్టర్. ఆయన మేజర్‌గా ఇండియన్ ఆర్మీలో పని చేసినప్పుడు, స్వతహాగా హ్యాండిల్ చేసిన కొన్ని ఆర్మీ ఆపరేషన్స్‌ని రిఫరెన్స్‌గా తీసుకుని తెరకెక్కించిన ఈ సినిమా మలయాళంలో సూపర్ హిట్టయింది. సిద్ధార్థ విపిన్ మ్యూజిక్ కంపోజ్ చేసిన ఈ సినిమాని ఎ.ఎన్ బాలాజీ నిర్మిస్తున్నారు. ఈ సినిమాని మార్చి ఫస్ట్ వీక్‌లో రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారు ఫిల్మ్ మేకర్స్.

పీఎన్‌బీ కుంభకోణంలో సిట్ విచారణకు కేంద్రం నో



న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన రూ.11వేల 300 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో స్వతంత్ర విచారణను, వజ్ర వ్యాపారి నీరవ్ మోడీని దేశానికి రప్పించాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యాన్ని కేంద్రం వ్యతిరేకించింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదైందని, విచారణ కొనసాగుతోందని పేర్కొంది. బుధవారం పిల్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్‌విల్కర్, జస్టిస్ డీవై చంద్రచౌద్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ వ్యవహారంలో ప్రస్తుతానికి తామేమీ మాట్లాడమని వెల్లడించింది. న్యాయవాది వినీత్ దాఖలు చేసిన ఈ పిల్‌పై విచారణను మార్చి 16కు వాయిదా వేస్తున్నట్టు పేర్కొంది. అయితే, ఈ వ్యాజ్యాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని కేంద్రం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ కోర్టుకు తెలిపారు. ఈ కేసులో వివిధ కోణాల్లో దర్యాప్తు జరుగుతోందన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, భారత రిజర్వు బ్యాంకు, ఆర్థిక, న్యాయ శాఖలను పార్టీలు దాఖలైన ఈ వ్యాజ్యం ప్రధాన నిందితులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) విచారణను కోరుతోంది. పెద్దమొత్తాల్లో రుణాలు ఇచ్చే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధివిధానాలకు సంబంధించి మార్గదర్శకాలు ఇవ్వాలని ఆర్థికశాఖకు సూచించింది. రూ.10 కోట్లకు మించి రుణాలిచ్చే సమయంలో భద్రతా ప్రమాణాలను, రికవరీ విధానాలను సూచిస్తూ రిట్ ఆర్డర్‌ను జారీచేయాలని కోరింది. దేశంలో బ్యాంకింగ్ అప్పుల వ్యవహారాలపై నిపుణుల సంఘాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఇదే అంశంపై శర్మ అనే వ్యక్తి దాఖలు చేసిన మరో పిటిషన్ ఇంకా విచారణకు రాలేదు. బ్యాకింగ్ మోసాలు ప్రజలకు, ఖజానాకు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయని, ఈ వ్యవహారాలను పరిష్కరించేందుకు రాజకీయ నేతలు/యంత్రాంగాల ఆధీనంలో ఉండే ఏజన్సీలను కాకుండా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జీలతో కూడిన ప్యానల్‌ను ఏర్పాటు చేయాలని శర్మ తన ఫిర్యాదులో కోరారు. రుణాలు ఇచ్చేటప్పుడు బ్యాంకు ఆర్బీఐ నిబంధనలకు పాటించడం లేదని ఆరోపించారు.

ముంబైలో జర్నలిస్ట్‌పై దాడి

ముంబై : ఓ సీనియర్ టెలివిజన్ జర్నలిస్టుపై కొంతమంది ప్రయాణికులు దాడి చేసిన ఘటన ముంబై లోకల్ ట్రెన్‌లో చోటుచేసుకుంది. సుధీర్ శుక్లా ఒక ప్రముఖ హిందీ న్యూస్ ఛానెల్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన మీరా రోడ్ నుంచి అంధేరి వెళ్లే లోకల్ ట్రెన్‌లో ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే లోపల ఖాళీ లేదని ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు అతన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో వారికి శుక్లాకు మధ్య వాగ్వాదం జరిగింది. లోపలికి వచ్చిన అతనితో అక్కడున్న కొంతమంది ప్రయాణికులు వేధించడం మొదలెట్టారు. వారి ఫోటోలు తీసేందుకు శుక్లా ప్రయత్నించగా ఆ ఫోన్‌ను లాగేసుకున్నారు. మాటా మాటా పెరిగిన గొడవలో దాదాపు ఎనిమిది మంది అతడిపై దాడి చేయగా జర్నలిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతడు కోలుకోగానే నిందితులను గుర్తించే ప్రయత్నం చేస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెస్టన్ రైల్వే జీఆర్‌పీ డీసీపీ పురుషోత్తం వెల్లడించారు. జర్నలిస్టుపై దాడిని ముంబై క్రైం రిపోర్టర్స్ అసోసియేషన్ ఖండించింది.

బుందేల్ ఖండ్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ పార్క్

- యూపీ ఇన్వెస్టర్ల సమ్మిట్‌లో మోడీ ప్రకటన
- మొదటి రోజు 4.28 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు
- యూపీ అభివృద్ధికి నిబద్ధతతో కృషి : ముఖేష్ అంబాని



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో అత్యంత వెనుకబడిన ప్రాంతాలలో ఒకటైన బుందేల్‌ఖండ్‌ను అభివృద్ధి చేసేందుకు ఆ ప్రాంతానికి డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. ఇన్వెస్టర్ల సమ్మిట్-2018 బుధవారం ఇక్కడ ప్రారంభమైంది. దీనిలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, "బడ్జెట్‌లో ప్రతిపాదించిన రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లలో ఒకటి ఇది. రాష్ట్రంలోని బుందేల్‌ఖండ్ ప్రాంతానికి ఒకటి కేటాయించాం. 20వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో దీనిని తీసుకువస్తాం. 2.5 లక్షల మంది ప్రజలకు ఉపాధిని కల్పిస్తుంది" అని చెప్పారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి పనిచేయగలిగిన శక్తి అపారంగా ఉందని మోడీ నొక్కిచెప్పారు. విధానం, ప్రణాళిక, పనితనం అవసరం, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, రాష్ట్ర ప్రజలు "సూపర్ హిట్" పనితీరును ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించడం శుభపరిణామమని, దేశమంతట నుంచి పారిశ్రామికవేత్తలు హాజరుకావడం పెద్దమార్పుగా అభివర్ణించారు. గత ప్రతికూలతలను యోగీ ప్రభుత్వం అధిగమిస్తోందని, సానుకూల మార్పులతో ప్రజలకు ఆశాకిరణంగా మారిందని మోడీ అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ దాసు మాట్లాడుతూ, సమ్మిట్ మొదటి రోజున రూ. 4.28 లక్షల కోట్ల విలువైన 1,045 ఒప్పందాలపై సంతకాలు జరిగినట్టు తెలిపారు. "500కుపైగా కంపెనీలు ఈ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణం. ఇటీవల నేను అసెంబ్లీలో రూ. 4.28 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టాను. ఈ రోజు కుదిరిన ఎంఓయూల విలువ కూడా అంతే. నూతన యూపీ దిశగా మేము అడుగులు వేస్తున్నాం" అని సమ్మిట్‌నుద్దేశించి మాట్లాడుతూ ఆదిత్యనాథ్ అన్నారు.

రిలయెన్స్ ఇండస్ట్రీస్ చీఫ్ ముఖేష్ అంబాని మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్ అభివృద్ధిలో పాలుపంచుకోవడం దేశభక్తి విధిగా పేర్కొన్నారు. రానున్న మూడేళ్లలో జియో ద్వారా మరో పదివేల కోట్లు పెట్టుబడిగా పెడతానని హామీ ఇచ్చారు. పెట్టుబడులు అధికమైపోయాయని, అత్యధిక వేగం గల 4జీ టెలికం వెంచర్ కోసం రూ. 20,000 కోట్లకు పైగా పెట్టుబడి ఇప్పటికే పెట్టినట్టు చెప్పారు. 22 కోట్ల ఉత్తరప్రదేశ్ జనాభా అభివృద్ధి చెందకుండా భారత్ తన పనితనాన్ని పూర్తిగా ప్రదర్శించలేదని అన్నారు. "నమామి గంగ" ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తానని ముఖేష్ హామీ ఇచ్చారు.

రాఫెల్, పీఎన్‌బీపై నోరు మెదపరే?



మోడీని నిలదీసిన రాహుల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తీవ్రస్థాయిలో దాడిచేశారు. పీఎన్‌బీ కుంభకోణం, రఫెల్ ఒప్పందంపై ప్రధాని మౌనం దాల్చడాన్ని ప్రశ్నించారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఈ అంశాలపై ఆయన ప్రసంగం వినాలని ఎదురు చూస్తున్నానని రాహుల్ వ్యంగ్యంగా అన్నారు. ఆకాశవాణిలో వచ్చే ప్రధాన మంత్రి కార్యక్రమం మన్ కీ బాత్. బిలియనీర్, వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, రఫెల్ 'కుంభకోణం'పై ప్రధాన మంత్రి ప్రసంగం వినాలని దేశం యావత్ ఎదురు చూస్తోందని రాహుల్ అన్నారు. "మోడీజీ గత నెలలో మీ మన్ కీ బాత్" కార్యక్రమానికి సంబంధించి నా సూచనలను మీరు పట్టించుకోలేదు.ఏమి మాట్లాడాలో మీకు తెలిసినప్పుడు ఆలోచనలు ఇవ్వమని మీరు అడగడం ఎందుకు. క్రింది అంశాలపై మీరు ఏమి చెపుతారోనని ప్రతి ఒక్క భారతీయుడు ఎదురు చూస్తున్నాడు.

1. నీరవ్ మోడీ 22వేల కోట్ల దోపిడీ. పరారీపైన,
2. 58,000 కోట్ల రాఫెల్ కుంభకోణంపైన. మీ ప్రసంగం కోసం మేము ఎదురుచూస్తున్నాం"అని ట్విట్టర్ లో రాహుల్ పేర్కొన్నారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి సంబంధమున్న కోట్లాది రూపాయల బ్యాంకు కుంభకోణంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నోరుమెదకపోవడంపైనే రాహుల్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించారు. 'అధికారంలో ఉన్న శక్తులు' రక్షణ కల్పించిన తరువాత ఆయన దేశం వొదిలి పారిపోయారని విమర్శించారు. రాఫెల్ విమానాల ఒప్పందానికి సంబంధించి కూడా రాహుల్ ప్రభుత్వంపై దాడి చేశారు. జనవరి 28వ తేదీన నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమానికి కూడా సూచనలు ఇవ్వమని ప్రధాని కోరినప్పుడు అత్యాచారాలను నిరోధించడంపై ప్రభుత్వ ప్రణాళిక ఏమిటీ?, డొక్లాం అవతలికి చైనీయులను తీసుకువెళ్లడం, యువతకు ఉపాధి వంటి అంశాలపై ప్రభుత్వ ఆలోచనలను ప్రజలకు తెలియజేయమని రాహుల్ కోరారు. కానీ, వాటిపై మోడీ మాట్లాడలేదు.

24 నుంచి కర్ణాటకలో రాహుల్ పర్యటన

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్‌గాంధీ పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారానికి ఆయన రాష్ట్రానికి రావడం ఇది రెండోసారి. ఈ దఫా బెల్గాం, విజయపుర (బీజపూర్), బాగల్‌కోట్, ధార్వాడ్ జిల్లాల్లో రాహుల్ పర్యటించనున్నారు. తన 'జన ఆశీర్వాద యాత్ర'లో భాగంగా రాహుల్ ఈ పర్యటన జరుపుతున్నారని ఈ రీజియన్ ఇన్‌ఛార్జి, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శి మాణిక్యం ఠాగూర్ తెలిపారు. రాహుల్ బహిరంగ సభలను ఉద్దేశించి మాట్లాడుతారు. కేవలం 'మహిళ ర్యాలీ'లో మాత్రమే పాల్గొంటారు, వివిధ గ్రూప్‌లతో ఇష్టాగోష్టిగా సమావేశమవుతారు. ఆయన పర్యటన సందర్భంగా మారథాన్‌లో కూడా పాల్గొంటారు. "రాహుల్ బస్సులో ప్రయాణిస్తారని భావిస్తున్నాం. బహుళ కార్యక్రమాలలో కూడా ఆయన పాల్గొంటారు" అని తెలిపారు.

రాహుల్ ఓ కుర్రకుంక...: యడ్యూరప్ప



బెంగళూరు : త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో రాజకీయం వేడెక్కుతోంది. రోజురోజుకు ప్రచార తీవ్రత పెరుగుతోంది. ఇటు అధికార కాంగ్రెస్ పార్టీ, అటు ప్రతిపక్ష బీజేపీ గెలుపే ధ్యేయంగా శాయశక్తులు ఒడ్డుతున్నాయి. ప్రత్యర్థులపై పదునైన వాగ్బాణాలు, విమర్శలు సంధిస్తున్నాయి. ఇప్పటికే ప్రధాని నరేంద్రమోడీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటించి..తమ తమ పార్టీల ప్రచారానికి ఊపునిచ్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాష్ట్రంలో సుదీర్ఘంగా పర్యటిస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లో బీజేపీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా షా మంత్రాంగం నడుపుతున్నారు. ఉడిపిలో ఆయన బుధవారం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసం గించారు. 'కర్ణాటక ప్రజల్లో నెలకొన్న ఆగ్రహాన్ని ఉప యోగించుకొని.. సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని గద్దె దించాలి. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకు రావాలి' అని ఆయన కమలం శ్రేణులకు పిలుపు నిచ్చారు. మరోవైపు బీఎస్ యడ్యూరప్ప రాహుల్ గాంధీపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాహుల్ ఓ బచ్చా అని అభివర్ణించారు. ఆ బచ్చా (రాహుల్)ను కర్ణాటకలోకి తీసుకురావడంతో తమ విజయావకాశాలు మరింత మెరుగయ్యాయి. ఇప్పుడు 150కిపైగా సీట్లు గెలుస్తామని యడ్యూరప్ప ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రాహుల్ రావడమంటే బీజేపీకి మంచి రోజులు వచ్చినట్టేనని ఆయన తెలిపారు. రాహుల్ పర్యటన వల్ల కర్ణాటక నుంచి కాంగ్రెస్‌కు విముక్తి లభిస్తుందని విమర్శించారు.

కొఠారీపై సీబీఐ ప్రశ్నల వర్షం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంకులు ఏడింటిని రూ.3,695 కోట్ల మేర మోసం చేసిన కేసులో రొటొ మాక్ యజమాని విక్రమ్ కొఠారీని సీబీఐ బుధవారం ప్రశ్నించింది. సంస్థ కేంద్ర కార్యాలయంలో ఆయనను విచారించినట్టు అధికారులు వెల్లడించారు. అంతకు ముందు కాన్పూర్‌లో కొఠారీని ప్రశ్నించినట్టు తెలిపారు. కొఠారీ, ఆయన భార్య సాధనా, తనయుడు రాహుల్ కూడా రొటొమాక్ గ్లోబల్ ప్రై.లి.లో డైరెక్టర్లుగా ఉన్నారని, వీరంతా స్వీయ ప్రయోజనాల కోసం బ్యాంకు రుణాలను దారిమళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయ న్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా కన్సార్టియం సభ్యుడి ఫిర్యాదు మేరకు సీబీఐ కొఠారీపై చర్యలు తీసుకొందని, కొఠారీ దేశం నుంచి పలాయనం సాగించివుండవచ్చునని కన్సార్టియం అనుమానించిందని అధికారులు వివరించారు. ఈనెల 18న కొఠారీపై రూ.800 కోట్ల కుంభకోణానికి సంబంధించి కేసు నమోదు కాగా అది రూ.800 కోట్లు కాదు మొత్తం రూ.3,695 కోట్లని తేలింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అలహాబాద్ బ్యాంక్, ఓరియంటల్ బ్యాంకులలో రొటొమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాలున్నాయని, ఆ ఏడు బ్యాంకుల నుంచి రొటొమాక్ సంస్థ రుణాలు తీసుకుందని దర్యాప్తు సంస్థ పేర్కొంది. మొత్తం రూ.3,695 కోట్ల కుంభకోణం జరిగినట్టు తేలడంతో విక్రమ్ కొఠారీ భూమి, సముద్ర, వాయు మార్గాలలో దేశం నుంచి తప్పించుకోకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కట్టడి చేసింది. ఆయనను అనుమతించవద్దంటూ ఆయా శాఖలకు మంగళవారం ఆదేశాలు జారీచేసింది.

చిన్నారి లేఖతో ఆ ఊరికి రోడ్డు



ఫతేబాద్: తమ గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ ఓ చిన్నారి రాసిన లేఖకు ప్రధానమంత్రి కార్యాలయం సానుకూలంగా స్పందించింది. హర్యానాకు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి ఖుషీ ఇటీవల ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసింది. అస్తవ్యస్తంగా ఉన్న తమ గ్రామంలోని రోడ్లను పక్కారోడ్లుగా మార్చాలని లేఖలో కోరింది. నెలరోజుల వ్యవధిలోనే ప్రధాని కార్యాలయం నుంచి దీనికి సానుకూల స్పందన వచ్చింది. ఖుషి పెన్సిల్‌తో తన నోట్ బుక్‌లోని పేపర్‌పై ఈ ఉత్తరాన్ని రాసింది. కుటుంబసభ్యుల సాయంతో దానిని ప్రధాని కార్యాలయానికి పంపింది. సత్తా టిబ్బాగ్రామం నుంచి ఠాణీ తేజ్‌సింగ్ గ్రామం వరకూ గల 3 కిలోమీటర్ల రోడ్డను పక్కా రోడ్డుగా మార్చేందుకు ప్రధాని కార్యాలయం నుంచి ఆదేశాలు జారీఅయ్యాయి. ఈ గ్రామ రహదారిని బాగు చేయాలని పలుమార్లు గ్రామస్థులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. ఈ రోడ్డు మీదుగా పాఠశాలకు వెళ్లడం ఇబ్బందిగా ఉందని ఖుషీ కూడా ప్రధానికి రాసిన లేఖలో పేర్కొంది.ఆ చిన్నారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేల మృతి

యూపీలో ప్రమాదానికిగురై ఒకరు ..
రాజస్థాన్‌లో అనారోగ్యంతో మరొకరు
రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రధాని సంతాపం



సీతాపూర్ / జైపూర్ : ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లకు చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బుధవారం మృతిచెందారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరుగుతున్న పెట్టుబడిదారుల సదస్సుకు వెళుతూ మార్గంమధ్యలో కారు ప్రమాదానికి గురై బీజేపీ ఎమ్మెల్యే లోకేంద్ర సింగ్ మరణించారు. బిజ్నూర్ జిల్లా సీతాపూర్‌లో ఎమ్మెల్యే కారును ట్రక్ ఢీకొంది. దీంతో ఎమ్మెల్యే లోకేంద్ర సింగ్ (45), ఆయన ఇద్దరు గన్‌మెన్లు దీపక్ కుమార్ (32), బ్రిజేష్ మిశ్రా (30)తో సహా ట్రక్కు క్లీనర్ మరణించినట్టు పోలీసులు వెల్లడించారు. రెండు వాహనాల డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారని, ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజస్థాన్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే కల్యాణ్ సింగ్ చౌహాన్ బుధవారం తెల్లవారుజామున ఉదయ్‌పూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. రాజ్‌సమంద్ జిల్లా నాథ్‌వాడా నియోజకవర్గ ఎమ్మెల్యే చౌహాన్(58)కు భార్య, నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాథ్‌వారా సమీపంలోని దాగ్‌వాడా గ్రామంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. చౌహాన్ మృతి బీజేపీకి తీరని లోటని రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజె పేర్కొన్నారు. ఆమె చౌహాన్ కుటుంబాన్ని పరామర్శించారు.

సంతాపం : యూపీ ఎమ్మెల్యే సింగ్ మృతికి ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పలువురు కేబినెట్ మంత్రులు సంతాపం ప్రకటించారు. రాజస్థాన్ బీజేపీ ఎమ్మెల్యే చౌహాన్ మృతికి సీఎం రాజె, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ పర్నామీ, మాజీ సీఎం అశోక్ గెహ్లాట్, నేతలు సంతాపాన్ని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి మరణం పార్టీతో పాటు సమాజానికీ తీరని లోటుగా వారు ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఇదీ నాటి నేతల చిత్తశుద్ధి...!



న్యూఢిల్లీ : వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ కుంభకోణం తర్వాత అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో రూ.11400 కోట్లు కుంభకోణంలో నీరవ్ మోడీ కీలక నిందితుడు. నాటి రాజకీయ నేతల చిత్తశుద్ధికి, నేటి పాలకుల సాచివేత ధోరణికి ఇది అద్దంపట్టే అంశం. కారు కొనుగోలుకు నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రూ.5 వేల రుణం తీసుకున్నారు. కొద్దిరోజులకే ఆయన మరణించారు. ఆ తర్వాత వచ్చే పెన్షన్‌తోనే శాస్త్రి సతీమణి లలిత ఆ రుణాన్ని పైసాతో సహా బ్యాంక్‌కు తిరిగి చెల్లించారు. దేశంలోని బ్యాంకులను వరుసపెట్టి లూటీ చేస్తున్నా నిద్రవదలని పాలకులున్న నేటిరోజుల్లో... మరణానంతరం కూడా రుణం తిరిగి చెల్లించిన తీరుపై ఇప్పుడు ఆసక్తికర చర్చ జరుగుతోంది. అందరినీ ఆలోచింపచేస్తోంది. పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత, శాస్త్రి కుమారుడు అనిల్‌శాస్త్రి నాటి పరిస్థితులను గుర్తుచేశారు. 'మేము ఓ టాంగాలో కొలంబియా స్కూల్‌కి వెళ్లేవాళ్లం. అప్పుడప్పుడు ఆఫీసు కారు వాడేందుకు ప్రయత్నిస్తే.. వ్యక్తిగత పనుల కోసం దాన్ని వాడేందుకు నాన్న అంగీకరించేవారు కాదు. దీంతో కుటుంబం కోసం ఓ కారు కొనడం తప్పనిసరైంది' అని శాస్త్రి అని వివరించారు. 1964లో నాటి ప్రధానమంత్రి ప్రత్యేక సహాయకుడు వీఎస్ వెంకట్రామన్ ద్వారా కారు కోసం అన్వేషణ జరిగింది. కొత్త ఫియట్ కారు ఖరీదు రూ.12 వేలు పలుకుతుండగా.. శాస్త్రి బ్యాంకు ఖాతాలో రూ.7 మాత్రమే ఉన్నాయి. దీంతో ఆయన రుణం కోసం దరఖాస్తు చేయడంతో రూ.5 వేలు అదేరోజు మంజూరయ్యాయి. అయితే 1966 జనవరి 11న శాస్త్రి హఠాన్మరణం చెందారు. శాస్త్రి పేరిట బ్యాంకులో ఉన్న రుణాన్ని ఆయన సతీమణి లలిత విస్మరించలేదు. ఆయన మరణానంతరం వచ్చే పెన్షన్‌తో బ్యాంకు బాకీ పూర్తిగా చెల్లించేశారు. ఆయన కొనుగోలు చేసిన 1964 మోడల్ ఫియట్ కారు ఇప్పటికీ ఢిల్లీలోని లాల్‌బహదూర్ శాస్త్రి మెమోరియల్‌లో ఉంది. కాగా స్వదేశీ బ్యాంకును ప్రారంభించాలన్న ఆలోచనతో 1894లో బ్రిటీష్ పాలనలోనే పీఎన్‌బీ ప్రారంభమైంది. తొలినాళ్లలో బ్యాంకు బోర్డులో లాలా లజపతిరాయ్ వంటి స్వాతంత్ర్యయోధులు ఉన్నారు. మహోన్నత చరిత్ర ఉన్న ఈ బ్యాంకును.. నీరవ్ మోడీ రూ.11.5 వేల కోట్ల మేర ముంచేసి విదేశాలకు పారిపోయిన సంగతి తెలిసిందే.

హార్దిక్ పటేల్‌ను వీడని 'దేశద్రోహం' కేసు

అహ్మదాబాద్ : పాటీదార్ రిజర్వేషన్ల పోరాట నాయకుడు హార్దిక్ పటేల్‌కు సిటీ సెషన్స్ కోర్టులో బుధవారం ఎదురుదెబ్బ తగిలింది. 2015 అక్టోబరులో అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ తనపై నమోదు చేసిన దేశద్రోహం కేసు నుంచి విముక్తి ప్రసాదించాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. 2015 ఆగస్టు 25న పాటీదార్లు జీఎండీసీ గ్రౌండ్స్‌లో సమావేశమైన అనంతరం ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నించానంటూ క్రైం బ్రాంచ్ పోలీసులు తనపై చార్జిషీటు దాఖలు చేశారనీ, అయితే అందుకు ఎలాంటి సాక్ష్యాలు లేవని హార్దిక్ తన వాదన వినిపించారు. ఆయన వాదనతో అడిషనల్ సెషన్స్ జడ్జి దిలీప్ మహిద ఏకీభవించలేదు.

రామాలయ నమూనాతో అయోధ్య రైల్వే స్టేషన్...

అయోధ్య: అయోధ్య రైల్వేస్టేషన్‌ను రామాలయం నమూనాలో నిర్మించ నున్నట్టు కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి మనోజ్ సిన్హా చెప్పారు. ఈ విషయాన్ని త్వరలో కేబినెట్ ముందు ప్రతిపాదించనున్నట్టు తెలిపారు. అయోధ్యలో రైల్వేస్టేషన్ అభివృద్ధితో పాటు పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశంలోని రామ భక్తులందరూ అయోధ్యను సందర్శించే విధంగా అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని, మాజీ ప్రధాని అతల్ బిహారీ వాజ్‌పేయి హయాం నుంచే అయోధ్య రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలన్న చర్చలు జరుగుతున్నాయన్నారు. దీని నిర్మాణం పూర్తికాగానే.. రామాలయ నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. అయోధ్య రైల్వే స్టేషన్ పునర్నిర్మాణం కోసం రూ.80 కోట్లు కేటాయిస్తున్నట్టు కేంద్రం ఇప్పటికే వెల్లడించింది. దీంతో పాటు ఇక్కడ పలు ప్రాజెక్టుల కోసం రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్టు రైల్వే శాఖ ప్రకటించింది.

స్వర్ణదేవాలయంలో కెనాడా ప్రధాని

అమృతసర్: తెలుపురంగు కుర్తాపైజమా ధరించి, తలకు కాషాయరంగు గుడ్డ చుట్టుకొని స్వర్ణదేవాలయంలో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రార్థనలు చేశారు. ఆయన భార్య, ముగ్గురు పిల్లలో ఇద్దరు స్వర్ణదేవాలయ గర్భగుడిలో గంటసేపు ప్రార్థనలు చేశారు. సంప్రదాయబద్దంగా సిక్కులంతా చేసినట్లే వంటగదిలో రోటీలు చేశారు. ఇదంతా చేస్తుండగా అశ్చర్యపడిన భక్తులు వారి వీడియోలను తీశారు. శిరోమణి గురుద్వార ప్రభందక్ కమిటీ వారికి రెడ్ కార్పెట్ పరచగా, పంజాబ్ ఎస్‌జీపీసీ పోలీసు అధికారి రక్షణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

న్యూఢిల్లీ : మహిళను అత్యాచారం చేసిన కేసులో దోషులకు 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. 2013లో ఉద్యోగం నిమిత్తం ఆమె భర్తతో ఢిల్లీ రాగా ఈ ఘటన జరిగింది. చట్టవిరుద్ధంగా ఆమెను బంధించి అత్యాచారం జరిపినందుకు రవి, దిగంబర్‌లను దోషులుగా పేర్కొంటూ అడిషినల్ స్పెషల్ జడ్జి అనురాగ్ సైన్ 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. ఢిల్లీ లీగల్ సర్వీసు అథారిటీ ఆమెకు రూ.20లక్షల నష్టపరిహారం అందచేసి,పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని లాయర్ వర్ష ఆహ్లూవాలియా అభ్యర్ధనను దాఖలు చేశారు.

సుప్రీంకోర్టులో ప్రియ వారియర్‌కు ఊరట

న్యూఢిల్లీ : ఒకపాటలో కన్నుగీటి రాత్రికి రాత్రే సెలబ్రిటీగా మారిన ప్రియ వారియర్‌పై నేరచర్యలు తీసుకోకుండా సుప్రీంకోర్టు ఆమెకు బాసటగా నిలిచింది. ముస్లింల మనోభావాలను ఆమె దెబ్బతీసిందని వేసిన కేసుపై కోర్టు స్టే విధించింది. న్యాయమూర్తులు దీపక్‌మిశ్రా, ఏఎం ఖన్వీల్కర్,డీవై చంద్రచూడ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం 'ఒరు అడార్ లవ్' డైరెక్టర్‌కు కూడా ఇదే తరహా ఉత్తర్వులు వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం వారిరువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే.

ఇళ్లలోకి దూసుకెళ్లిన ట్రక్ : 8 మంది మృతి

భోపాల్: ఇనుపరాడ్లు తీసుకెళుతున్న 16 టైర్ల ట్రక్ అదుపుతప్పి రోడ్డు ప్రక్కనున్న మూడు ఇళ్లలోకి దూసుకుపోవడంతో 8 మంది దుర్మరణం చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. జబల్‌పూర్- మండ్లా రోడ్డులో ఈ ఘటన జరిగిందని ,సహాయక చర్యలు తీసుకుంటున్నామని జబల్‌పూర్ డీఐజీ బీఎస్ చౌహాన్ వివరించారు. ఈ ఘటన జరగగానే స్థానికులంతా రోడ్డుపై బైఠాయించి పోలీసులపై రాళ్లు రువ్వి, వారి వాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. ఈ వాహనం చత్తీస్‌ఘడ్ నుంచి వస్తోందని, వాహనాన్ని దుండగులు ధ్వంసం చేశారన్నారు. ట్రక్ డ్రైవర్‌ను అరెస్టు చేసి, దర్యాప్తు జరుపుతున్నామని డీఐజీ వెల్లడించారు.

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రోత్సహించండి

పుదుచ్చేరి : కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో చిన్న,మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని ఆ రాష్ట్ర గవర్నర్ కిరణ్‌బేడీ కేంద్రాన్ని కోరారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి గిరిరాజ్ సింగ్‌ను బుధవారం ఆమె ఢిల్లీలో కలుసుకున్నారు. గ్రామీణ,పట్టణ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని కోరినట్లు ఆమె ట్విటర్‌లో వెల్లడించారు.

డొక్లాంపై కలత వద్దు : ఆర్మీ చీఫ్

న్యూఢిల్లీ : డొక్లాం వద్ద అన్నీ సరిగానే ఉన్నాయని దీనిగురించి కలత చెందాల్సిన అవసరం లేదని ఆర్మీచీఫ్ బిపిన్ రావత్ ఢిల్లీలో వెల్లడించారు. సిక్కిం వద్ద ఉన్న డొక్లాంలో భారత్- చైనా బలగాలు మోహరించడంతో 73 రోజులపాటు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన విషయం తెలిసిందే. గతేడాది భారత్ రోడ్డు నిర్మాణాలను చేపట్టడం చైనా అడ్డుకుంది. డొక్లాం పరిస్థితిపై ప్రశ్నించిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ పరిస్థితి మామూలుగానే ఉందని కలత చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఐఆర్ఎస్ అధికారి అరెస్టు

పాట్నా : సీనియర్ ప్రభుత్వ అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. సిక్కింలో ఆయన ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ సెంటర్ విద్యార్థినిపై లైంగిక దోపిడీకి పాల్పడినందుకు అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన పాట్నా ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారన్నారు. ఫిబ్రవరి 17న రాత్రి మహిళల హాస్టల్‌లో ప్రవేశించి ఈ ఘటనకు పాల్పడ్డారని ఫిర్యాదు చేయడంతో ఆయన్ను అరెస్టు చేశామన్నారు.

24న ఏఐఏడీఎంకే పత్రిక ప్రారంభం

చెన్నై : అధికార ఏఐఏడీఎంకే ప్రభుత్వం అధికారిక పత్రిక 'నమతు అమ్మ' (మన అమ్మ) పత్రికను మాజీ ముఖ్యమంత్రి జయలలిత 70వ జయంతిరోజైన ఫిబ్రవరి 24న ప్రారంభిస్తున్నారు. పార్టీ ముఖ్యకార్యాలయంలో ఆమె నిలువెత్తు విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నారు. ఏఐఏడీఎంకేకు స్వంత పత్రిక లేకపోవడంతో నమతు ఎంజీఆర్ దినపత్రికను కూడా ప్రారంభిస్తున్నామన్నారు. జయ టీవీ, శశికళ కుంటుంబం చేతుల్లోకి వెళ్లిపోవడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి పళనీస్వామి, ఉపముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంల పార్టీ పత్రికను ఆవిష్కరిస్తారని పార్టీ వర్గాలు వివరించాయి. ఆమె నిలువెత్తు విగ్రహాన్ని మజీముఖ్యమంత్రి ఎంజీఆర్ సమీపంలో నెలకొల్పుతామన్నారు.

నేడు ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారం

షిల్లాంగ్/ కోహిమా : ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయాల్లో ప్రధాని మోడీ గురువారం ర్యాలీలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 27న రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లో కాషాయ జెండా ఎగురవేసిన బీజేపీ పై రెండు రాష్ట్రాల్లో విజయం సాధించాలని పట్టుదలగా ఉంది. నాగాలాండ్‌లోని త్యున్‌సాంగ్‌లో బహిరంగ సభలో ప్రసంగిస్తారని ఆరాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాంగ్సులంగ్ వెల్లడించారు. అక్కడి నుంచి మేఘాలయలోని ఘరో హిల్స్ జిల్లాలో పర్యటిస్తారు. 1982 నుంచి మేఘాలయ కాంగ్రెస్ చేతిలో ఉంది.

దివ్యాంగులకు సబ్సిడీ పెంచండి : హైకోర్టు

చెన్నై : తమిళనాడులో అమ్మ పథకంలో మహిళా దివ్యాంగులకు పంపిణీచేస్తున్న ద్విచక్ర వాహనాలపై సబ్సిడీని మరో 25 శాతానికి పెంచాలని మద్రాసు హైకోర్టు ఆదేశించింది. ఆరాష్ట్రానికి చెందిన దివ్యాంగుల హక్కుల సంస్థ (టీఏఆర్ఏటీఏసీ) పిటిషన్ దాఖలు చేయడంతో జస్టిస్ కె. రవిచంద్రబాబు ప్రభుత్వాన్ని 8 వారాల్లో సబ్సిడీని 25శాతానికి పెంచాలని తీర్పు వెలువరించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన పథకంలో దివ్యాంగ మహిళా ఉద్యోగులకు 50 శాతం సబ్సిడీతో ద్విచక్రవాహనాలను అందిస్తోంది.



1956లో ఉన్న భూభాగాలను ఏపీలో కలపాలి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : 2014 విభజన చట్టంలో పొందుపరిచిన హక్కులను సాధించడంలో అన్ని రాజకీయ పక్షాలు పూర్తిగా విస్మరించి ఇప్పుడు కేంద్రం న్యాయం చేయలేదని ఆందోళన చేపట్టడం శోచనీయమని ఆంధ్రా జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ సుంకర కృష్ణమూర్తి అన్నారు. స్థానిక గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1956లో ఏ భూభాగాలైతే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారో ఆ భూభాగాలను 2014 విభజన చట్టం చేసినప్పుడు ఆంధ్రా ప్రాంతానికి ఇవ్వలేదని వాటిని తక్షణం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెంది ఇతర రాష్ట్రాలతో సమాన స్థాయికి వెళ్లగలుగుతుందన్నారు. అలాగే మిగిలిన అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తి స్థాయిలో అమలు చేసి నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుని ప్రస్తుతం వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఆందోళనలు చేస్తున్నారని, వీటిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. గతంలో ఆంధ్రాను విడదీయాలని తాము కోరినప్పుడు పలువురు తమపై నిందారోపణలు చేశారని, ఆనాడు చెప్పిన వాస్తవమే నేడు జరిగిందన్నారు. ఏపీకి రావలసిన విభజన హామీలను సాధించేందుకు మార్చి 1వ తేదీన ఢిల్లీలో పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామని, దీనికి అన్ని పక్షాల వారు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో దేవిరెడ్డి రవీంద్రరెడ్డి, షేక్ అహ్మద్ భాషా, ఇప్పర్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ అధ్యాపక పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర - ఏఎన్‌యూ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయనున్న అధ్యాపక పోస్టుల ఇంటర్వ్యూల ప్రక్రియ ఈ నెల 22 నుంచి 25వ తేదీవరకు జరుగుతుందని రిజిస్ట్రార్ ఆచార్య కె.జాన్‌పాల్ తెలిపారు. వర్సిటీ డైక్‌మన్ ఆడిటోరియంలో ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు ఇప్పటికే కాల్‌లెటర్‌లు పంపించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూల ప్రక్రియలో భాగంగా ప్రొఫెసర్ పోస్టులు 8, బ్యాక్‌లాగ్ పోస్టులు 8 చొప్పున భర్తీ చేయనున్నారు. విభాగాల వారీగా పరిశీలిస్తే ప్రొఫెసర్‌ల విభాగంలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ (18), అంబేద్కర్ ఛైర్ (19), తెలుగు (15), సోషియాలజీ (7), మాథమేటిక్స్(15), హిస్టరీ (6), బోటనీ అండ్ మైక్రో బయోలజీ (13), జువాలజీ (10) దరఖాస్తులు వచ్చాయి. వీటితోపాటు బ్యాక్‌లాగ్ పోస్టులలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో -11, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్-35, అసోసియేట్ ప్రొఫెసర్ (ఆంగ్ల విభాగంలో-2), అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల పోస్టుల విభాగంలో ఇంగ్లీష్-1, లా విభాగంలో-3, మాథ్స్-1 దరఖాస్తులు వచ్చాయి.



వర్గీకరణపై చంద్రబాబు కప్పదాటు వైఖరి

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : వర్గీకరణ విషయంలో చంద్రబాబు కప్పదాటు మాటలతో మాదిగలను మోసం చేస్తున్నారన్న విషయం గుర్తించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరు పోగు వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్న విజయవాడలో జరిగిన సభలో ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు ఇచ్చిన హామీ అమలుపై మాట్లాడతారని ఆశించాము.. కానీ వాటిపై మాట్లాడకుండా తమను మోసం చేశారన్నారు. వర్గీకరణపై కేంద్రం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకువెళ్లి ఒత్తిడి తీసుకువస్తారని ఇన్నాళ్లు ఆశించామని. కానీ ఆయన వ్యవహార శైలి చూస్తుంటే తమను దారుణంగా మోసం చేశారన్న విషయం అర్థమవుతుందన్నారు. కొంతమంది భజనపరుల చేత సభ జరిపించి మాదిగలు తమ వెంటే ఉన్నారని చెప్పుకోవడం శోచనీయమన్నారు. కాపులు, బ్రాహ్మణులు ఏమి చేశారని వాళ్లకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుతున్నా నిర్లక్ష్యంగా వ్యవ హరించడం తగదన్నారు. గత 24 సంవత్సరాలుగా మాదిగలు చేస్తున్న ఉద్యమాన్ని అణచాలని చూస్తే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. చంద్రబాబుకు, వై.ఎస్. జగన్‌కు ప్రత్యేక హోదా ఎంత ముఖ్యమో మాదిగలకు వర్గీకరణ కూడా అంతే ముఖ్యమన్నారు. రానున్న రోజుల్లో ఒక రాజకీయ శక్తిగా ఎదగడానికి మార్చి 1వ తేదీన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మేదర సురేష్ మాదిగ, సింగంపల్లి శ్రీను మాదిగ, ఓరుగ్లమూడి మార్కు మాదిగ, బూదాల శ్రీను మాదిగ, పల్లెపోగు ప్రసాద్ మాదిగ, పాల్వాయి దాసు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి-గుంటూరు ప్రత్యేక రైళ్లు

విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : హోసన్నా మినిస్ట్రీస్ ఉత్సవాలు గుంటూరులో జరుగుతున్న దృష్ట్యా విజయవాడ రైల్వే అధికారులు అనకాపల్లి - గుంటూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 07225గా ఈ నెల 28వ తేదీన అనకాపల్లిలో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.45 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలునెంబర్ 07226గా మార్చి 4వ తేదీన గుంటూరులో రాత్రి 10.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.50 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. ఈ రైలు తుని, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, స్టేషన్లలో ఆగుతుంది.

రూ.10 లక్షల ఖైనీ బాక్సుల పట్టివేత



విశాలాంధ్ర - భోగాపురం : విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 126 మిరాజ్ ఖైనీ బాక్సులను ఎస్ఐలు తారకేశ్వరరావు, మహేశ్‌లు బుధవారం స్వాధీనపరచుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సీఐ రఘువీర విష్ణు వివరాలు వెల్లడించారు. వ్యాన్ డ్రైవర్లు లోవరాజు, సూరిబాబు భువనేశ్వర్ నుంచి చేపలులోడు వేసుకుని కోల్‌కతాకు వెళ్ళారు. అక్కడ చేపలు అన్‌లోడ్ చేసి తిరుగుప్రయాణంలో కాకినాడలోని మహమ్మద్ అజీద్, మహమ్మద్ రసామాన్‌లు ఈ వ్యాన్‌లో రూ. 10 లక్షల విలువచేసే 126 మిరాజ్ ఖైనీ బాక్సులు లోడ్ చేసి భువనేశ్వర్ తరలిస్తున్నారు. ముందస్తు సమాచారంతో ఎస్సైలు తారకేశ్వరరావు, మహేశ్, హైవే పెట్రోలింగ్ సిబ్బంది కలిసి వాహనాన్ని పట్టుకుని ఖైనీ బాక్సులను స్వాధీనపర్చుకున్నట్లు చెప్పారు.

గ్రూప్-1లో హేమలతకు 2వ స్థానం



విశాలాంధ్ర - పార్వతీపురం : విజయనగరం జిల్లా పార్వతీపురం పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయంలో డివిజనల్ అకౌంట్స్ అధికారిగా పనిచేస్తున్న కనుగుల హేమలత గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించారు. ఈ మేరకు బుధవారం ఆమె తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. హేమలత మొదట ఇందిరా సాగర్‌లో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ విభాగంలో డీఏఓగా పని చేసి, పార్వతీపురం పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయానికి 2014లో బదిలీపై వచ్చారు. అలాగే సరికొత్తగా డిగ్రీ కాలేజి లెక్చరర్‌గా కూడా ఉద్యోగం సాధించారు. శ్రీకాకుళం జిల్లా కనుగులవానిపేట స్వగ్రామం. ప్రసాద్‌రావు, సుజాతలకు మూడో సంతానం. అక్క హైమావతి (ఆమదాలవలస) టీచర్‌గానూ, అన్నయ్య ఏఈఈగా (తెలంగాణ)లో పనిచేస్తున్నారు. ఇక భర్త తవిటినాయుడు ఫారెస్టు అధికారిగా నర్సీపట్నంలో పనిచేస్తున్నారు. రెండేళ్ల బాబు ప్రణవ్ ఉన్నాడు.

ఆగని ఎర్రచందనం రవాణా

కొనసాగుతున్న టాస్క్‌ఫోర్స్ వేట



విశాలాంధ్రబ్యూరో - నెల్లూరు : ప్రభుత్వం ఎన్నిచర్య లు తీసుకున్నా ఎర్రచందనం అక్రమరవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. జిల్లాలో ఎర్రచందనం విస్తారంగా ఉంది. ఉదయగిరి, ఆత్మకూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న అడవుల్లో ఎర్రచందనం చెట్లకు కొదవలేదు. పోలీసులు, ఫారెస్టు అధికారులు ఎన్ని ప్రణాళికలు రూపొందించినా అక్రమార్కులు వారి ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ ఎర్రబంగారాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఎర్రచందనం చెట్లను నరికి అక్రమంగా తమిళనాడులోని చెన్నై తరలించి అక్కడ విక్రయించడం దశాబ్దాలుగా అక్రమార్కుల పనిగా మారింది. ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ ఎర్రచందనం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేకంగా ఓ విభాగాన్ని ఏర్పాటుచేసి వేటను ముమ్మరం చేశారు. ఓఎస్‌డీ విఠలేశ్వరరావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసి తనిఖీలు, కూంబింగ్ నిర్వహిస్తున్నారు. అటవీప్రాంతాల్లో కూంబింగ్, జాతీయ రహదారిపై నిరంతర తనిఖీలు, చెక్‌పోస్టు వద్ద స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వ హించి ఎర్రచందనం స్మగ్లర్లను హడలెత్తించారు. వెంకటగిరి, మర్రిపాడు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో భారీగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల అంతర్రాష్ట్ర స్మగ్లర్లను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా ఎస్పీ ఏర్పాటు చేసిన 'టాస్క్‌ఫోర్సు' వేట కొనసాగుతోంది. ఇప్పటికే వందల సంఖ్యలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు నుంచి కూలీలను జిల్లాకు తీసుకొచ్చి వారితో పనులు చేయించే వ్యక్తులు దొరికినట్లు తెలిసింది. ఎర్రచందనం అక్రమ రవాణాకు నెల్లూరు అడ్డాగా మారింది. ప్రశాంతతకు మారుపేరైన నగరంలో పోలీసుల తనిఖీలు ఉండవని వీరు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. నెల్లూరు నుంచి చెన్నైకు, చెన్నై నుంచి నెల్లూరుకు వాహనాలను తిప్పుతూ సొమ్ములు చేసుకుంటున్నారు. ఒక్కో ట్రిప్పుసకు సాధారణంగా రూ.6 వేలు ఉండగా, ఎర్రచందన కూలీలు కావడంతో రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు తీసుకుంటున్నారు. ఇన్నోవా లాంటి వాహనాలు కావడంతో పోలీసులకు అను మానాలు రావని ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. దాంతో వీరి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇటీవల టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి పట్టుబడిన వారందరిలో నగరానికి చెందిన వారు ఒక్కరూ లేకపోవడం విశేషం. ఎర్ర చందనం అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసు లు తనిఖీలు నిర్వహిస్తే తప్ప.. అక్రమార్కులు దొరకడం లేదు. గతంలో తడ వద్ద చెక్‌పోస్టు ఉండేది. కానీ జీఎస్‌టీ వచ్చిన తరువాత దానిని తొలగించారు. పోలీసులు ఆదమరిస్తే.. అంతే సంగతులు... సరిహద్దులు దాటి పోయినట్లే. చెన్నై నుంచి నెల్లూరుకు కూలీలను దిగుమతి చేస్తున్న మూడు వాహనాలను బూదనం టోల్ ప్లాజా వద్ద నాలుగు రోజుల కిందట పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. దాంతో కార్లలో కూలీలను రవాణా చేస్తున్నారనే విషయం వెలుగులోకి వచ్చింది. నగరంలోని పలు ట్రావెల్స్ యజమానులు ఇలా అక్రమ రవాణాకు తెర లేపుతున్నారు. అక్రమార్కులతో సంబంధా లు పెట్టుకొని కూలీలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్సు బృందం కూపీ లాగుతోంది. కూలీల రవాణా వెనక ఎవరి హస్తం ఉందనేది విచారణ ప్రారంభించారు. ఎస్పీ ఎర్రచందనంపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేశారు. రోజూ ఏదొకచోట తనిఖీల్లో ఎర్రచందనం పట్టు బడుతూనే ఉంది. దీన్ని బట్టి చూస్తే అక్రమార్కులు ఎంత మేర విస్తరించి ఉన్నారో తెలుస్తోంది. టాస్క్‌ఫోర్సు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్మగ్లర్లను అదుపులోకి తీసుకుంది. చైనాకు చెందిన ఓయూ పుషు, నేపాల్‌కు చెందిన సోనమ్ టోప్‌జ్యాల్, రితు పాండే, టిబెట్‌కు చెందిన టెంపా అనే అంతర్జాతీయ స్మగ్లర్లను సైతం జైలుకు పంపించారు. టన్నుల కొద్దీ ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఎర్ర బంగారం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసినా అక్రమార్కులు మాత్రం ఆగడం లేదు. తమ పంథాను కొనసాగిస్తున్నారు. ఎలాగైనా రాష్ట్ర సరిహద్దులు దాటవేస్తూ ఇతర దేశాలకు పంపుతున్నారు. ఓ వైపు పోలీసుల వేట సైతం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది.

తక్షణం 'ఫీజు రీయంబర్స్‌మెంట్' చెల్లించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రంగన్న



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.రంగన్న అన్నారు. ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక అమర్‌భవన్‌లో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.నాగభూషణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రంగన్న పాల్గొని మాట్లాడుతూ 2017 విద్యాసంవత్సరం ముగుస్తున్నప్పటికీ ఇంతవరకూ పైసాకూడా విడుదల చేయకుండా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదన్నారు. 2017 విద్యాసంవత్సరానికి రావాల్సిన రూ. 1906 కోట్లు పెండింగ్‌లో పెట్టి బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులను విద్యకు దూరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతుందని అన్నారు. 2016-17 సంవత్సరాలకు సంబంధించిన రూ.2158 కోట్లు పెండింగ్‌లో ఉందని, వీటిని విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల ఫీజులు మొత్తం చెల్లించకపోతే ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు పరీక్ష హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, ఫీజులు కట్టలేక చదువుకు మధ్యలోనే స్వస్తి పలుకుతున్నారని అన్నారు. మరో పక్క ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించనందువల్ల కళాశాలలు మూతపడే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని, లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హరి, సిహెచ్ వెంకటేశ్, ప్రదీప్, సునీల్, వాసు, దిలీప్, రవి తదితరులు పాల్గొన్నారు

నేడు ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష



విశాలాంధ్ర - తిరుపతి (కార్పొరేషన్) : పాలక పార్టీ హామీల విఫలంపై ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షను చిత్తూరులో గురువారం తల పెట్టినట్లు కాంగ్రెస్ నేత సి.రామచంద్రయ్య వెల్లడించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా అంశంలో చంద్రబాబు తన నిజస్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. పవన్‌కల్యాణ్ ప్రజలపక్షమా? లేక మోడీ, బాబుల పక్షమా తేల్చి చెప్పాలని ప్రశ్నించారు. ఏపీలో నెలకొన్న పరిస్థితికి కాంగ్రెస్ పార్టీని ఎలా బాధ్యులను చేస్తారని అన్నారు. ఎన్నికల హామీల్లో బీజేపీ, టీడీపీ ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి, నేడు నాలుగు సంవత్స రాలు గడిచినా ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. ఆ రెండు పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. ఏ పార్టీతో కలిసి ప్రత్యేక హోదాపై పోరాటం చేస్తాడన్న విషయాన్ని జననేత అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టం చేయాలని కోరారు. హోదా సాధనకై పవన్ కళ్యాణ్ ప్రజల్లోకి రావాలని కోరారు. నేడు జరుపతలపెట్టిన ఆత్మగౌరవ దీక్షకు కాంగ్రెస్ రాష్ట్ర నేత రఘువీరారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ప్రమీలమ్మ, నైనారు శ్రీనివాసులు, పొలకల మల్లికార్జున, సావిత్రమ్మ పాల్గొన్నారు.

ఉపాధి ఎర !

మహిళలను మభ్యపెట్టి వ్యభిచార గృహాలకు తరలిస్తున్న ముఠాలు

విశాలాంధ్ర - చోడవరం : మహిళలను మభ్యపెట్టి, లోబరుచుకుని దేశ, విదేశాల్లోని వ్యభిచార గృహాలకు అక్రమ రవాణా పెద్దఎత్తున సాగుతోంది. ఏటా వందల మంది ముంబై, గోవా, కోల్‌కతా సహా ప్రధాన పట్టణాలు, నగరాల్లోని నరక కూపాలకు తరలిపోతున్నారు. జాతీయ నేర గణాంక నివేదికలోని అంశాల ప్రకారం మహిళల అక్రమ రవాణా అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2016లో దేశ వ్యాప్తంగా 4,941 మంది మహిళలను వ్యభిచారం కోసం అక్రమ రవాణా చేయగా, వారిలో 14.89 శాతం మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. గతేడాది మానవ అక్రమ రవాణాకు సంబంధించి రాష్ట్రంలో 239 కేసులు నమోదుకాగా, 355 మంది దాని బారినపడ్డారు. ఈ తరహా నేరాలకు సంబంధించిన ఘటనల్లో 2.94 శాతం ఏపీలోనే చోటుచేసుకున్నాయి. అక్రమ రవాణా ముఠాలు నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసుకొని గ్రామాల్లో పేదరికం, నిరక్షరాస్యత, ఉపాధిలేమితో బాధపడుతున్న వారిని గుర్తించి ఉపాధి పేరిట ఎర వేస్తున్నారు.

దశాబ్దాల కిందట ఆయా ప్రాంతాల నుండి ముంబై, గోవా, కోల్‌కతా తదితర ప్రాంతాలకు తరలివెళ్లి అక్కడ స్థిరపడిన బాధితులే ఇప్పుడు అక్రమ రవాణాదారుల అవతారమెత్తుతున్నారు. గతేడాది దాదాపు 44మంది మైనర్లను తరలించా రు. కొంతమంది ఏదో ఉపాధి లభిస్తుందనుకుని వెళ్లి, అక్కడ నరక కూపంలో చిక్కుకుపోతుండగా, మరికొంత మంది కుటుంబ సభ్యుల బలవంతంతోనే అందులోకి నెట్టబడుతున్నారు. మహిళల అక్రమ రవాణా కేసుల్లో అభియోగ పత్రాలు దాఖలు చేయడంలో ముందున్నప్పటికీ, దోషు లకు కచ్చితంగా శిక్షలు పడేలా చూడటంలో పోలీసులు విఫలమవుతు న్నారు. మరోవైపు ఈ నేరాల నియంత్రణపై పోలీసు యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపకపోవటం, ముఠాల కార్యకలాపాలపై నియంత్రణ లేకపోవడంతో దీని బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

రక్షణ రంగానికి ఏయూ కీలక సేవలు !

- దేశంలోనే ఏకైక డిఫెన్స్ స్టడీ సెంటర్‌గా గుర్తింపు
- కోర్సులు పూర్తిచేసుకున్న 2వేల మంది త్రివిధ దళాల సిబ్బంది

విశాలాంధ్ర - విశాఖసిటీ : విశాఖలోని ఆంధ్ర విశ్వ విద్యాలయం రక్షణరంగానికి తన సేవలను మరింత విస్తరించనుంది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న త్రివిధ దళాల సిబ్బందికి అనేక కోర్సులు అందించిన వర్సిటీ మరి న్ని కోర్సులు కూడా అందించడానికి సమాయత్త మైంది. గత ఏడాది డిఫెన్స్ సిబ్బందికి కోర్సులు ప్రారంభించినప్పటికీ వాటికి మంచి గుర్తింపు రావడంతో మరింత ఉత్సాహంగా మేధో సేవలను వారికి అందించడానికి అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్రస్తుతానికి వర్సిటీ లోని కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఫైర్ అండ్ సేఫ్టీ ఇంజనీరింగ్‌లో నాలుగు కోర్సులు, మెట్రాలజీ విభాగంలో డిజాస్టర్ మేనేజిమెంట్, యోగా, మెరైన్ ఇంజనీరింగ్ విభాగంలో కోర్సు, మెరైన్ ఎలక్ట్రికల్ అండ్ నేవిగేషన్, ఫిజిక్స్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎయిర్‌ఫోర్స్ అధికారులకు ఫారిన్ లాంగ్వేజీలలో శిక్షణ తదితర విభాగాలలో కోర్సులు అందిస్తున్నారు. ఆయా కోర్సుల్లో ఇప్పటికే త్రివిధ దళాలకు చెందిన 2 వేల మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. జమ్మూకాశ్మీర్, అస్సాం, పంజాబ్, మద్రాస్, ఢిల్లీ, రాజస్థాన్ తదితర ప్రాంతాల్లోని ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, నేవీ సిబ్బంది ఈ కోర్సుల్లో శిక్షణ పొందారు. దీంతో పాటు భూటాన్ దేశ సైనికులకు కూడా ఇటీవల పలు కోర్సుల్లో శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. నేపాల్ దేశ సైనికులకు సైతం విపత్తు నిర్వహణలో శిక్షణ ఇవ్వాల్సిందిగా అక్కడి అధికారులు వర్సిటీ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. డిఫెన్స్ (రక్షణ) రంగాలకు చెందిన త్రివిధ దళాల సిబ్బందికి పూణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్మ్‌డ్ టెక్నాలజీ విద్యా సంస్థ ఒక్కటే ఇప్పటి వరకు కోర్సులు నిర్వహిస్తుండగా ఇప్పుడు ఏయూ కూడా కోర్సులు నిర్వహిస్తోంది.

వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆమదాలవలస : సమస్తం త్యాగంచేసిన వంశధార నిర్వాసితులపై చంద్రబాబు సర్కార్ చిన్నచూపు చూస్తున్నదన్న విషయం బట్టబయలైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. వంశధార నిర్వాసితులకోసం పోరాటం చేసినప్పటికీ తప్పుడు కేసులు బనాయించారని, అందుకు కోర్టుకు హాజరయ్యానన్నారు. నిర్వాసితుల కోసం కేటాయించిన స్థలాన్ని మధు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడమే తప్ప, వాస్తవానికి రాష్ట్ర ప్రజలకు ఏమాత్రం న్యాయంచేసే యోచనలో ప్రభుత్వంలేదని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రత్యేక హోదాకోసం వామపక్షాలు, ప్రజాసంఘాలు ఉద్యమిస్తుంటే, బాబు మాత్రం ముడుపుల కోసం ఉద్యమిస్తున్నాడన్నారు. తక్షణమే ప్రత్యేక హోదా కోసం పోరాటానికి సిద్ధంకావాలని, అన్ని పార్టీల నేతలతో చర్చలు జరిపి, హోదాకోసం ఉద్యమించాలన్నారు.

కాంట్రాక్టు సిబ్బంది సమ్మెతో విద్యుత్‌శాఖ అప్రమత్తం

- ట్రాన్స్‌కో, డిస్కం సిబ్బంది సెలవుల రద్దు
- సరఫరాలో అవాంతరాలు లేకుండా చర్యలు
- టెలికాన్ఫరెన్స్‌లో ట్రాన్స్‌కో జేఎండీల ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ కాంట్రాక్టు సిబ్బంది సమ్మెతో విద్యుత్‌శాఖ అప్రమత్తమైంది. సమ్మె దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాటను చేసేందుకు సిద్ధమైంది. అవసరమైన చోట్ల ఏజెన్సీల ద్వారా నైపుణ్యం కలిగిన వారి సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించింది. సబ్‌స్టేషన్లు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోనుంది. కాంట్రాక్టు కార్మికులు మంగళవారం నిరవధిక సమ్మెకు పిలుపునివ్వడంతో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె విజయానంద్ నేతృత్వంలో బుధవారం విద్యుత్ సౌధ నుంచి రాష్ట్రంలోని సీఈలు, ఎస్ఈలతో ఏపీ ట్రాన్స్‌కో సంయుక్త ఎండీలు దినేష్ పరుచూరి, పి ఉమాపతి టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో అసౌకర్యం కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికారులు వారికి వివరించారు. ట్రాన్స్‌కో, డిస్కంలలో పనిచేసే సిబ్బంది సెలవులను రద్దు చేసుకొని తక్షణమే విధుల్లోకి చేరే విధంగా చూడాలన్నారు. కాంట్రాక్టు సిబ్బంది విధులకు గైర్హాజరైన చోట్ల అవసరమైన సిబ్బందిని ఏజెన్సీల ద్వారా తక్షణమే నియమించుకోవాలని ఆదేశించారు.పదవీ విరమణ చేసిన ఇంజనీర్లు, సిబ్బంది సేవలను కూడా వినియోగించు కోవాలన్నారు. సబ్‌స్టేషన్లలో అవసరమైన విద్యుత్ పరికరాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎత్తిపోతల పథకాలు (లిఫ్ట్ ఇరిగేషన్) వద్ద పని చేసే సిబ్బంది సేవలను కూడా వినియోగించుకోవాలని, విద్యుత్ సబ్‌స్టేషన్ల భద్రతకు సమీపంలోని పోలీసుల సహకారాన్ని కోరాలన్నారు. శాంతిభద్రతల పరంగా ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసుశాఖ సహకారంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కార్యదర్శి సత్యవాణి, సీఈ ట్రాన్స్‌మిషన్ సుధారాణి పాల్గొన్నారు.



కనీస వేతనాలు పెంచాలని సీఎంకు వినతి

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో ప్రైవేటు సంస్థల్లో, ఫ్యాక్టరీల్లో, షాపుల్లో పని చేస్తున్న వారికి కనీస వేతనాలు 2011లో విడుదల చేసిన జీవో ప్రకారం ఇవ్వాలని ఆశ్రం మెడికల్ అండ్ హాస్పటల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ) నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ అధ్యక్షుడు కె కృష్ణమాచార్యులు మాట్లాడుతూ కనీస వేతనాల బోర్డు ఛైర్మన్‌గా డొక్కా మాణిక్యవర ప్రసాద్‌ను 2011లో నియమించారు. అప్పట్లో రాజీనామా చేయడం వల్ల 12 లక్షల మంది కార్మికులు నష్టపోయారని సీఎం దృష్టికి తెచ్చారు.

కొత్త బోర్డును నియ మించాలని, హాస్పటల్‌కు సంబంధించి డయాల సిస్ టెక్నీషియన్స్ జీవో పొందుపర్చలేదని, స్టాఫ్ నర్సులకు ఏఎన్ఎం కంటే తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని, ఎసీ టెక్నీషియన్స్, థియేటర్ అసిస్టెంట్ డిజిగ్నేషన్స్ పొందుపర్చాలని కోరగా బోర్డు ఏర్పాటుకు సీఎం అంగీకరించారని కృష్ణమాచార్యులు తెలిపారు. కార్యదర్శి కె అప్పారావు, ఉపాధ్యక్షురాలు ఇందుమతి, సహాయ కార్యదర్శులు ఎస్ సురేష్ కుమార్, నరేష్ ఉన్నారు.

మోడీ పాలన కుంభకోణాలమయం

- మూడేళ్లలో 5లక్షల కోట్ల బ్యాంకు దోపిడీ
- బీజేపీ, టీడీపీలపై సమష్టి పోరాటం
- చిత్తూరు బహిరంగసభలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో, తిరుపతి : కేంద్రంలోని ఎన్డీయే పాలనలో దేశం మొత్తం అవినీతి, కుంభకోణాలతో రాజ్యమేలుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. మూడేళ్లలో 5లక్షల కోట్ల రూపాయలు బడాబాబులు బ్యాంకులకు ఎగ్గొట్టి నిలువుదోపిడీ చేశరన్నారు. సీపీఐ చిత్తూరు జిల్లా 22వ మహాసభలు బుధవారం చిత్తూరులో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ నుంచి హైరోడ్డు మీదుగా గాంధీ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో జనసేవాదళ్, ప్రేక్షక వాలంటీర్లు, కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పార్టీ కార్యకర్తలు ఎర్రదండును తలపించేలా ర్యాలీలో కదం తొక్కారు. అనంతరం జిల్లా కార్యదర్శి కె.రామానాయుడు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ వేలకోట్లు బ్యాంకులకు ఎగనామం పెట్టేసిన వారికి నరేంద్రమోడి వత్తాసుపలుకుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రశ్నించే వారిని జైలులో పెడుతున్నారని బరితెగించి భజరంగదళ్, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు మట్టుపెడుతున్నారని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు 15 సంవత్సరాల ప్రత్యేక హోదా కావాలని డిమాండు చేసిన బీజేపీ నేడు ఎందుకు రాష్ట్రాన్ని పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న టీడీపీ, బీజేపీ రాజకీయ నాటకాలు ఆడుతున్నాయన్నారు. అఖిలపక్ష సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు హోదా సాధన కోసం తీసుకెళ్తున్నారా...? లేదా ప్యాకేజీ కోసం వెళ్తున్నారో స్పష్టం చేయాలని కోరారు. రాష్ట్రంలో అన్ని రంగాల ప్రజలు అసంతృప్తితో రగిలిపోయి రోడ్లపైకి వస్తున్నారన్నారు. రాజమౌళి బాహుబలి చిత్రం తరహాలో రాజధాని నిర్మించాలనుకోవడం చంద్రబాబు కలే అన్నారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హామీలన్నీ అమలయ్యే వరకు పోరాటం సాగిస్తామని నారాయణ చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు బీజేపీ తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదా 15 సంవత్సరాలు కావాలన్న చంద్రబాబు నాయుడు నేడు ప్యాకేజీలకు, కమీషన్లకు లాలూచిపడ్డారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఓటు బ్యాంకు లేనందువల్లే హోదా ఇవ్వడంలేదన్నారు. వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తామని చెప్తే టీడీపీ వారు మార్చి 5నే రాజీనామా చేస్తామని నాటకాలు ఆడుతున్నారే తప్ప నరేంద్ర మోడీపై పోరాడేందుకు ఇరుపార్టీలు సిద్ధంగా లేదన్నారు. సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు, మాజీ ఎంఎల్‌సి పీజే చంద్రశేఖరరావు మాట్లాడుతూ దేశంలో దోచుకున్న డబ్బును విదేశాల్లో దాచుకునేందుకు బడాబాబులు పేర్లు మార్చుకొని విదేశాల్లో విహార యాత్రలు చేస్తున్నా మోడీ వారికి వత్తాసుపలుకుతున్నారన్నారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తల ఆగడాలు ఎక్కువయ్యాయని, దళితులపై దాడులు చేస్తూ, సోషియల్ మీడియాలో ప్రచారాలు చేస్తున్నారని, వారి ఆగడాలకు అడ్డుకట్టవేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యం కావాలని కోరారు.

కేంద్రంపై పోరాడతాం...

సాధికారమిత్రల సమావేశంలో చంద్రబాబు.



విశాలాంధ్ర అమరావతి : రాష్ట్ర సంక్షేమం కోసం కేంద్రంపై పోరాటం కొనసాగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. ఉండవల్లిలోని సీఎం ఇంటి దగ్గర గ్రీవెన్స్ భవనంలో సాధికారమిత్రలతో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వానికి, ప్రజలకి వారధులు సాధికార మిత్రలని చంద్రబాబు అన్నారు. పేదవారిని ఆదుకోవాలని, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. జన్మభూమి తర్వాత ప్రభుత్వం తీసుకువచ్చిన వినూత్న కార్యక్రమం సాధికార మిత్ర అని వివరించారు. నేడు ప్రతి పట్టణ, గ్రామ పంచాయితీలలో స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా సంఘాలు, సాగునీటి సంఘాలున్నాయని, గ్రామాల్లో అనేక విభాగాల అధికారులున్నారని అన్నారు. సమాజంలో మహిళలకు సముచిత స్థానం ఉండాలని, మహిళలు ఇతరులపై ఆధార పడి జీవించే పరిస్థితి పోవాలని ఆకాంక్షించారు. ఎవరికైనా పెన్షన్లు రాకున్నా, ప్రభుత్వ పథకాలు సరిగ్గా అమలు జరగకున్నా పరిష్కార వేదిక ద్వారా 1100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచన చేశారు. భవిష్యత్తులో రాయలసీమను రతనాల సీమగా తయారు చేస్తామని స్పష్టం చేశారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని, 19 లక్షల గృహాలు నిర్మించి రూ. లక్షా 50 వేల సహాయం చేస్తు న్నామని తెలియ చేశారు. పౌష్టికాహారం కుటుంబా నికంత టికీ అందిస్తే అనారోగ్య సమస్యలు రావని, మీరంతా ఒక్కొక్కరు మీ చుట్టుపక్కన 35 కుటుంబాలను చైతన్యపరిచే బాధ్యత తీసుకోవాలని అన్నారు. 125 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్‌ను చిత్తు చిత్తుగా ఓడించారని, ఆంధ్రుల కసి తనకు తెలుసునని అన్నారు. కేంద్రం సహకరించక పోయినా తాను కష్టపి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో ఇంకా ముందుకు వెళతామని, అభివృద్ధి సాధిస్తామని వ్యాఖ్యానించారు. 2029 నాటికి దేశంలో అభివ ృద్ధి చెందిన నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీని మారుస్తామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

- హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి
- భారీగా పెనాల్టీలు, వేగ నివారణకు స్పీడ్ గన్‌లు
- రోడ్డు భద్రతా సమావేశంలో సీఎస్ దినేష్‌కుమార్



విశాలాంధ్రబ్యూరో- అమరావతి : రాష్ట్రంలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వారి నుంచి భారీగా అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులు, సీటు బెల్ట్ పెట్టని నాలుగు చక్రాల వాహనదారులతోపాటు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి కూడా భారీగా పెనాల్టీలు విధించాలని పోలీసుశాఖకు ఆయన సూచించారు. వెలగపూడిలోని సచివాలయంలో రోడ్డు భద్రతా సమావేశం బుధవారం జరిగింది. హోం, అర్ అండ్ బీ, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ తదితరశాఖల ఉన్నతాధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై దినేష్ కుమార్ చర్చించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివా రణ చర్యలు చేపట్టేందుకు వీలుగా రూ.10 కోట్లను కేటా యించారు. వీటిలో రూ.2 కోట్లను ఆయా జిల్లాల రోడ్డు భద్రతా కమిటీలకు కేటాయించాలని, మిగిలిన రూ.8 కోట్లతో ప్రమాదాల నివారణా పరికరాల కొనుగోలుకు వినియోగించాలని తీర్మానించారు. రోడ్డు ప్రమాదాలలో శ్రీకాకుళం, విజయనగరం, కడప జిల్లాలు రాష్ట్రంలోనే ఎక్కువగా జరుగుతున్నట్లు గణాంకాల ఆధారంగా వెల్లడిం చారు. జిల్లాల వారీగా ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు, ఆయా జిల్లాల్లో చేపడుతున్న నివారణ చర్యలను సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు.పలు ప్రమాదాలకు సంబంధించిన ఫోటోలతో ప్రదర్శన ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.

ప్రమాద ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు

రాష్ట్రంలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అతివేగం నివారణకు స్పీడ్ గన్‌లను వినియోగించాలని అధికారులకు సూచించారు. అన్ని జిల్లాల్లో స్పీడ్ గన్‌లు ఉన్నప్పటికీ సరిగా పని చేయకపోవటంతో వినియోగించటంలేదని అధికారులు తెలియజేశారు. తక్షణమే వాటికి మరమ్మతులు చేపట్టాలని, తరచూ శిథిలమవుతున్న రోడ్లను ఎప్పటిక పుడు మరమ్మతులు చేయాలని ఆర్ అండ్ బీ, పంచా యతీరాజ్ అధికారులకు సూచించారు. జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన రోడ్డు భద్రతా కమిటీల సమావేశాలు క్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలకు కేటాయించిన రూ.2 కోట్లను పలుశాఖలకు తగిన విధంగా కేటాయింపులు చేయాలన్నారు. ఈ సమావేశంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ, వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలి



విశాలాంధ్ర-అమరావతి:నీతి ఆయోగ్‌ను సాకుగా చూపి కేంద్రం ప్రత్యేకహోదా ఇవ్వలేదని మంత్రి సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విధిలేని పరిస్థితుల్లోనే ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నామని సోమిరెడ్డి అన్నారు. 11 రాష్ట్రాలకు ప్రత్యేక హోదా పొడిగించినందున ఏపీకి కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని మంత్రి సోమిరెడ్డి డిమాండు చేశారు. వైసీపీ నేతలు ఢిల్లీలో కాళ్లు పట్టుకుని ఇక్కడ ఫోజులు కొడుతున్నారని సోమిరెడ్డి మండిపడ్డారు. మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి సోమిరెడ్డి అన్నారు. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు పాత్ర లేదని మంత్రి అన్నారు. బడ్జెట్‌ను భగవద్గీతతో పోల్చిన సాక్షి మీడియా ఇప్పుడు మమ్మల్ని విమర్శిస్తుందన్నారు. నిధులు రాకపోతే నిలదీయాల్సింది కేంద్రాన్నా?, టీడీపీనా? అని సోమిరెడ్డి ప్రశ్నించారు. విజయసాయి రెడ్డి తప్పుడు సలహాల వల్లే జగన్ జైలుకెళ్లారని , ఐఏఎస్‌సతీష్ చంద్ర, ఐపీఏస్ వెంకటేశ్వరావు గురించి దారుణంగా మాట్లాడటం సరికాదన్నారు.ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బెదిరించడాన్ని ఆయన తప్పుబడుతూ ఆయన మంచి వ్యక్తన్నారు. ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిని జైల్లో పెట్టించిన ఘనత మీదని ఇప్పటి వరకు 12 మంది ఐఏఎస్ అధికార్లు వైసీపీవల్ల నష్టపోయారన్నారు.

అంతిమ పోరాటానికి కలిసి రండి

పీసీసీ చీఫ్ ఎన్.రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదే శ్‌కు ప్రత్యేక హోదా, నాటి ప్రధాని హామీలు, విభజన చట్టంలోని అంశాల సాధన కోసం అంతిమ పోరాటానికి సిద్ధమవుదామని పీసీసీ చీఫ్ డాక్టర్ రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు.ఈ మేరకు బుధవారం అన్ని పార్టీల రాష్ట్ర నేతలకు ఆయన బహిరంగ లేఖలు రాశారు. కేంద్రం ప్రకటించిన 5వ బడ్జెట్ లోనూ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రజలంతా ఆవేదన చెందుతున్నారన్నారు. మార్చిలో నిర్వహించ బోయే పార్లమెంట్ సమావేశాల్లోనే పార్టీలకు అతీతంగా ఐక్యపోరాటం చేసి హక్కులను సాధించుకోవాల్సి ఉందని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ, ప్రజాపక్షాలు పార్లమెంట్ లోపల, బయట సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సూచించారు. చలో పార్లమెంటు పేరిట మార్చి 6,7,8 తేదీల్లో ఢిల్లీ కేంద్రంగా కాంగ్రెస్ ఉద్యమానికి సిద్ధమవుతోందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు ఈ ఉద్యమానికి మద్దతి వ్వాలని కోరారు.ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్య క్షులు కిమిడి కళా వెంకట్రావ్, వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె.హరిబాబు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు జయ ప్రకాష్ నారాయణ్, ఏపీ మేథావుల ఫోరమ్ రాష్ట్ర నాయకులు చలసాని శ్రీనివాస్‌కు ఆయన లేఖలు రాశారు.

హోదా వచ్చే వరకూ మోడీ, బాబులను నిద్రపోనివ్వం

రౌండ్ టేబుల్‌లో రాజకీయ, ప్రజాసంఘాల నేతల హెచ్చరిక



విశాలాంధ్ర-విజయనగరం మున్సిపాలిటీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వచ్చేవరకు మోడీ,బాబులను నిద్రపోనివ్వమని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, పలు ప్రజా సంఘాలు ముక్త కంఠంతో తీర్మానించాయి. బుధవారం విజయనగరం పట్టణంలోని జగన్నాథ ఫంక్షన్ హాలులో ఏపీకి ప్రత్యేక హోదా-విభజన హామీల సాధన సమితి జిల్లా కన్వీనర్ పి.కామేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మాట్లాడారు. ముందుగా వైసీపీ విజయనగరం పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రవిభజన బిల్లులో రూపొందించిన ప్రత్యేక హోదాకై తమ నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని ఈ పరిస్థితులలో పోరాటమే శరణ్యమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో నిర్ణయించిన కార్యక్రమాలు జిల్లాలో సంఘటితంగా పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కావలసిన అంశాలను ప్రస్తావించారు. మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ మేధావిగా చెప్పుకు తిరిగే సీఎం చంద్రబాబు వలన ప్రత్యేక హోదా దక్కకుండా పోతుందని ఎద్దేవా చేశారు. లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ ప్రత్యేకహోదా కోసం ప్లకార్డులు పట్టుకొని పార్లమెంటులో నినాదాలిచ్చిన ఎంపీలు ప్రధాని మోడీని చూచి పరారై పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ చంద్రబాబుకి ఒక విధానమంటూ లేక సందిగ్ధంలో ఉన్నారన్నారు. సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజీ రెండూ అవసరమంటూ వాటిని సాధించే వరకు పోరాడలన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుంగ భానుమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 2014లో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ విభజన చట్టంలో పెట్టిన హామీలన్నీ నెరవేరేవరకు పోరాటం చేస్తామన్నారు. ఎన్‌జీఓ నేత ప్రభూజీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రకటించిన సుజల స్రవంతి వెనక్కు పోయే పరిస్థితి నెలకొంద, నీటి ప్రాజెక్టులు పూర్తికావాలంటే ప్రత్యేకహోదా అవసరమన్నారు. ఈ సమావేశంలో వైసీపీ కేంద్ర పాలక మండలి సభ్యులు పి.సాంబశివరాజు, వైసీపీ జిల్లా సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను), పార్టీ నాయకులు పిళ్ళా విజయకుమార్, కె.వి.సూర్య నారాయణరాజు, అవనాపు విజయ్,అంబళ్ల శ్రీరాములునాయుడు, పీవీవీ సూర్యనారాయణరాజు, ఎంఎల్ఎన్ రాజు,పెద్దింటి అప్పారావు, త్రినాథ్‌ప్రసాద్, డోల మన్మథకుమార్, జనసేన నేత త్యాడ రామకృష్ణ, బీవప్పీనేత పీవీ రమణ, జర్నలిస్టు సంఘాల నాయకులు ఎంఎంఎల్ నాయుడు, మహాపాత్రో, మద్దిల సోంబాబు, వామపక్షాల నేతలు మద్దె మాణిక్యం, భాయి రమణమ్మ, జగదాంబ, సీపీఐ జిల్లా నాయకులు ఒమ్మి రమణ, ఆర్‌వీఎస్ కుమార్‌లతో పాటు పలువురు రాజకీయ,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేల అరెస్టు

న్యూఢిల్లీ : ఆప్ ఇద్దరు ఎమ్మెల్యేలు అమాంతుల్లాఖాన్, ప్రకాష్ జర్వాల్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ప్రధాన కార్యదర్శి (సీఎస్) అన్షు ప్రకాష్‌పై వారు దాడికి పాల్పడి నందుకు అరెస్టు చేశామని బుధవారం పోలీసు అధికారి వెల్లడించారు. సోమవారం రాత్రి కేజ్రీవాల్ ఇంట్లో సోఫాపై కూర్చొని ఉండగా, ఎలాంటి వాగ్వివాదాలు లేకుండానే అమాంతుల్లాఖాన్, ప్రకాష్ తల, కణతలపై పిడిగుద్దులు గుద్దారని ప్రకాష్ పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ప్రకాష్ ,ఖాన్‌ను అరెస్టు చేసి తీస్ హజారీ కోర్టులో ప్రవేశపెట్టామ న్నారు. సీఎస్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఆప్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఢిల్లీ పోలీసులు కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నారని ఖాన్ విమర్శించారు. ఆప్ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేయాలని కాంగ్రెస్, బీజేపీలు డిమాండు చేస్తున్నాయని అయితే ఆప్ మంత్రిపై దాడిచేసినా, కార్యకర్తలను కొట్టినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఖాన్ విలేకరులకు వివరించారు. రేషన్ పంపిణీపై చర్చించాలని పిలిపించి మీడియా ప్రకటనల విషయం మాట్లాడి తనపై దాడికి పాల్పడ్డాంని సీఎస్ వెల్లడించారు. ఈ ఘటనపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బాయిజాల్ నుంచి హోంమంత్రిత్వ శాఖకు నివేదిక అందిందన్నారు. దీనిపై విచారణ చేపట్టామన్నారని, నేరపూరిత కుట్రకోణం దాగుందనే విషయంపై ఢిల్లీపోలీసులు దర్యాప్తు చేపట్టారని మంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు. ఢిల్లీ ప్రభుత్వానికి బ్యూరోక్రాట్లకు మధ్య ఉన్న సంబంధాలపై ఆరా తీస్తున్నామన్నారు. బాధితుడికి న్యాయం జరుగుతుందని రాజ్‌నాథ్ సింగ్ భరోసా ఇచ్చారు. మంగళవారం ఐఏఎస్, గ్రూప్‌ఒన్ అధికారులు రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. అత్యున్న తాధికారులు నిర్భయంగా విధులు నిర్వహించడానికి తగిన వాతావరణం కల్పించాలని ఆయనను కోరారు. ఈ దాడి ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిందని, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి సిసోదియా ఎదురుగానే ఈ దాడి జరిగిందన్నారు. ఐఏఎస్, అండమాన్ నికోబార్ ద్వీపాలకు చెందిన సివిల్ సర్వీ అధికారులు (డీఏఎస్‌ఐసీఎస్) రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అపాయింట్‌మెంటును కోరారు. ఈ అధికారులు మంగళవారం రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన విషయం తెలిసిందే. దాడికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ ఐఏఎస్ అసోసియేషన్ కార్యదర్శి నిషా సక్సేనా డిమాండు చేస్తున్నారు. ఈ విషయంపై చర్చించేందుకు బుధవారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఢిల్లీలోని వేర్వేరు శాఖల్లో 70 మంది ఐఏఎస్‌లు, 400 మంది డీఏఎస్‌ఐసీఎస్‌లు పనిచేస్తున్నారన్నారు. దాడికి గురైన సీఎస్ 1986 ఐఏఎస్ క్యాడర్‌కు చెందినవారన్నారు. అయితే ఇవన్నీ నిరాధార ఆరోపణలని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు కొట్టిపారేశారు.



దర్శకుడు వర్మను అరెస్టు చేయాలి

మహిళానేతల డిమాండు

విశాలాంధ్ర-విశాఖపట్నం: మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన దర్శకుడు రాంగోపాల్‌వర్మను అరెస్టు చేయాలని మహిళాసంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండు చేశారు. బుధవారం విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షలను సామాజిక వేత్త దేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ రాంగోపాల్‌వర్మ చేతలు, వాఖ్యలు శిక్షింపదగినవన్నారు. మహిళలు అసభ్యంగా చూపుతూ ఇదే నాగరికతని, మహిళలకు లైంగిక స్వేచ్ఛ కావాలని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వర్మను తక్షణమే ప్రభుత్వం అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఐక్యవేదిక నాయకురాలు ఎ.విమల మాట్లాడుతూ స్త్రీలను లైంగిక వస్తువులుగా చూడటంతో మహిళలపై హింస మరింత పెరుగుతుందన్నారు. మహిళా నాయకులను రామ్‌గోపాల్‌వర్మ నోటికి వచ్చిన విధంగా కించపరిచే రీతిలో కామెంట్స్ చేయడం దారుణమన్నారు. దీనిపై తెలంగాణా ప్రభుత్వం స్పందించి రామ్‌గోపాల్‌వర్మను అదుపులోకి తీసుకొని పాస్‌పోర్టు సీజ్ చేసిందని, కాని ఏపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఐక్యవేదిక నాయకురాలు మణి మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని వక్రీకరించి మాట్లాడిన వర్మపై చర్యలు తీసుకునేవరకు నిరసన కొనసాగు తుందన్నారు. ఆయన అనుచరులతో నిత్యం సోషల్ మీడియాలో బూతులతో పోస్టింగ్‌లు పెడుతున్నారన్నారు. వీటిని నిరోధించే చర్యలు పోలీసు అధికారులు గాని, జిల్లా యంత్రాంగం గాని తీసుకోవడంలేదని దుయ్యబట్టారు. దీనిపై యావత్ మహిళాలోకం మండిపడుతుందన్నారు. ఈనెల 23న విశాఖలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులోపు ప్రభుత్వం వర్మను అరెస్టు చేసి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. ఈ దీక్షా కార్యక్రమంలో మహిళా సంఘాల నేతలు మాధవి, ద్రాక్షాయని, ప్రభావతి, ఎం.లక్ష్మి, పరమేశ్వరి, బిమలమ్మ, వెంకటి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ సమీపానికి పాక్ హెలికాప్టర్

న్యూఢిల్లీ : జమ్మూ-కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) సమీపంలో పాకిస్థాన్ హెలికాప్టర్‌ను కనుగొన్నారు. పూంచ్ సెక్టార్‌లో పాక్ ఆక్రమిత భూభాగంలో ఎల్‌ఓసీకి 300 మీటర్ల దూరంలో పాకిస్థాన్ సైనిక హెలికాప్టర్‌ని కనుగొన్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ హెలికాప్టర్ వచ్చినప్పుడు రెండు పక్షాల నుంచి ఎటువంటి కాల్పులు లేదా కవ్వింపు చర్యలు చోటు చేసుకోలేదని వారు చెప్పారు. ఉదయం 9.45, 10 గంటల మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నదని తెలిపారు. ఇరుపక్షాలు పెట్టుకున్న నిబంధనల ప్రకారం ఎల్‌ఓసీకి కిలోమీటరు దూరం వరకు రోటరి వింగ్ హెలికాప్టర్లు రాకూడదు. ఫిక్స్‌డ్‌వింగ్ హెలికాప్టర్లు 10 కిలోమీటర్లలోపు రాకూడదు. ఆ తరువాత హెలికాప్టర్ వెనుకకు వెళ్లిపోయిందని వర్గాలు తెలిపాయి. ఇది గగనతల ఉల్లంఘన కాకపోయినప్పటికీ, ఇరు దేశాలు కుదుర్చుకున్న ఒప్పంద ఉల్లంఘనేనని తెలిపాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ అధికారుల దృష్టికి తీసుకువెళతామని అధికారవర్గాలు తెలిపాయి.

సైకిలెక్కిన మంత్రి మాణిక్యాలరావు

విశాలాంధ్ర-అమరావతి: దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి పైడికొండల మాణి క్యాలరావు సైకిలెక్కారు. బుధవారం సచివాలయంలో ప్రభుత్వం ఉద్యోగులు, సంద ర్శకుల కోసం ఏర్పాటు చేసిన స్మార్ట్ బైక్ సైకిల్ తీసుకొని సచివాలయంలో చక్కర్లు కొట్టారు. సరదాగా సైకిల్ తొక్కుతూ అక్కడున్న వారిని పలకరించుకుంటూ తిరిగారు.

మీలో ఒకడిని

(మొదటిపేజీ తరువాయి)

ఆయన తన పార్టీ పేరు, జెండాను వేలాది మంది అభిమానుల మధ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. తెలుపు రంగు జెండాలో ఎరుపు, నలుపు రంగు మిళితమైన ఉన్న జెండాను కమల్ ఆవిష్కరించారు. చేయి చేయి కలిపి ఉన్నట్లు ఈ జెండాలో ప్రధానంగా కనిపిస్తోంది. ఈ కార్యక్రమానికి న్యూఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొత్త పార్టీ పేరును కమల్ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. ఎంఎన్ఎం పేరుతో తన పార్టీ అధికారిక వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఇదే పేరుతో ఫేస్‌బుక్, ట్విటర్‌లోను ఖాతాలను తెరిచారు.

మీ చేతిలో ఉపకరణాన్ని.. కమల్

కొత్త పార్టీని పెట్టినందుకుగాను పలువురు వేదికపైకి వచ్చి కమల్‌కు అభినందనలు తెలిపారు. వేదికపైకి వచ్చిన వారందరినీ కమల్ ఆత్మీయంగా ఆలింగనం చేసుకొని నవ్వుతూ పలకరించారు. పార్టీ పేరు ప్రకటించేముందు కొద్దిసేపు కమల్ మాట్లాడారు. పార్టీ ఏర్పాటు తనకు ఎన్నో ఏళ్ల లక్ష్యమన్నారు. 'ఇది మీ పార్టీ. ప్రజల పార్టీ. నేను ఇందులో ఓ భాగం మాత్రమే. ఇక్కడకు వచ్చిన చాలా మంది నాయకుల ముఖాలను నేను చూశాను. ఇక్కడికి వచ్చింది నేను మీరు చెప్పేది వినడానికి. మీకు నేనేదో చెప్పడానికి కాదు. ప్రజలకు సలహాలు చెప్పే నాయకుడిని కాదు. ప్రజల నుంచి సలహాలు తీసుకునే వ్యక్తిని. ఈ ఒక్కరోజుతోనే కార్యక్రమం ఆగిపోదు. నేను నాయకుడిని కాదు.. ప్రజల చేతిలో ఉపకరణాన్ని. మీకు సేవ చేసేలా నన్ను మార్గదర్శనం చేయండి. నేడు రాష్ట్రం అవినీతితో రగిలిపోతోంది. నేను ఉపన్యాసాలు ఇవ్వడానికి ఇక్కడికి రాలేదు. మీ సలహాలు తీసుకునేందుకు వచ్చాను. అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే నా అభిమతం' అని కమల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

భారత మాజీ కోచ్‌పై పాక్ కన్ను



కరాచీ: భారత మాజీ కోచ్‌పై పాకిస్థాన్ కన్నేసింది! కామన్వెల్త్ క్రీడల్లో తమ జట్టుకు మార్గనిర్దేశం చేయాల్సిందిగా కోరుతోంది. డచ్ కోచ్ రాయిలెంట్ ఓల్ట్‌మన్స్ భారత హాకీ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఆయన పనిచేసిన కాలంలో టీమిండియా కొన్ని చిరస్మరణీయ విజయాలు సాధించింది. తమకన్నా బలమైన జట్లనూ ఓడించింది. భారత్‌కు సంబంధించిన అన్ని అంచెల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. ఇదే అనుభవాన్ని పాక్ ఉపయోగించుకోవాలని అనుకుంటోంది. ప్రస్తుతం ఓల్ట్‌మన్స్ ఒమన్‌లో ఉన్నారు. అక్కడే పాక్, జపాన్, ఒమన్ ముక్కోణపు టోర్నీలో తలపడుతున్నాయి. 'పాకిస్థాన్ హాకీ అధ్యక్షుడు, కార్యదర్శితో మాట్లాడేందుకు ఓల్ట్‌మన్స్ ఒమన్‌లో ఉన్నారు. ప్రస్తుత ప్రతిపాదనకు ఆయన ఒప్పుకుంటే ఏప్రిల్‌లో జరిగే కామన్వెల్త్ క్రీడల పోటీల్లో పాక్‌కు ఆయనే కోచ్‌గా ఉంటారు. తుది నిర్ణయం తీసుకునేందుకు ఆయనకు కొంత సమయం ఇచ్చాం. 2013 నుంచి భారత్‌లో ఉన్న ఆయనకు అన్ని విభాగాల్లోనూ విస్తృత అనుభవం ఉంది' అని పాక్ వర్గాలు వెల్లడించాయి. హాకీ ఇండియా 2013లో ఓల్ట్‌మన్స్‌ను హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్‌గా నియమించింది. 2015లో వివాదాస్పద రీతిలో భారత జట్టు కోచ్‌గా ఎంపికయ్యారు. అద్భుత విజయాలు సాధించినప్పటికీ గతేడాది టీమిండియా ఆశించిన మేరకు రాణించలేదు. ప్రపంచకప్‌కే చాలా కష్టపడి అర్హత సాధించింది. దీంతో హాకీ ఇండియా గతేడాది సెప్టెంబర్‌లో ఆయనను పదవి నుంచి తొలగించింది.

మహిళల టీ20 రద్దు

సెంచూరియన్: దక్షిణాఫ్రికా-భారత్ మహిళల మధ్య జరుగుతున్న నాలుగో టీ20 వర్షం కారణంగా రద్దయింది. వర్షం తగ్గినా.. అవుట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడం, మరి కొద్ది గంటల్లో పురుషుల మ్యాచ్ ఉండటంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఇదే భారత మహిళల టీ20 చరిత్రలో రద్దయిన తొలి మ్యాచ్‌కావడం విశేషం. దీంతో హర్మన్ ప్రీత్ సేన నిర్ణయాత్మక ఐదో టీ20 ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత మహిళలు చివరి మ్యాచ్ గెలిస్తే సిరీస్ వశం అవుతోంది. లేకుంటే డ్రాగా ముగుస్తుంది. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య జట్టు మ్యాచ్ నిలిచే సమయానికి 15.3 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. ఓపెనర్లు కెప్టెన్ నికెర్క్(55, 47 బంతులు, 6 ఫోర్లు, 2 సిక్సులు), లిజెల్లే లీ(59, 39 బంతులు, 2ఫోర్లు, 5 సిక్సర్లు, నౌటౌట్)లు రాణించారు. పురుషుల మ్యాచ్ కోసం మైదాన సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఐపీఎల్ ప్రాక్టీస్ సెషన్స్ షురూ..!

రాజస్థాన్ రాయల్స్ ముందంజ



ముంబై: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ ఇప్పటికే ఆట గాళ్లతో ప్రాక్టీస్ సెషన్స్ మొదలెట్టేసింది. అందుబాటులో ఉన్న స్వదేశీ క్రీడాకారులతో రాయల్స్ మంగళవారం ముంబైలో మూడు రోజుల సన్నాహక శిబిరం ఏర్పాటు చేసింది. ఆర్యమన్ విక్రమ్ బిర్లా, మిథున్, మహిపాల్ లొమ్రార్ తదితరులు పాల్గొన్నారు. మధ్యలో రహానె కూడా వచ్చి ఆటగాళ్లకు విలువైన సలహాలు, సూచనలు ఇచ్చాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీ తన ట్విటర్ ద్వారా అభిమానులతో పంచుకుంది. ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ ఏప్రిల్ 7న ప్రారంభంకానుంది. రెండేళ్ల నిషేధం తర్వాత 11వ సీజన్‌లో పునరాగమనం చేస్తోన్న రెండు జట్లలో ఒకటి రాజస్థాన్ రాయల్స్. దీంతో ఈ సీజన్ ఐపీఎల్‌ను రాజస్థాన్ రాయల్స్ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆచితూచి అడుగులు వేస్తోంది. మాజీ ఆటగాడు షేన్ వార్న్‌కు మెంటార్ బాధ్యతలు అందించింది. వార్న్ నాయకత్వంలోని రాయల్స్ జట్టు ఐపీఎల్ అరంగేట్ర సీజన్‌లో విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ప్లేయర్ రిటెన్షన్‌లో ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్‌ను మాత్రమే దక్కించుకున్న రాయల్స్ వేలంలో రహానె, స్టోక్స్, బట్లర్‌తో పాటు పలువురు కీలక ఆటగాళ్లను సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాజస్థాన్ తన తొలి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఏప్రిల్ 9న హైదరాబాద్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.



రెండోస్థానంలో ఆసిస్

దుబాయ్: వరుస విజయాలతో ముక్కోణపు టీ20 ట్రోఫీని కైవసం చేసుకున్న ఆసీస్ తాజా ర్యాంకింగ్స్‌లోనూ దూసుకుపోయింది. ఏకంగా 15 పాయింట్లు సాధించిన ఆసీస్ ఐసీసీ తాజాగా ప్రకటించిన జట్టు ర్యాంకింగ్స్‌లో కోహ్లిసేనను దాటి రెండో స్థానానికి ఎగబాకింది. ఇంగ్లండ్-న్యూజిలాండ్-ఆసీస్ మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ బుధవారంతో ముగిసింది. ఈ టోర్నీలో ఆసీస్ విజేతగా నిలిచింది. దీంతో ఆ జట్టు ఖాతాలో 15 పాయింట్లు వచ్చి చేరాయి. 126 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్‌తో సమానంగా నిలిచింది. కానీ, 0.19వ్యత్యాసం కారణంగా ఆసీస్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఇక 122 పాయింట్లతో కోహ్లిసేన మూడో స్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతోన్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేసినప్పటికీ ర్యాంకులో ఏమాత్రం తేడా ఉండదు. ఒకవేళ సిరీస్‌ను భారత్ 2-1తో చేజార్చుకుంటే మాత్రం పాయింట్లు కోల్పోతుంది.

ఈసారి.. రంగు మారుస్తా

స్టార్ షట్లర్ పీవీ సింధు



ముంబై: ఈసారి తన పతకం రంగు తప్పకుండా మార్చుకుంటానని భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ధీమా వ్యక్తం చేసింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధిస్తానని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. 'రజతం నుంచి పసిడి (పతకం) వర్ణంలోకి మారాలనుకుంటున్నా. నేను నా లక్ష్యాన్ని కచ్చితంగా సాధిస్తా. ఆ నమ్మకం ఉంది' అని సింధు వెల్లడించింది. రియోలో జరిగిన 2016 ఒలింపిక్స్‌లో కరోలినా మారిన్‌తో జరిగిన ఫైనల్లో హోరాహోరీగా పోరాడి ఓడిన సంగతి తెలిసిందే. బ్రిడ్జ్‌స్టోన్ సంస్థ సింధుతో పాటు షట్లర్ కిదాంబి శ్రీకాంత్, బాక్సర్ మేరీ కోమ్, రెజ్లర్ సాక్షి మాలిక్, స్టీపుల్ ఛేజర్ లలిత బాబర్‌ను బ్రాండ్ అంబా సిడర్లుగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా వారు ఆనందం వెలిబుచ్చారు. 'రియో-2016 ఒలింపిక్స్‌లో నా వరకు క్వార్టర్ పోరు హోరాహోరీగా సాగింది. వచ్చేసారి ఆ పరిస్థితిని మార్చుకొని ఫైనల్‌కు వెళ్లి పతకం సాధించాలని అనుకుంటున్నా. నా కలను తప్పకుండా నెరవేర్చుకుంటా' అని కిదాంబి శ్రీకాంత్ అన్నాడు. 'సింధు మాదిరిగానే నేనూ అవ్వాలనుకుంటున్నా. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలవాలని కోరుకుంటున్నా. ఇప్పుడు నేను టాప్-10లోకి అడుగుపెట్టా. కచ్చితంగా రాణిస్తా' అని లలిత బాబర్ పేర్కొంది. 'ప్రస్తుతం నా విభాగంలో జపాన్ నుంచి బలమైన ప్రత్యర్థి ఉన్నారు. ఆమెను ఓడించి రెజ్లింగ్‌లో స్వర్ణ పతకం గెలుస్తా' అని సాక్షి తెలిపింది.



క్రిస్‌లిన్‌కు గాయం..

నైట్‌రైడర్స్‌కు ఆందోళన

కోల్‌కతా: ఐపీఎల్-11 సీజన్ ప్రారంభం కాకముందే కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు కీలక ఆటగాడు ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మన్ క్రిస్‌లిన్ గాయపడ్డాడు. అతనికే నాయకత్వ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్న కోల్‌కతా ఫ్రాంఛైజీకి ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. రెండుసార్లు కోల్‌కతాను టోర్నీ విజేతగా నిలబెట్టిన గంభీర్‌ను కాదని వేలంలో రూ. 9.6 కోట్లకు ఈ స్టార్ బ్యాట్స్‌మన్‌ను తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ విధ్వంసకర ఆటగాడు టీ20 ట్రైసిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గాయపడ్డాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో కివీస్ ఆటగాడు రాస్ టేలర్ ఆడిన షాట్ బంతిని అందుకునేందుకు డైవ్ చేశాడు. ఈ క్రమంలో అతడి కుడిచేతి భుజానికి గాయం అయింది. వెంటనే క్రిస్‌లిన్‌ను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు స్కానింగ్ చేయగా ఎడమ చేతి భుజం ఎముకకు గాయమైనట్లు గుర్తించారు. వారి సూచన మేరకు బ్రేస్ ధరించి లిన్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చాడు. గత ఐపీఎల్‌లో బౌండరీ ఆపే ప్రయత్నంలో ఇదే తరహాలో గాయపడి తన ఎడమచేతి భుజానికి శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నాడు. ఇప్పటికే క్రిస్‌లిన్ మొత్తం మూడుసార్లు తన ఎడమ భుజానికి సర్జరీ చేయించుకున్నాడు. దీంతో దుబాయ్‌లో ప్రారంభం కాబోతున్న పాకిస్థాన్ ప్రీమియర్ లీగ్(పీఎస్‌ఎల్)కు పూర్తి స్థాయిలో దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో క్రిస్‌లిన్ ఐపీఎల్ వరకు కోలుకుంటాడో లేదో అని కోల్‌కతా శిబిరంలో ఆందోళనలు నెలకొన్నాయి.



కోహ్లి సంచలన నిర్ణయం

న్యూఢిల్లీ: రూ. 11,400 కోట్ల మేర కుంభకోణం జరిగిందంటూ వెల్లడించిన నాటినుంచి పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కు కష్టాలు మొదలయ్యాయి. ఇటీవలే సీబీఐ అధికారులు పీఎన్బీ బ్రాడిహౌస్ బ్రాంచి జీఎంను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యాంకు బ్రాండ్ అంబాసిడర్ విరాట్ కోహ్లి సైతం పీఎన్‌బీతో తెగతెంపులు చేసుకోనున్నట్టు సమాచారం. పీఎన్‌బీ హోదాకు మరింత వన్నె తీసుకొచ్చే విధంగా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి 2016లో బ్రాండ్ అంబాసిడర్ బాధ్యతలు భుజానికెత్తుకున్నాడు. మొండి బకాయిలతో కొట్టి మిట్టాడుతున్న ఈ బ్యాంకులో... కొత్త వినియోగదారులు ఖాతాలు తెరవాలంటూ ప్రమోట్ చేశాడు. ఇదే బ్యాంకులో కోహ్లి 16 ఏట నుంచే బ్యాంకు ఖాతా ఉండడం విశేషం. అయితే తాజాగా వెలుగు చూసిన కుంభకోణం వల్ల బ్యాంకుకు చెడ్డపేరు రావడంతో.. పంజాబ్ నేషనల్ బ్యాంకుకు గుడ్‌బై చెప్పనున్నట్టు సమాచారం. తాజా పరిస్థితుల నేపథ్యంలో విరాట్ కోహ్లి స్థానంలో ఎవరున్నా అదే పనిచేస్తారని... ప్రతికూలత ఉన్న బ్రాండును ఎవరు మాత్రం ఇష్టపడతారంటూ వార్తలు వెలువడుతున్నాయి. ఈ మేరకు కోహ్లి సన్నిహితులను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, ఆయన కుటుంబ సభ్యులు రూ.11 వేల కోట్ల మేర పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసగించి విదేశాలకు ఉడాయించిన సంగతి తెలిసిందే.



అంధుల క్రికెట్ వరల్డ్‌కప్ విజేతలకు సన్మానం

న్యూఢిల్లీ: ఇటీవల అంధుల ప్రపంచకప్ క్రికెట్‌లో సత్తా చాటిన టీమిండియా సభ్యులను సామాజిక న్యాయం, సాధికారత శాఖ కేంద్ర మంత్రి తవ్వార్‌చంద్ గెహ్లోట్ ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో సన్మానించారు. ఈ సందర్భంగా టీంకు రూ. 34 లక్షల క్యాష్ ప్రైజ్‌ను ప్రకటించారు. కేంద్ర సహాయమంత్రి రామ్‌దాస్ అతావాలె తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భవిష్యత్‌లో కూడా టీం ఇలానే పలు మ్యాచ్‌లో విజయం సాధించాలని కేంద్రమంత్రి గెహ్లోట్ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ఐదు ప్రాంతాల్లో జాతీయ స్పోర్ట్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నిర్దేశకత్వంలో ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని కేంద్రసహాయమంత్రి రామ్‌దాస్ ఈ సందర్భంగా తెలిపారు. అంధుల క్రికెట్ టీంను ఆయన అభినందించారు. దేశాన్ని గర్వించేలా చేశారని కొనియాడారు.

పుజారా ముందస్తు వ్యూహం



న్యూఢిల్లీ: ఏప్రిల్‌లో అందరు క్రికెటర్లు ఐపీఎల్‌కు అతుక్కుపోతే టీమిండియా నయావాల్ ఛతేశ్వర్ పుజారా ఇంగ్లండ్ సిరీస్ కోసం ముందుగానే సన్నాహం మొదలుపెట్టాడు. ఆగస్టులో ఇంగ్లండ్ జట్టుతో ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్‌కు ముందుగా అక్కడ కౌంటీ క్రికెట్ ఆడనున్నాడు. 'ఆగస్టులో మనం టెస్టు మ్యాచులు ఆడాల్సి ఉన్న నేపథ్యంలో నేను కౌంటీల్లో సత్తా చాటాలని కోరుకుంటున్నాను. 2015లో కౌంటీ చాంపియన్‌షిప్ గెలిచినప్పుడు నేను యార్క్‌షైర్‌తో ఉన్నాను. నాణ్యమైన ప్రొఫెషనల్ ఆటగాళ్లున్న జట్టది. వారితో కలిసి ఆడటం నన్ను మరింత మెరుగైనవాడిగా చేస్తుంది' అని పుజారా అన్నాడు. ముందుగానే అక్కడ ఆడటం వల్ల అక్కడి వాతావరణం, పిచ్‌ల స్వభావం తెలుస్తుందని పుజారా అభిప్రాయం. 'హెడింగ్లేలో సమ్మర్‌కు ముందుగానే 4, 6 డిగ్రీల వేడి వాతావరణంలో ఆడటం ఏ బ్యాట్స్‌మన్ టెక్నిక్‌కైనా పరీక్ష లాంటిదే. కనీసం 50 పరుగులు చేయడమూ కష్టమే. అయితే భారత్ పర్యటన ఆరంభమైనప్పుడు వాతావరణం బాగానే ఉంటుంది. నేనిప్పుడు ఆడనున్న డివిజన్ 1 కౌంటీ వల్ల ప్రయోజనం ఉంది. మిడిలెసెక్స్‌తో లార్డ్స్‌లో, వార్విక్‌షైర్‌తో బర్మింగ్‌హామ్‌లో, సర్రేతో ఓవల్‌లో టెస్టులు ఆడాల్సి ఉంటుంది. భారత్ తరఫున ఆడుతున్నప్పుడు ఈ పరిస్థితులు నాకు అనుకూలిస్తాయి' అని పుజారా అన్నాడు.

ఆ క్రెడిట్ అంతా భువీదే : శ్రీకాంత్

సెంచూరియన్: సౌతాఫ్రికా టూర్‌లో భారత్ గెలుపు జోరు కొనసాగిస్తున్నందుకు సంతోషంగా ఉందని మాజీ క్రికెట్ కృష్ణమాచారి శ్రీకాంత్ పేర్కొన్నాడు. విలేకరలతో మాట్లాడుతూ మొదటి టీ20లో కోహ్లిసేన సూపర్ విక్టరీని అందుకుందంటే ఆ క్రెడిట్ భువనేశ్వర్‌దే. మ్యాచ్‌లో రెండు కీలక సమయాలు పవర్ ప్లే, డెత్ ఓవర్లలో అతడు అద్భుత ప్రదర్శన చేశాడు. ఆ సమయంలో బ్యాట్స్‌మెన్ ఎదురుదాడి వ్యూహంతో ఉంటారు. కానీ వారికి భువీ ముకుతాడు వేశాడు. స్కోరుబోర్డును గమనిస్తే ఒక్క భువీని తప్పించి మిగతా బౌలర్లందరిపైనా సఫారీ బ్యాట్స్‌మెన్ బ్యాట్ ఝుళిపించారు. అసలు భువీ ఇంతగా చెలరేగడానికి కారణం? అతడి యాక్షన్, బంతిని స్వింగ్ చేసే నైపుణ్యమే. వీటికితోడు నకుల్ బాల్‌తో మరింత ప్రమాదకరంగా మారాడు. ఇలాంటి వైవిధ్య బంతులు సంధిస్తున్నాడు కాబట్టే సఫారీలు బెంబేలెత్తిపోతున్నారు. పరుగులను అరికట్టడమే కాదు వికెట్లు తీయడం వల్ల కూడా మ్యాచ్‌పై పట్టుబిగించేలా చేస్తున్నాడు. మొదటిస్పెల్‌లో రెండు వికెట్లు కూల్చిన భువీ.. చివర్లో మూడు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని కోలుకోలేని దెబ్బ తీశాడు. సౌతాఫ్రికా జట్టు ఇంతపేలవ ఆటతీరును ప్రదర్శించడం ముందెన్నడూ చూడలేదు. జట్టు సెలెక్షన్‌లో తప్పిదం జరిగిందని అనిపిస్తోంది. బ్యాటింగ్‌లో డుమిని, మిల్లర్ రాణించకపోవడం ఆ జట్టుపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని అభిప్రాయపడ్డాడు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు బహుళ ప్రయోజనాల కమిటీ

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా ప్రభుత్వం బహుళ ప్రయోజనాల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. మాదక ద్రవ్యాల నిరోధక సంస్థ (ఎన్‌సీబీ) పర్యవేక్షణలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఈ కమిటీ పని చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనురాధ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సీఐడీ అదనపు డీజీపీ, అటవీశాఖ అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, ఎక్సైజ్ కమిషనర్ సభ్యులుగా ఉంటారు. పలు రాష్ట్రాలలో మాదక ద్రవ్యాల నియంత్రణను మరింత కట్టు దిట్టంగా అమలు చేసేందుకు ఎన్‌సీబీ రాష్ట్రాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయి స్తుంది. ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలతో చర్చించేందుకు ఈ కమిటీ పని చేస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

క్యాష్‌కు కటకట..!

- నో క్యాష్ బోర్డులతో దర్శనమిస్తున్న ఏటీఎంలు
- ప్రజల ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో-కడప: కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌డీఏ బిల్లు పెడతామన్న వార్తలు ప్రజలను భయాందోళనకు గురి చేసింది. తద్వారా బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి వస్తుందో, రాదోనన్న అనుమానాలతో డిపాజిట్లు చేసిన సొమ్మును డ్రా చేసుకోవడమే కాకుండా డ్రా చేసుకున్న డబ్బుతో భూములు, ఇళ్లు కొనుగోలు చేసుకుంటున్నారు. బ్యాంకులో డ్రా చేసిన డబ్బు తిరిగి బ్యాంకుకు జమ కాకపోవడంతో బ్యాంకులలో రొటేషన్ తక్కువైంది. తద్వారా ఏటీఎంలలో నిలువ ఉంచక పోవడంతో నో క్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉంటే డిసెంబర్ నుంచే ప్రజలు తమ వద్ద వున్న ఫిక్సిడ్ డిపాజిట్లను సేవింగ్ ఖాతాలో వున్న మొత్తాన్ని డ్రా చేసుకుని ఆస్తులు కొనుగోలు చేసుకుంటున్నారని తెలుస్తోంది. అంతేకాకుండా ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు పార్లమెంటులో పెడతామన్న సంచలన వార్తను ఇటు ప్రజలు, అటు బ్యాంకు ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ప్రజలు సకాలంలో బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకుంటామో, లేదోనన్న అనుమానంతో బ్యాంకులలో డిపాజిట్ చేయడమే తక్కువైంది. బ్యాంకులో డబ్బు నిల్వ ఉంచితే దీని ద్వారా అత్యవసర సమయంలో సకాలంలో చేతికి డబ్బు అందకపోతే ఇబ్బంది పడతామన్న అపోహతో మరికొంత మంది బ్యాంకు అకౌంట్లలో వేయడం మానేశారు.

అపోహలను నమ్మొద్దు

రోజూ డబ్బులు రూ.2 కోట్లు డ్రా చేసుకుంటే అందులో రూ.20లక్షలు కూడా తిరిగి బ్యాంకులకు జమ కావడం లేదు. ఎఫ్‌ఆర్‌డీఐ వల్ల ఇబ్బంది జరుగుతుందని ప్రజలు ఖాతాల్లో డబ్బులు నిల్వ ఉంచక పోవడంతో బ్యాంకులో క్యాష్ కొరత వల్ల సకాలంలో ఇవ్వాల్సిన లోన్లు కూడా నిలిపివేయాల్సి వస్తోందని కడప ఆంధ్రాబ్యాంక్ జోనల్ సెక్రటరీ అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఖాతాదారులు తమ ఖాతాల్లో ఉన్నే డబ్బు డ్రా చేసుకున్నదాంట్లో 20 శాతం కూడా తిరిగి బ్యాంకులకు రాకపోవడం వల్లే బ్యాంకుల్లో నిల్వ తగ్గిందని తెలుస్తుంది. అలాగే వ్యాపారస్తులు తమ అవసరాలకు నిల్వ ఉంచిన డబ్బు ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు పెడితే తమ డబ్బులు ఎక్కడ ఇరుక్కుపోతాయోనన్న భ్రమలో కస్టమర్లున్నారు. కాబట్టి బ్యాంకుల దగ్గర నిల్వ లేకపోవడంతో అటు ఏటీఎంలలో కూడా బ్యాంకులు డబ్బు పెట్టే స్థితిలో లేవు. బ్యాంకు అవసరానికి తగ్గట్టు రిజర్వ్ బ్యాంకు నుంచి కూడా డబ్బు సకాలంలో అందకపోవడం కూడా అపోహలున్నాయి అని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఉమెన్ కౌన్సిల్ మెంబర్ లలితా రెడ్డి తెలిపారు.

నిండుకుంటున్న నిల్వలు

విజయనగరం: ప్రజలకు బ్యాంకులపై విశ్వాసం రోజు రోజుకూ సన్నగిల్లుతోంది. దీంతో తమ నగదును బ్యాంకుల నుంచి ఉపసహరించుకొనేందుకు జనం ఎగబడుతున్నారు. కాస్తోకూస్తో దాచుకున్న సొమ్మును కూడా బ్యాంకుల నుంచి సకాలంలో తీసుకొనే పరిస్థితి లేదు నగదు విత్‌డ్రాలో కోత పెట్టడంతో పాటు, ఏటీఎంలు కూడా నిండుకున్నాయి. ఏ ఏటీఎంల వద్దకూడా నో క్యాష్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. ఒకవేళ నగదు ఉంటే చాంతాడంత క్యూలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్న ఖాతాదారులు, ఉన్న నగదు మొత్తాన్ని ఊడ్చేసి పట్టుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఫలితంగా దాదాపు అన్ని బ్యాంకుల్లో నగదు ఖాళీ అవుతూ వస్తోంది. వచ్చిన డబ్బు వచ్చినట్టే వెళ్లిపోతోంది తప్ప, బ్యాంకుల్లో తిరిగి నగదు జమ కాకపోవడం గమనార్హం. ప్రభుత్వ నిరంకుశ విధానాల ఫలితంగా బ్యాంకింగ్ రంగం పూర్తిగా కుదేలవుతుంది. చివరికి స్టేట్‌బ్యాంకు సైతం నగదుకోసం ప్రైవేటు బ్యాంకులపై ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. ముఖ్యంగా ప్రతీనెలా మొదటివారం వస్తే, బ్యాంకు అధికారులకు నగదును సర్దుబాటు చేయడం సవాలుగా మారింది. ఒక్క మొదటివారమే జిల్లాలో నగదు అవసరాలకోసం స్టేట్‌బ్యాంకుకు సుమారు రూ.100 కోట్లు అవసరం అవుతోంది. రోజురోజుకూ పెద్ద మొత్తాలను రియల్ ఎస్టేట్, బంగారం కొనుగోలుకు మళ్లిస్తున్నారు. అందువల్లే రియల్ ఎస్టేట్ వ్యాపారం మళ్లీ ఊపందుకుంటోంది. అలాగే బంగారం ధరలు కూడా నింగినంటుతుండటం ఇదీ ఒక కారణంగా భావిస్తున్నారు. గతంలో ప్రైవేటు బ్యాంకులు ఏ అవసరం వచ్చినా, స్టేట్‌బ్యాంకు వైపు ఆశగా చూసేవి. కానీ ప్రస్తుతం స్టేట్‌బ్యాంకు పరిస్థితి దయనీయంగా మారింది. చివరికి ప్రైవేటు బ్యాంకుల నుండి అప్పులుతెచ్చుకొనే పరిస్థితి దాపురించింది.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.